www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2015-17
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 66 | సంచిక : 194 | గురువారం 04-01-2018 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam | వెల: రూ.3.00 | పేజీలు : 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

దళిత మహోందోళన...!



అట్టుడికిన మహారాష్ట్ర బంద్ విజయవంతం

- రోడ్డెక్కిన 250 దళిత సంఘాలు
- మతోన్మాదులపై ఆగ్రహజ్వాల
- స్తంభించిన ముంబై నగరం
- రవాణా అస్తవ్యస్తం
- భారీగా బలగాల మోహరింపు

విశాలాంధ్ర-ముంబై : భీమా కోరెగావ్ యుద్ధం ద్విశత వార్షికోత్సవాల నేపథ్యంలో...హిందోన్మాదుల దాడులపై దళితులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. బుధవారం మహారాష్ట్రను దిగ్బంధం చేశారు. రైళ్ల రోకోలు, రాస్తారోకోలతో జనజీవనాన్ని స్తంభింప జేశారు. మరోవైపు ఇదే అంశంపై ఉభయ సభలు అట్టుడికిపోయాయి. దేశవ్యాప్తంగా హిందోన్మాదశక్తులు చెలరేగిపోతున్నాయని, దళితులపై దాడులు జరుపుతున్నాయని మోడీ సర్కారును ప్రతిపక్షాలు తూర్పారబట్టాయి. భీమా కోరెగావ్ యుద్ధం ద్విశత వార్షికోత్సవాల నిర్వహణపై దళితులు, మితవాద సంస్థల - మిగతా 11 లో



పార్లమెంట్‌లో 'మహా దళిత' మంట...! 11 లో

మినీ టిప్పర్ బోల్తా

ఏడుగురు కూలీలు దుర్మరణం

- పది మందికి తీవ్రగాయాలు
- కర్నూలు జిల్లా ఆస్పరిలో దుర్ఘటన



విశాలాంధ్రబ్యూరో కర్నూలు/ఆస్పరి : అతి వేగం ఏడు నిండు ప్రాణాలను బలిగొంది. మినీ టిప్పర్ టైరు పగిలి అదుపుతప్పి బోల్తా పడటంతో ఏడుగురు మృతి చెందారు. ఈ ఘటన ఆస్పరి మండలం చిన్నహెూతూరు గ్రామ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మరో పది మందికి తీవ్రగాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు హెూళగుంద మండలం కొత్తపేట గ్రామానికి చెందిన సుమారు 17 మంది గ్రామంలో పనులు లేక పొరుగు రాష్ట్రం తెలంగాణాకు వలస పోయారు. నల్గొండ జిల్లా డోన్‌పల్లిలో పత్తి కూలీ పనులు చేసుకుంటూ 60 రోజుల పాటు అక్కడే పనులు చేసుకున్నారు. అయితే పనులన్నీ పూర్తికావడంతో తిరిగి స్వగ్రామానికి మంగళవారం సాయంత్రం బయలుదేరారు. బియ్యం ధర అక్కడ తక్కువగా ఉండటంతో బియ్యం కొనుగోలు చేసి లారీలో వేసుకొని బయలుదేరారు. సుమారు 600 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేశారు. మరో 50 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేస్తే స్వగ్రామం చేరుకొని తన కుటుంబ సభ్యులను, బంధువులను, గ్రామస్తులను చూసుకుంటామని ఆనందోత్సాహాలతో ఉన్నారు. అయితే వారి ఆనందం ఎంతోసేపు నిలవలేదు. అతివేగం - మిగతా 2 లో

సీమను అభివృద్ధి చేస్తా

పులివెందుల జన్మభూమి సభలో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర-పులివెందుల : కరవు కాటకాలకు ఆలవాలమైన రాయలసీమను రతనాల సీమగా మారుస్తా.. రాబోవు కాలంలో సీమను దేశానికి మణిహారంగా చేస్తా.. కడప జిల్లాలో కృష్ణా జలాలను చూడటమనేది నా సుకృత జన్మగా భావిస్తున్నా.. ఎన్ని అవరోధాలెదురైనా పట్టిసీమ నీటిని రాయలసీమకు తీసుకువచ్చా.. పేదల పక్షపాతిగా ఉండాలన్నదే తమ జీవితాయశమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. వైఎస్సార్ కడప జిల్లా పులివెందుల పట్టణ ధ్యాన్‌చంద్ క్రీడా మైదానంలో బుధవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కరవులతో సతమతమయ్యే రైతాంగాన్ని ఆదుకోవడం కోసం 124 టీఎంసీల నీటిని తెప్పించానని అన్నారు. ఇందులో కడప జిల్లాకు 40 టీఎంసీల నీటిని కేటాయించారన్నారు. సీమలో బంగారాన్ని పండించే - మిగతా 2 లో

గజల్ శ్రీనివాస్‌కు

బిగుస్తున్న ఉచ్చు

- మరిన్ని వీడియోలు బహిర్గతం
- బెయిల్ ఇవ్వొద్దని పోలీసుల స్పష్టీకరణ
- విచారణ నేటికి వాయిదా



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : లైంగిక వేధింపుల కేసులో గజల్ శ్రీనివాస్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి కొత్త ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. మరో 20 వీడియోలను బాధితురాలు బుధవారం పంజాగుట్ట పోలీసులకు అందించింది. మరోపక్క శ్రీనివాస్ పెట్టుకున్న బెయిల్ దరఖాస్తుపై విచారణ గురువారానికి వాయిదా పడింది. బెయిల్ ఇవ్వవద్దని, బెయిల్ ఇస్తే సాక్ష్యాలను శ్రీనివాస్ తారుమారు చేయడం, బాధితురాలిని బెదిరించే అవకాశం ఉందని పోలీసులు కోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేశారు. సెక్షన్ 164 ప్రకారం బాధితురాలి వాంగ్మూలాన్ని మెజిస్ట్రేట్ సమక్షంలో నమోదు చేసేంత వరకు బెయిల్ ఇవ్వవద్దని ఆ పిటిషన్‌లో స్పష్టం చేశారు. శ్రీనివాస్‌ను వారం రోజుల పాటు తమ కస్టడీకి అప్పగించాలని, అలా అప్పగిస్తే తాము శ్రీనివాస్‌ను విచారిస్తామని, అప్పుడు మరికొంత మంది బాధితులు బయటకు - మిగతా 2 లో

సెలెక్టు కమిటీకి

ట్రిపుల్ తలాక్ బిల్లు

- ఏకాభిప్రాయం తప్పనిసరి
- హిందుత్వ శక్తుల దాడులు దారుణం : సురవరం



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ట్రిపుల్ తలాక్ బిల్లును సెలెక్ట్ కమిటీకి, పార్లమెంటు కమిటీకి పంపాలని నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకరరెడ్డి డిమాండు చేశారు. ఆదరాబాదరాగా బిల్లును ఆమోదింప చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. ముస్లిం పేద మహిళలకు న్యాయం జరిగే విధంగా చట్టంలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండు చేశారు. ట్రిపుల్ తలాక్ బిల్లు లోక్‌సభలో ఆమోదం పొందింది. రాజ్యసభలో ఆమోదం కోసం ప్రభుత్వం బిల్లు ప్రవేశపెట్టిందని సురవరం తెలిపారు. బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డితో కలిసి సురవరం మాట్లాడుతూ ట్రిపుల్ తలాక్ బిల్లుకు సీపీఐ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. బిల్లులో బీజేపీ సవరణలు ప్రతిపాదించడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అంతర్గత సంస్కరణలు అవసరమని నొక్కి చెప్పారు. తలాక్ చెల్లదని సుప్రీంకోర్టు సైతం చెప్పిందన్నారు. ఒకేజాతి, ఒకే చట్టం పేరుతో బీజేపీ అనేక సమస్యలు సృష్టిస్తుందని చెప్పారు. చట్టం మంచిదైనప్పటికీ దాని - మిగతా 2 లో

దుర్గగుడిపై దుమారం

- క్షుద్రపూజలు జరిగాయని వదంతులు
- అనుమానాలకు తావిస్తున్న అధికారులు, పూజారుల వైఖరి
- శుద్ధి మాత్రమే చేశామంటున్న ఈవో, ప్రధాన అర్చకుడు
- క్షుద్ర పూజలు నిజమే : గౌరంగబాబు





ఈవో సూర్యకుమారి



పార్థసారథి

విశాలాంధ్ర-విజయవాడ(వన్‌టౌన్) : ప్రసిద్ధ శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో క్షుద్ర పూజలు చేశారంటూ మొదలైన ప్రచారం పెద్ద దుమారాన్ని లేపింది. దేవస్థానంతో సంబంధం లేని వ్యక్తి అర్ధరాత్రి వేళ అమ్మవారి అంతరాలయంలో తిరిగినట్లు, కొత్త పూలదండలతో పూజలు చేసినట్లు సీసీ టీవీ ఫుటేజీలు బయటకు రావడంతో ఈ విషయం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. అయితే, ఆలయంలో క్షుద్ర పూజలు జరగలేదని, కేవలం శుద్ధి మాత్రమే చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారిణి సూర్యకుమారి, ప్రధాన అర్చకుడు బద్రీనాథ్ చెబుతున్నారు. కానీ వారు చెబుతున్న మాటలకు, ఆలయంలోని సీసీ టీవీ ఫుటేజీలు, ఘటన జరిగిన సమయం, తీరుకు పొంతన లేకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో దుర్గగుడి ఈవో సూర్యకుమారి బదిలీ అయ్యారని - మిగతా 2 లో



మాట్లాడుతున్న రామకృష్ణ. పక్కన ముప్పాళ్ల, జల్లి విల్సన్, రావుల

రాజధానికి ప్రపంచ బ్యాంకు రుణమా?

- కేంద్ర ప్రభుత్వ సహకారం ఇదేనా?
- టీడీపీ ఎంపీల హర్షం గర్హనీయం
- మళ్లీ మళ్లీ తప్పులు చేస్తున్న చంద్రబాబు : కె రామకృష్ణ

3 లో



ఎమ్మెస్ సుబ్బులక్ష్మి కూతురు

రాధ కన్నుమూత

- ప్రముఖ కర్నాటక గాయనిగా ప్రసిద్ధి

11 లో

ఇదీ లోకం!



న్యాయవ్యవస్థలో ప్రతిష్టంభన

న్యూఢిల్లీ: 2017లోనూ న్యాయవ్యవస్థలో ప్రతిష్టంభన కొనసాగింది. న్యాయవ్యవస్థతో పలు అంశాల్లో కేంద్ర ప్రభుత్వం, న్యాయమంత్రిత్వశాఖ విభేదాలు ఇందుకు కారణంగా ఉంది. ముఖ్యంగా ముమ్మారు తలాక్ బిల్లు, ప్రవాసభారతీయులకు ప్రాతినిధ్య ఓటింగు వంటి అంశాల్లో న్యాయమంత్రిత్వశాఖదిపై చేయిగా ఉంది.కాగా, న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి ముఖ్యంగా హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి కొలీజియం ఏర్పాటు విషయంగా తలెత్తిన వివాదానికి పరిష్కారం లభించలేదని తెలుస్తోంది. ఈ వివాదానికి పరిష్కారం లభించని కారణంగా ఇంత వరకు అమలులో ఉన్న విధానం ద్వారానే న్యాయమూర్తుల నియామకాలను జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. న్యాయమూర్తుల నియామకాల్లో పారదర్శకత లోపించిందన్నది ప్రభుత్వ వాదన. ఈక్రమంలో న్యాయమూర్తుల నియమకాల కోసం హైకోర్టు కొలీజియంలు ప్రతిపాదించిన జడ్జీల అర్హతలు తదితర అంశాలను ప్రభుత్వం నిశిత పరిశీలన జరుపుతోంది. ముమ్మారు తలాక్‌ను నేరంగా పరిగణించాలన్న బిల్లుకు ఆమోదం లభింపజేసేందుకు న్యాయశాఖ గట్టి ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎంతో కాలంగా చర్చల్లో ఉన్న ప్రవాస భారతీయులకు దేశీయ ఎన్నికల్లో ప్రాతినిధ్య ఓటింగు అంశమూ బిల్లు రూపంలో లోక్‌సభలో చర్చకు నిలిచింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు విదేశాల నుంచి భారత్‌కు రావడం వ్యయప్రయాసలకు లోను చేసేదిగా ఉందన్న ప్రవాస భారతీయుల వాదనకు కేంద్రప్రభుత్వం సానుకూలంగా స్పందించి ఈమేరకు చర్యలు తీసుకుంది. ఏ ఎన్నికలోనైనా తాము ప్రతిపాదించిన అభ్యర్థి ద్వారా తమ ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు ఎన్నారైలకు ఈబిల్లు కల్పిస్తోంది. సైనిక బలగాల ఓటింగ్ విధానంలోనూ ఈ బిల్లు కొన్ని సవరణలను ప్రతిపాదిస్తోంది.

హైకోర్టు ఆదేశాలతో

కోడి పందేలకు అడ్డుకట్ట

- సమర్థంగా జంతు, గేమింగ్ చట్టాలు అమలు
- పందేలు, కోడిపుంజుల ఫారాలపై దాడులు
- రెవెన్యూ, పోలీసులతో ఉమ్మడి కమిటీలు
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీపీలకు సీఎస్, డీజీపీ ఆదేశాలు



విశాలాంధ్రబ్యూరో - అమరావతి : సంక్రాంతి పండుగ సమయంలో రాష్ట్రంలో కోడి పందేలు, జూద క్రీడల నిర్వహణపై హైకోర్టు హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు, కోస్తా జిల్లాల్లో పెద్ద ఎత్తున కోడి పందేలు, ఇతర జూద క్రీడలు జరుగుతున్నా అడ్డుకునేందుకు ప్రభుత్వంగానీ, పోలీసు యంత్రాంగంగానీ చర్యలు చేపట్టకపోవటంపై హైకోర్టు ధర్మాసనం సీరియస్ అయింది. సంక్రాంతి పండుగ సమయంలో కోడి పందేలు నిర్వహిస్తే అందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర పోలీసు డైరెక్టర్ (డీజీపీ) బాధ్యత వహించాలని హెచ్చరించింది. మరోవైపు సీఎం చంద్రబాబు కూడా కోడి పందేలు, జూద క్రీడలకు అనుమతి ఇచ్చే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు సీఎస్, డీజీపీ అప్రమత్తమయ్యారు. ఈసారి పండుగకు కోడి పందేల నిర్వహణకు ఎక్కడా అనుమతించకూడదని నిర్ణయించారు. వారు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో ప్రత్యేకంగా మాట్లాడి మండల, జిల్లాస్థాయిలో పందేలు, జూద క్రీడల నిరోధానికి, దాడులు నిర్వహించేందుకు కమిటీలు వేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఒకవైపున కోడి పందేల నిర్వాహకులు ఇప్పటికే సంక్రాంతికి పందేలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై హైకోర్టులో పిటీషన్ దాఖలుకాగా విచారణకు అనుమతించిన హైకోర్టు మంగళవారం సీరియస్ వార్నింగ్ ఇచ్చింది. ప్రజా ప్రతినిధులే స్వయంగా పందేల నిర్వహణకు ఉపక్రమించటం, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్, ఎస్పీ దాఖలు చేసిన కౌంటర్‌లో పూర్తి వివరాలు లేకపోవటంతో హైకోర్టు ధర్మాసనం మండిపడిన విషయం విధితమే. గురువారం ఇదే విషయంపై హైకోర్టులో వాదనలు జరగనున్న నేపథ్యంలో రాష్ట్రంలోని జిల్లాలు, మండలాల వారీగా కోడి పందేలు, జూద క్రీడల నిరోధానికి ప్రత్యేకంగా పోలీసు, రెవెన్యూ, పశుసంవర్ధకశాఖ అధికారులతో ఉమ్మడి కమిటీలు వేసే పనిలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు నిమగ్నమయ్యారు. విజయవాడ పోలీస్ కమిషనర్ గౌతం సవాంగ్ - మిగతా 11 లో

పెరూ బస్ ప్రమాదంలో 48మంది మృతి



లిమా : పెరూలో జరిగిన బస్ ప్రమాదంలో 48మంది మృతిచెందారు. బస్సులో 57మంది ప్రయాణీకులున్నారని ట్రాక్టర్ ట్రైలర్‌ను ఢీకొని ఈ ప్రమాదం జరిగిందని అధికారవర్గాలు తెలిపాయి. మంగళవారం ఇరుకుగావున్న రహదారిపై మలుపుతిరుగుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాలీని ఢీకొని బస్సు బోల్తాపడింది. పెరూ రాజధాని లిమానుంచి బస్సు బయలుదేరింది. పసిఫిక్ మహాసముద్ర తీరంలో రహదారిపైన వెళుతుండగా రాళ్లతోనిండివున్న బీచ్‌వైపు బస్సు బోల్తాపడింది. దేశాధ్యక్షుడు పెడ్రొపాబ్‌లొకుజినిస్కీ ప్రమాదంపై విచారం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. లిమా నగరానికి ఉత్తరంవైపు 70 కి.మీ దూరంలో పసమయొ ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. ఆ ప్రాంతానికి చేరుకోవడం సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు చాలా కష్టమయ్యిందని తెలుస్తోంది. బీచ్‌వైపు వెళ్లడానికి రహదారి లేకపోవడంవల్ల సహాయ కార్యక్రమాలు తేలికగా జరగలేదని అందుకు చాలా ఇబ్బందులు పడవలసి వచ్చిందని పోలీసులు తెలిపారు. జీవించివున్న ప్రయాణీకులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు హెలికాప్టర్లను వినియోగించారు. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రమాదానికి గురైన రెండు వాహనాలు అత్యధిక వేగంతో ప్రయాణిస్తున్నాయని రవాణాశాఖ మంత్రి బ్రూనొగిఫ్రా తెలిపారు. గత అర్ధరాత్రివరకు సహాయ కార్యక్రమాలు కొనసాగాయి. ప్రయాణీకులకు సంబంధించిన వస్తువులను దొంగిలించేందుకు వచ్చిన ఒక వ్యక్తిని అనుమానితుడిగా పరిగణిస్తూ అరెస్టు చేసినట్టు అధికారవర్గాలు తెలిపాయి. పెరూ రహదారుల్లో ప్రమాదాలు చాలా సర్వసాధారణంగా జరుగుతున్నాయి. 2016లో జరిగిన పలు ప్రమాదాల్లో 2600 మంది చనిపోయారు.

ప్రపంచం

ఇరాన్‌లో జోక్యానికి అమెరికా రెడీ



వాషింగ్టన్ : ఇరాన్‌లో జోక్యానికి అమెరికా రెడీఅయినట్టుగా కనిపిస్తోంది. ప్రస్తుతం ఇరాన్‌లో నిర్వహిస్తున్న నిరసనలను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్న అధికారులపైన ఆంక్షలు విధిస్తామని అమెరికా ప్రతినిధుల సభ హెచ్చరించింది. దేశీయ భద్రత కమిటీ చైర్మన్ మైఖేల్ మాక్కూల్ విడుదల చేసిన ప్రకటనలో ఆంక్షలు విధించేందుకు చట్టం తీసుకువస్తామని తెలిపారు. త్వరలో ఇందుకు సంబంధించిన బిల్లును తాను సభలో ప్రవేశపెడతానని అన్నారు. ఇరాన్‌లో మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని ఆరోపిస్తూ ఇందుకు బాధ్యులైన వారిపైన కూడా ఆంక్షలు విధిస్తామని తెలిపారు. గత ఐదారు రోజులుగా ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు వెల్లువెత్తుతున్నాయి. అయితే, స్వేచ్ఛ కోసమే అక్కడి ప్రజలు నిరసన తెలుపుతున్నారని వారిని అణచివేయడం ద్వారా మానవ హక్కులను ఉల్లంఘిస్తున్నారని అమెరికా ఆరోపిస్తోంది. అది వారి అంతరంగిక సమస్యని, ఇతరులు జోక్యం చేసుకోరాదని రష్యా వ్యాఖ్యానించింది. ఇదిలావుండగా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రి ఇరాన్ పర్యటనను వాయిదావేసుకున్నారు. సంయమనం పాటించాల్సిందిగా ఇరాన్ అధ్యక్షుడు హసన్ రౌహనికి ఫ్రాన్స్ ప్రధానమంత్రి మాక్రాన్ విజ్ఞప్తి చేశారు. సోషల్ మీడియాను నిరసనకారులకు అందుబాటులో ఉంచాలని అమెరికా విదేశాంగ శాఖ కోరింది. ఇరాన్‌లో నిరసన ప్రదర్శనలన్నీ అప్పటికప్పుడు అనుకుని చేసినవేనని ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారి నిక్కీహేలి వ్యాఖ్యానించారు. అంతేకాదు, నిరసనకారులకు తాము మద్దతు తెలుపుతున్నట్టు ఆమె ప్రకటించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇరాన్‌తో కుదిరిన అణు ఒప్పందాన్ని రద్దు చేసుకుంటానని ప్రకటించడమే కాక, ఇరాన్ పాలకులపైన ఆగ్రహం ప్రకటిస్తున్నాడు. అలాగే ఆంక్షలను విధించారు. ట్రంప్, నిక్కీహేలి తదితర అమెరికా నేతల ప్రకటనలన్నీ ఇరాన్‌లో జోక్యం చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారన్న సంకేతాలు ఇస్తున్నాయి.

మా అణుబటన్ పెద్దది, శక్తివంతమైంది

కిమ్‌కి సమాధానంగా ట్రంప్ వ్యాఖ్య



వాషింగ్టన్ : 'మా అణుబటన్ మరింత పెద్దది, మరింత శక్తివంతమైంది' అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పుకున్నారు. ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జాంగ్‌ఉన్ తన టేబుల్‌మీదనే అణుబటన్ ఉన్నదని హెచ్చరించిన నేపథ్యంలో ఆయనకు సమాధానంగా ట్రంప్ వ్యాఖ్యానించారు. తాజాగా ట్రంప్ ఈ అంశాన్ని ట్వీట్ చేశారు. అణ్వాయుధాలు కలిగిన రెండు దేశాల నేతలు ఒకరిపై ఒకరు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. ట్రంప్ వ్యాఖ్యానాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో ట్రంప్ ఆగ్రహించాడు. మీడియాపై చిందులు వేశాడు. అవినీతి మీడియా అంటూ మాట్లాడారు. పాలస్తీనాకు సహాయంలో కోత విధిస్తానని ప్రకటించినప్పటికీ మీడియా ప్రశంసించటం లేకపోతే గౌరవించడం లాంటి ఆసక్తిని చూపలేదని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడుగా ఎవరు ఉన్నప్పటికీ అణ్వాయుధాలకు సంబంధించిన కోడ్స్ అన్నీ ఆయన చేతిలోనే ఉంటాయి. ప్రపంచంలో అత్యధిక అణ్వాయుధాలు ఇతర ఆయుధాలను కలిగివున్న దేశం అమెరికా. తమవద్ద కూడా అణ్వాయుధాలు ఉన్నాయని అమెరికాలోని ఏ ప్రాంతంపైన అయినా తాను దాడిచేయగలమని ఉత్తరకొరియా పలుమార్లు ప్రకటించింది. విశ్లేషకులు కూడా ఉత్తరకొరియా వద్ద అణ్వాయుధాలు ఉన్నట్టుగా పేర్కొన్నారు. ఒకవైపు ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పటికీ ఉత్తరకొరియా, సౌత్‌కొరియా అధికారులతో టెలిఫోన్ హాట్‌లైన్లో మాట్లాడినట్టుగా తెలుస్తోంది. కొరియా ద్వీపకల్పంలో ఇది ఒక మంచి పరిణామంగా భావిస్తున్నారు. ట్రంప్ ట్విట్టర్‌ద్వారా పంపుతున్న సందేశాలపైన మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పరోక్షంగా వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ట్విట్టర్ ద్వారా వ్యాఖ్యలు తప్పుదోవ పట్టించే అవకాశం ఉంటుందని ఒబామా పేర్కొన్నారు. ట్రంప్ అధికారానికి వచ్చిన తరువాత ఉత్తరకొరియాతో మాటల యుద్ధం తీవ్రంగానే కొనసాగుతోంది. ఒకదశలో కొరియా ద్వీపకల్పంలో యుద్ధం జరుగుతుందా అన్నంత ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. ట్రంప్ నిలకడలేకుండా రకరకాలుగా మాట్లాడటంతో ఆయన వ్యాఖ్యలకు అంతగా విలువ ఉండటంలేదు. తమ అణుబటన్ పెద్దది, శక్తివంతమైనదని చేసిన వ్యాఖ్యను కూడా తేలికగా తీసుకున్నారు.

'క్వాడ్' ఏర్పాటుపై నీలినీడలు



బీజింగ్ : భారత్-పసిఫిక్ ప్రాంత దేశాలతో కూడిన క్వాడ్ ఏర్పాటుపై నీలినీడలు పడుతున్నాయి. బహుశా జపాన్ ఇందులో భాగస్వామి కాకపోవచ్చు. జపాన్-చైనాల మధ్య తిరిగి సాధారణ సంబంధాలు ఏర్పడనున్న నేపథ్యంలో క్వాడ్ ఏర్పాటు ఇప్పుడే జరుగుతుందా అన్న సందేహం ఉంది. భారత్-జపాన్, ఆస్ట్రేలియా, అమెరికాలు కలిసి క్వాడ్ గ్రూపుగా ఏర్పడాలని భావించాయి. ఈ ఏడాది చైనా-జపాన్‌ల మధ్య తిరిగి సంబంధాలు ఏర్పడనున్నాయి. జపాన్‌లో త్వరలో చైనా, దక్షిణకొరియా, జపాన్ నేతలు శిఖరాగ్ర సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఆ తరువాత జపాన్ ప్రధాని షింజొఅబే చైనాలో అధికారికంగా పర్యటించనున్నారని నిక్కీఆసియన్‌రెవ్యూ పత్రిక తెలిపింది. అనంతరం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ కూడా మొదటిసారిగా జపాన్‌లో పర్యటించే అవకాశం ఉంది. ఆసియాలో రెండు బలమైన దేశాలైన చైనా, జపాన్‌ల మధ్య సంబంధాల పునరుద్ధరణకి అవసరమైన ప్రాతిపదిక ఏర్పాట్లు ఇప్పటికే జరిగాయి. రెండు దేశాల మధ్య నెలకొనివున్న వైరుధ్యాన్ని రూపుమాపేందుకు జపాన్ పాలక లిబరల్ డెమోక్రటిక్ పార్టీలో ప్రముఖ నాయకుడు తొషిహిరొనికయ్ దౌత్యపరమైన చర్చలను జరిపారు. గత వారంలో ఆయన జిన్‌పింగ్‌ను కలుసుకుని టోక్యోలో పర్యటించవలసిందిగా ఆహ్వానించారు. రెండు దేశాల మధ్య సంబంధాలు మెరుగుపడటంవల్ల ఇరువురికి ప్రయోజనం వుందని ఆయన పేర్కొన్నట్టు క్యోడొ వార్తాసంస్థ తెలిపింది. చైనా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలకు సంబంధించిన స్కూలులో తొషిహిరొనికయ్ మాట్లాడుతూ రెండుదేశాల మధ్య సహకార సంబంధాలు మెరుగుపరచుకోవాలని అన్నారు. ఉమ్మడి ప్రయోజనాల సంబంధాలను మెరుగుపరుచుకుంటామని ఆయన తెలిపారు. చైనా-జపాన్‌ల మధ్య సంబంధాలు గతంలో దెబ్బతిన్నమాట వాస్తవమేనని అయితే ఇప్పుడు ఆటంకాలన్నింటిని అధిగమించామని నికయ్ జిన్‌పింగ్‌ని కలుసుకున్న తరువాత విలేకరులతో చెప్పారు. చైనా కూడా జపాన్‌తో సంబంధాలను మెరుగుపరుచుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నది. నికయ్ జిన్‌పింగ్‌ను కలుసుకున్న సందర్భంగా తీసిన ఫొటోను చైనా కమ్యూనిస్టు పార్టీ నిర్వహిస్తున్న వార్తాపత్రిక పీపుల్స్‌డైలీ ప్రముఖంగా ప్రచురించింది. నికయ్ జిన్‌పింగ్‌ను కలుసుకోవడం గొప్ప ప్రాధాన్యతగల ఘటనగా పీపుల్స్‌డైలీ పేర్కొంది.

పాలస్తీనాకు సహాయంలో కోత : ట్రంప్

వాషింగ్టన్ : పాలస్తీనా తిరిగి శాంతి చర్చలకు రాకపోతే ఆ దేశానికి అందించే సహాయంలో కోత విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ద్వారా ఘర్షణకు దిగారు. ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి నిక్కీహేలి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పాలస్తీనాకు నిధులలో కోత విధించే అవకాశం వుందని చెప్పిన తరువాత ట్రంప్‌కూడా సహాయంలో కోత విధిస్తామని అన్నారు. ఇటీవల జెరూసలెంను ఇజ్రాయిల్ రాజధానిగా గుర్తిస్తూ ట్రంప్ వివాదాస్పదమైన నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైంది. పాలస్తీనాకు వందలాది మిలియన్ల డాలర్లను ప్రతి సంవత్సరం సహాయం చేస్తున్నప్పటికీ ఒక ప్రశంసగాని, గౌరవంగాని లేవని, ట్రంప్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇజ్రాయిల్‌తో శాంతి ఒప్పందం సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నప్పటికీ దానిపై చర్చించేందుకు కూడా పాలస్తీనా ముందుకు రావడంలేదని పేర్కొన్నారు. చర్చలలో భాగంగా జెరూసలెంపై నిర్ణయం తీసుకున్నామని శాంతి చర్చలకు పాలస్తీనా ఇష్టపడటంలేదని ఈ నేపథ్యంలో భవిష్యత్తులో వారికి సహాయాన్ని ఎందుకు అందించాలని ట్రంప్ ప్రశ్నించారు. పాలస్తీనా భద్రతా దళాలకు అమెరికా 300 మిలియన్ డాలర్లకుపైగా సహాయాన్ని అందిస్తోంది. ట్రంప్ తాజాగా చేసిన వ్యాఖ్యను ఇజ్రాయిల్ సాంస్కృతిక శాఖమంత్రి మిరిరిగేవ్ హర్షించారు. తక్షణం సహాయాన్ని నిలిపివేయాలని ఆయన కోరారు. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ ఈనెల చివరిలో జెరూసలెంలో పర్యటించనున్నారు.

ఒంటరిగా ఎవరెస్టు అధిరోహణపై నిషేధం



ఖాట్మండు : ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్టు శిఖరాన్ని ఒంటరిగా అధిరోహించేందుకు నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించింది. ప్రమాదాలు ఎక్కువగా జరగకుండా నిరోధించేందుకే ఈ నిషేధం విధించినట్టు అధికారవర్గాలు తెలిపాయి. వికలాంగులు, అంధులు ఈ శిఖరాన్ని అధిరోహించేందుకు ఇదివరకే నేపాల్ ప్రభుత్వం నిషేధం విధించింది. తాజాగా ఒంటరిగా అధిరోహించడాన్ని నిషేధించింది. పర్వతాల అధిరోహణకు సంబంధించిన నియమ నిబంధనలను నేపాల్ మంత్రివర్గం సమీక్షించి ఒంటరిగా అధిరోహించడాన్ని నిషేధించింది. 2018లో ఈ నిషేధం వర్తిస్తుందని పేర్కొంది. గతంలో ఒంటరిగా కూడా ఎవరెస్టును అధిరోహించేందుకు అనుమతించారు. అయితే ప్రమాదాలు పెరుగుతుం డటంతో తాజా నిషేధాన్ని విధించినట్టు సాంస్కృతిక టూరిజం శాఖమంత్రి మహేష్వర్‌నెపని తెలిపారు. గత సంవత్సరం ఏప్రిల్‌లో స్విడన్‌కు చెందిన ఉలిస్టెక్ అనే పర్వతారోహకుడు ఎవరెస్టును అధిరోహించేందుకు వెళుతూ జారిపడి మృతిచెందాడు. ఎవరెస్టుపైన మొత్తం 14 శిఖరాలు ఉన్నాయి. పర్వతారోహకులు ఈ శిఖరాలను సందర్శిం చేందుకు ఒంటరిగా ప్రయాణం చేస్తూ పలుమార్లు ప్రమాదాలను ఎదుర్కొన్నారు. ఒంటరిగా ఉన్నవాళ్లకి ఎవరూ సహాయం చేసే అవకాశం ఉండదు. ఈనేపథ్యంలోనే తాజా ఆంక్షలు ప్రకటించారు. 2006లో న్యూజిలాండ్‌కు చెందిన మార్కుఇంగ్లిస్ తనకు రెండు కాళు లేకపోయినప్పటికీ 8840 మీటర్ల ఎత్తునగల ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించగలిగాడు. అలాగే అంధురాలైన ఎరిక్‌వెహిన్‌మేయర్ (అమెరికా) 2001 మేనెలలో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించగలిగారు. ఇలా అనేకమంది అంగవైకల్యం కలిగిన ఔత్సాహికులు ఎవరెస్టును అధిరోహించి తమ సత్తాను చాటుకున్నారు.

సీమను అభివృద్ధి చేస్తా

(మొదటిపేజీ తరువాయి)

భూములున్నాయన్నారు. భవిష్యత్‌లో కరవు లేకుండా సాగు నీటిని అందించి సీమను సస్యశ్యామలం చేస్తానన్నారు. విభజన తీరు బాధాకరంగా ఉందన్నారు. ఆర్థిక లోటు ఉన్నా పేదలకు న్యాయం జరగాలన్న సంకల్పంతో సంక్షేమానికి పెద్దపీట వేశానని సీఎం చెప్పారు. రైతులకు రూ.24 వేల కోట్ల మేర రుణ మాఫీ చేశామని, త్వరలో మూడో విడత రుణ మాఫీ కూడా పూర్తి చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. డ్వాక్రా సంఘాలకు రూ.780 కోట్ల రుణాలను రద్దు చేశానన్నారు. ప్రతి మహిళకు రూ.6 వేలు చొప్పున పెట్టుబడి నిధి ఏర్పాటు చేశానని తెలిపారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలన్న ఉద్దేశంతో సాధికార మిత్రలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా సరికొత్త పరిజ్ఞానంతో ఆన్‌లైన్ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. అందరికీ సంక్షేమ ఫలాలు అందాలని జన్మభూమి-మా ఊరు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామన్నారు. పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన తర్వాత 9,64,554 మంది ప్రజల ఆరోగ్యాలను కాపాడామన్నారు. సీఎం సహాయ నిధి కింద 33 లక్షల మందికి ఆర్థిక సాయాన్ని అందించామని, చంద్రన్న సంచార చికిత్స ద్వారా 270 యూనిట్లను ప్రవేశపెట్టామన్నారు. ఎన్టీఆర్ బేబి పథకం కింద 1.50 లక్షల మందికి కిట్లు అందజేశామన్నారు. ఇక ముఖ్యంగా ప్రైవేటు ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను తీర్చిదిద్దామన్నారు. ఎప్పటికప్పుడు దుప్పట్లు, పరుపులు అందించేలా తీర్చిదిద్దామన్నారు. ఒక్కో విద్యార్థికి రూ.1200 చొప్పున 15 మంది విద్యార్థులకు రూ.1.80 కోట్లు ఆర్థిక సాయం అందించామని వివరించారు. ప్రభుత్వ పథకాల తీరు, విద్య, వైద్య తదితర అంశాలపై విశదీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, దేవినేని ఉమా, ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథ రెడ్డి, శాసన మండలి మాజీ ఉపాధ్యక్షుడు సతీష్‌రెడ్డి, రాయలసీమ టీడీపీ శిక్షణా శిబిరం డైరెక్టర్ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి, కలెక్టరు బాబూరావు, ఇతర శాఖల అధికారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

బిగుస్తున్న ఉచ్చు

(మొదటిపేజీ తరువాయి)

వస్తారని పోలీసులు కౌంటర్ పిటిషన్‌లో పేర్కొన్నారు. కాగా, శ్రీనివాస్ తరపున సీనియర్ న్యాయవాది ఉమామహేశ్వరరావు వాదన వినిపిస్తూ సమాజంలో ఎంతో గౌరవ ప్రతిష్టలు ఉన్న వ్యక్తి శ్రీనివాస్ అని, కుట్రపూరితంగానే అతడిని అరెస్టు చేశారని, కనీసం పోలీసులు నోటీసు కూడా ఇవ్వలేదని, అందువలన కస్టడీ అవసరం లేదని, ఎక్కడికి పారిపోడనీ, ఎవరినీ ప్రభావితం చేయరని ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. తమ వద్ద అన్ని ఆధారాలు ఉన్నందునే శ్రీనివాస్‌ను అరెస్టు చేశామని, ఆయనకు ముందస్తు నోటీసు ఇచ్చామని, విచారించిన తరువాత గంట సమయం ఇచ్చినా మాట్లాడేందుకు శ్రీనివాస్ తమకు సహకరించలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న తరువాత కోర్టు విచారణను రేపటికి వాయిదా వేసింది. తాజా వీడియోలతో గజల్ శ్రీనివాస్ మరిన్ని ఇబ్బందుల్లో పడేటట్లు కనిపిస్తోంది. గజల్ శ్రీనివాస్ అసలు స్వరూపం బయట పడింది. ఆధ్యాత్మిక ముసుగులో ఆయన చేస్తున్న దారుణాలు వెలుగుచూస్తున్నాయి. తన ఆఫీసులో పనిచేసే మహిళలతో ఎలా వ్యవహరిస్తాడో తాజాగా బయటకు వచ్చిన ఈ వీడియోలే చెబుతున్నాయి. గజల్ దృష్టిలో మహిళలంటే కేవలం కోర్కెలు తీర్చే వస్తువులేనంటూ బాధితురాలు చెప్పింది అక్షరాలా నిజమని అతని లీలలు చూస్తేనే అర్థమవుతోంది. ఇప్పటికే గజల్ శ్రీనివాస్ జుగుప్సాకర వీడియోలు, అతని నిజస్వరూపాన్ని బయట పెట్టగా, తాజాగా బయటకొచ్చిన వీడియోతో గజల్ శ్రీనివాస్ అడ్డంగా బుక్కయ్యాడు. మహిళలను లోబర్చుకోవడం, వినకపోతే భవిష్యత్ లేకుండా చేస్తానని బెదిరించడం ఇదీ తన వద్ద పనిచేసే మహిళలతో గజల్ శ్రీనివాస్ ప్రవర్తించే తీరు. ఇప్పటికే అతనివద్ద పనిచేసే మహిళలను లోబర్చుకుని, ఆమె ద్వారా ఇతర అమ్మాయిలపై ఒత్తిడి తీసుకువస్తున్న వైనం ఆధారాలతో సహా బయటపడింది. అతని వెకిలి మాటలు, దారుణమైన చేష్టలు అన్నీ వెలుగు చూస్తున్నాయి.

ప్రచారకర్తగా తొలగింపు :

గజల్ శ్రీనివాస్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. సేవ్‌టెంపుల్స్ సంస్థ ప్రచారకర్త బాధ్యతల నుంచి శ్రీనివాస్‌ను తొలగించారు. ఈ మేరకు గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ ప్రకాశ్‌రావు వెలగపూడి ప్రకటన విడుదల చేశారు. సనాతన హిందూ ధర్మ పరిరక్షణ కోసం ఈ సంస్థ పలువురు ఎన్నారైల సహకారంతో 2006లో ఏర్పాటైందన్నారు. సంస్థలోని మహిళల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడే వారిని ఉపేక్షించబోమని ప్రకాశ్‌రావు హెచ్చరించారు. శ్రీనివాస్‌పై వచ్చిన లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో సేవ్ టెంపుల్స్ ప్రచారకర్త బాధ్యతల నుంచి ఆయన్ను తొలగిస్తూ సంస్థ నిర్ణయం తీసుకుందన్నారు. తమ కార్యాలయంలో పనిచేసే మహిళలను దేవతల్లా తాము గౌరవిస్తామని ప్రకాష్‌రావు తెలిపారు.

దుర్గగుడిపై దుమారం

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం ప్రచారం జరిగింది.

అసలు ఏం జరిగిందంటే..

గత నెల 26వ తేదీ రాత్రి 10.30 నుంచి 11.45 గంటల మధ్యలో దుర్గగుడి అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేసినట్లు రెండు రోజుల తర్వాత వార్తలు వచ్చాయి. అదే నెల 27న రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సతీమణి సవితా కోవింద్ వచ్చారు. ఆమె రాకను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారని తొలుత ప్రచారం జరిగింది. అయితే ప్రత్యేక పూజల్లో బయట నుంచి వచ్చిన వ్యక్తులు పాల్గొన్నారని, దీంతో రాష్ట్రపతి సతీమణి పర్యటనకు ఎటువంటి సంబంధం లేదని వార్తలు వచ్చాయి. గత నెల 26వ తేదీ రాత్రి ఆలయంలో క్షుద్రపూజలు జరిగాయని, ఆలయ ప్రధాన అర్చకుడు బద్రీనాథ్‌తోపాటు బయట నుంచి మరో ముగ్గురు వచ్చారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అమ్మవారి సన్నిధిలో అపచారం జరిగిందని అన్ని వర్గాల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. అయినా ఆలయ అధికారులు, అర్చకుల నుంచి ఐదు రోజులపాటు ఎటువంటి స్పందన లేదు. గత 30వ తేదీన జరిగిన పాలకమండలి సమావేశంలోనూ ఈ విషయంపై చర్చ వచ్చింది. ఈవో మాత్రం అటువంటిదేమీ జరగలేదని కొట్టిపారేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఈవో మీడియా సమావేశం ఏర్పాటు చేసి గత నెల 26న అమ్మవారి అంతరాలయంలో ఎటువంటి క్షుద్ర పూజలు జరగలేదని, కేవలం శుద్ధి, నిత్యం జరిగే అలంకరణ మాత్రమే చేసినట్లు చెప్పారు. అదే సమయంలో ప్రధాన అర్చకుడు బద్రీనాథ్ కూడా మీడియాతో మాట్లాడుతూ తాము క్షుద్ర పూజలు చేయలేదని తెలిపారు. అమ్మవారి సన్నిధిలో ఆదిశంకరాచార్యులు శ్రీచక్రం ప్రతిష్ఠించారని, అందువల్ల ఇక్కడ ఎటువంటి క్షుద్ర పూజలు చేయబోమని ప్రకటించారు. అయితే 26వ తేదీ రాత్రి తాను అమ్మవారి సన్నిధిలో కేవలం శుద్ధి, నిత్య అలంకరణ మాత్రమే చేశానని, సహాయకుడిగా తన బంధువు అయిన విశ్వనాథపల్లి గ్రామంలో పూజారిగా పని చేస్తున్న పార్థసారథిని తీసుకువచ్చానని వివరించారు. అనంతరం ఈవో కొన్ని సీసీ టీవీ ఫుటేజీలను మీడియాకు విడుదల చేశారు. ఆ వీడియో క్లిప్పింగ్‌లు కటింగ్ చేసి ఉండటం, కొత్తగా పూలమాలలు తీసుకురావడం, పెద్ద ఎత్తున పొగ వచ్చినట్లు ఉండటంతో క్షుద్ర పూజలు జరిగిందనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమయ్యాయి. ఈవో కోసం భైరవి పూజ చేశారని కొందరు ప్రచారం చేశారు. మరోవైపు మంత్రి నారా లోకేష్ ముఖ్యమంత్రి కావాలని దుర్గగుడిలో ప్రత్యేక పూజలు చేశారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ఆరోపించారు.

ఈవో బదిలీ అంటూ వదంతులు

దుర్గగుడిలో క్షుద్రపూజల విషయం సీఎం చంద్రబాబు, దేవాదాయ శాఖ మంత్రి మాణిక్యాలరావు దృష్టికి వెళ్లింది. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని మంత్రి మాణిక్యాలరావు ప్రకటించారు. మరోవైపు సీఎం కూడా విజయవాడ పోలీస్ కమిషనర్ డి.గౌతం సవాంగ్‌తో మాట్లాడి దుర్గగుడిపై దుమారం గురించి ఆరా తీసినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఈవో సూర్యకుమారిని పదవి నుంచి తొలగించారని, ఆమె స్థానంలో సింహాచలం దేవస్థానం ఈవో రామచంద్రన్‌ను నియమించినట్లు వదంతులు వచ్చాయి. దీంతో ఈవో సూర్యకుమారి బుధవారం సాయంత్రం మరోసారి మీడియా సమావేశం ఏర్పాటు చేసి తనను ప్రభుత్వం మార్పు చేసినట్లు ఎటువంటి ఉత్తర్వులు అందలేదని చెప్పారు. గత నెల 26వ తేదీ రాత్రి ఆలయంలో శుద్ధి పూజలు మాత్రమే జరిగాయని మరోసారి స్పష్టం చేశారు. చీరలు మార్చారు, తాంత్రిక పూజలు చేశారనేది అవాస్తవమని చెప్పారు. ఇదే విషయాన్ని పూజారులు కూడా చెప్పారని పేర్కొన్నారు. పోలీసుల విచారణ గురించి తనకు తెలియదన్నారు. భైరవీ పూజ అంటే ఏమిటో తనకు తెలియదన్నారు. తనపై కుట్ర పూరితంగానే తాంత్రిక పూజలు అంటూ పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. వ్యక్తిగత ప్రయోజనాల కోసం కొందరు అమ్మవారి ఆలయ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారన్నారు. పాలకమండలి కూడా ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం తగదన్నారు. అంతర్గత విచారణ జరుగుతోందని, సీసీ టీవీ ఫుటేజీలను ఎవరైనా పరిశీలించవచ్చని, తద్వారా వాస్తవాలు తెలుసుకోవాలని ఆమె చెప్పారు.

పోలీసులకు ఫిర్యాదులు

దుర్గగుడిలో క్షుద్ర పూజలు చేసి భక్తుల మనోభావాలు దెబ్బతీసిన ఆలయ అధికారులు, పూజారులపై చర్యలు తీసుకోవాలని విజయవాడకు చెందిన ఇద్దరు న్యాయవాదులు అన్నవరపు వెంకటేశ్వరరావు, కె.వెంకటేష్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఉదయం ఫిర్యాదు చేశారు. వారి నుంచి ఫిర్యాదు స్వీకరించిన సీఐ కాశీవిశ్వనాథ్ న్యాయ నిపుణులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

తాంత్రిక పూజలు నిజమే : పాలక మండలి

దుర్గగుడిలో తాంత్రిక పూజలు జరిగాయని ఆలయ పాలక మండలి చైర్మన్ యలమంచిలి గౌరంగబాబు, సభ్యుడు బడేటి ధర్మారావు మీడియాకు చెప్పారు. ఎప్పుడూ దుర్గగుడికి ఈవోగా తానే కొనసాగాలని సూర్యకుమారి ఈ పూజలు చేయించారని వారు ఆరోపించారు. ఈ విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబుకు పాలకవర్గం తరఫున ఫిర్యాదు చేశామని తెలిపారు. సూర్యకుమారిని వెంటనే సస్పెండ్ చేసి జైలుకు పంపాలని వారు డిమాండు చేశారు. టెండర్ల ద్వారా దుర్గమ్మ సొమ్మును ఆమె దోచుకున్నారని ఆరోపించారు. ఆమె ఇష్టానుసారంగా వ్యవహరించి ఆలయాన్ని భ్రష్టుపట్టించారన్నారు. మీడియా ఎదుట మాత్రం మంచిగా ఉన్నట్లు నటిస్తారని పేర్కొన్నారు.

ట్రిపుల్ తలాక్ బిల్లు

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యాలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో బిల్లును అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. శిక్ష అనుభవించేలా చట్టంలో ఉండాలని, విడాకులు లేకుండా, పరిహారం చెల్లించకుండా చట్టం రూపొందించడం సమంజసం కాదని పేర్కొన్నారు. ముమ్మారు తలాక్ వల్ల ముస్లిం మహిళలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ముస్లిం దేశాలు సైతం ట్రిపుల్ తలాక్‌ను నిషేధించాయని చెప్పారు. ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం వెనక బీజేపీకి దురుద్దేశం ఉందని, ముస్లిం మహిళలకు న్యాయం చేసేలా ఏకాభిప్రాయం సాధించాలన్నారు. మహిళా సంఘాలు, ప్రజాస్వామిక సంస్థల అభిప్రాయాలు, ఆలోచనలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహారాష్ట్రలోని పుణె సమీపాన కోరెగావ్‌లో చోటుచేసుకున్న ఘటనకు బీజేపీ ప్రభుత్వం బాధ్యత వహించాలని, కులఘర్షణలు సృష్టించడం సమంజసం కాదన్నారు. 1818 జనవరి 1న అణచివేత, అంటరాని తనానికి గురవుతున్న మహర్‌లు పోరాటం చేశారని, ఆ పోరాట దివస్‌లో భాగంగా కోరెగావ్‌లో నివాళులర్పించడానికి అంబేద్కర్ మనువడు ప్రకాష్ అంబేద్కర్‌తో పాటు అనేక మంది వచ్చారని చెప్పారు. హిందుత్వ శక్తులు దాడి చేయడంతో జరిపిన కాల్పుల్లో దళిత యువకుడు మృతి చెందడం బాధాకరమని, పుణె, ముంబై నిరసనల్లో 3 లక్షల మందికి పైగా పాల్గొన్నారని, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్వయంగా ప్రకటించారన్నారు. దళితులపై దాడిని తీవ్రంగా ఖండిస్తూ బంద్‌కు మద్దతిస్తున్నట్లు ప్రకటించారు. పరస్పర ఘర్షణలకు దిగకుండా శాంతియుతంగా ఆందోళన చేయాలని, కులఘర్షణలకు తావివ్వకూడదని సురవరం అన్నారు. మందకృష్ణ మాదిగ అరెస్టును సురవరం తీవ్రంగా ఖండిస్తూ, దీక్ష చేయకుండా దళితులను అణచివేయడం సమంజసం కాదని హితవు పలికారు. వర్గీకరణ అంశం చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని గుర్తుచేశారు. మందకృష్ణను వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. వైద్య వృత్తిని, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎంసీఐ)ను ధ్వంసం చేయడానికి, వైద్య సీట్లను విచ్చలవిడిగా అమ్ముకోవడానికి ఎన్‌ఎంసీ బిల్లు తెస్తున్నారని సురవరం విమర్శించారు. దేశవ్యాప్తంగా వైద్యులు చేస్తున్న ఆందోళనకు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు.

దుర్మరణం

(మొదటిపేజీ తరువాయి)



వారి ప్రాణాలను కబళించింది. ఆస్పరి, చిన్నహోతూరు మధ్యలో ఉన్న రైల్వేగేటు సమీపంలో మినీటిప్పర్ నెం 21 వై 5669 వెనుక టైర్ పగిలి పోవడంతో వేగంగా వస్తున్న వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో లారీపై ఉన్న కూలీలు షేకమ్మ(45), నర్సమ్మ (45), గోవిందమ్మ (55) అక్కడికక్కడే మృతి చెందగా గాయపడిన 13 మందిని ఆదోని ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో హనుమంతమ్మ (16) మృతి చెందింది. కర్నూలులో వైద్యచికిత్స పొందుతూ నారాయణ(30), ఈరమ్మ (40), మంగమ్మ (48)లు మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన బాలరాజు, నీలమ్మ, బసవరాజు, సుంకమ్మ, వెంకటేష్, షేకన్న, దుర్గమ్మ, లక్ష్మీ, వెంకటేశ్వర్లును ఆదోని ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. స్రవంతి పరిస్థితి విషమంగా ఉండటంతో ఐసీయూలో ఉంచి కర్నూలు వైద్యశాలలో చికిత్స అందచేస్తున్నారు. ఆలూరు సీఐ గౌస్, ఎస్ఐ శంకరయ్యలు సంఘటనా స్థలం చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంఘటన విషయం తెలుసుకున్న ఎస్పీ గోపీనాథ్ జెట్టి సంఘటనా స్థలం చేరుకొని పరిశీలించారు. ఆలూరు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్, ఆర్డీవో ఓబులేసు, ఆస్పరి తహశీల్దార్ సుబ్రమణ్యం వైద్యశాలకు చేరుకొని మృతుల బంధువులను ఓదార్చారు. మృతులందరూ ఒకే గ్రామానికి చెందినవారు కావడంతో పాటు సమీప బంధువులు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆదోని, కర్నూలు వైద్య శాల బంధువుల ఆర్తనాదాలతో దద్దరిల్లాయి.

విజేతలకు ఉగాదిన సీఎం పురస్కారాలు

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : జన్మభూమి - మా ఊరు కార్యక్రమం లో భాగంగా పర్యాటక సాంస్కృతిక శాఖ నిర్వహిస్తున్న జన్మభూమి నేపధ్య సాంస్కృతిక పోటీల్లో రాష్ట్రస్థాయి విజేతలకు ఉగాదిన సీఎం చంద్రబాబు బహుమతిని అందచేస్తారని ఆ శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా వెల్లడించారు. విద్యాశాఖ సహకారంతో గ్రామ, వార్డుస్థాయి, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సంగీతం, నృత్యం, మూకాభినయం, కథలు, పద్యాలు, శ్లోకాల పఠనం, చర్చ, వ్యాసరచన, పాటల రచన, కథా రచన, నినాదాల కూర్పు, కవిత్వం, చిత్రలేఖనం అంశాలలో తొలుత గ్రామ, వార్డు స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను మూడు కేటగిరీలుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. 5 నుంచి 8 తరగతి వరకు ఒక విభాగంగానూ, 9 నుంచి ఇంటర్ వరకు రెండో విభాగంగా, డిగ్రీ విద్యార్థులను మూడో విభాగంగా విభజించినట్లు పేర్కొన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమాలకు పలు విభాగాలలో నిష్ణాతులైన వారిని న్యాయ నిర్ణేతలుగా నియమించామన్నారు. జనవరి 9వ తేదీతో గ్రామ పోటీలు ముగుస్తాయని, విజేతలకు 10న మండలస్థాయిలో పోటీలు నిర్వహిస్తామని తెలియజేశారు.

అనంతరం 11న మండలస్థాయి విజేతలకు బహుమతులను అందజేస్తామని మీనా తెలిపారు. మండలస్థాయి విజేతలను జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని, ఇందుకు సంబంధించిన క్యాలెండర్‌ను త్వరలోనే విడుదల చేస్తామన్నారు. వాటిలో విజేతలుగా నిలిచిన వారికి ఉగాది రోజున బహుమతులను అందజేస్తామని తెలిపారు. జిల్లాస్థాయి విజేతలకు ఇన్‌చార్జి మంత్రులు, రాష్ట్రస్థాయి విజేతలకు సీఎం చంద్రబాబు పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు. బహుమతులు పొందిన అంశాలపై ప్రత్యేకంగా ఒక పత్రం తయారు చేసే బాధ్యతను ప్రభుత్వం భాషా, సాంస్కృతికశాఖకు అప్పగించినట్లు మీనా వెల్లడించారు.

ఏసీబీకి రూ.1కోటి విడుదల

విశాలాంధ్రబ్యూరో - అమరావతి : అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) ప్రధాన కార్యాలయానికి అవసరమైన వాహనాల కొనుగోలుకు ప్రభుత్వం రూ.1కోటిని విడుదల చేసింది. హెడ్ క్వార్టర్స్ అధికారులకు 18 వాహనాల కొనుగోలుకు రూ.1.51 కోట్లను విడుదల చేయాలని ఏసీబీ డీజీపీ ఆర్‌పీ ఠాకూర్ ప్రభుత్వానికి గత నెలలో ప్రతిపాదనలు పంపగా, ప్రభుత్వం రూ.1కోటిని మాత్రమే కేటాయించింది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి (పొలిటికల్) ఎస్ శ్రీకాంత్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2017-18 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ నుంచి ఈ నిధులను డ్రా చేసుకునేందుకు ప్రభుత్వం అనుమతించింది.

పోటీతత్వం పెంచేందుకే గ్రేడింగ్‌లు

'జన్మభూమి' పై టెలికాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ప్రజాసేవలో పోటీతత్వం పెంచేందుకే జన్మభూమి నిర్వహణపై గ్రామాలు, వార్డులకు రోజువారీ గ్రేడింగ్‌లు ఇస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రోజువారీ నివేదికలు వెంటనే పంపించాలని ఆదేశించారు. నివేదికలు సకాలంలో పంపినందుకు 40శాతం, గ్రామ స్థాయిలో సర్వేకు 40 శాతం, జిల్లా స్థాయిలో సెంటిమెంట్ అనాలిసిస్‌కు 20శాతం మార్కులు ఇస్తున్నట్లు తెలిపారు. బుధవారం తన నివాసం నుంచి రెండవరోజు జన్మభూమిపై అధికారులు, ప్రజాప్రతినిధులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. తొలి రోజున విజయనగరం, కడప, గుంటూరు, తూర్పుగోదావరి జిల్లాలు ఏ గ్రేడ్ సాధించినట్లు వెల్లడించారు. నెల్లూరు, విశాఖ, కర్నూలు, ప్రకాశం, శ్రీకాకుళం, అనంతపురం, చిత్తూరు జిల్లాలకు బిగ్రేడ్ వచ్చిందన్నారు. అన్ని జిల్లాలు ఏ గ్రేడ్ వచ్చేలా పోటీపడాలని దిశానిర్దేశం చేశారు. నకరికల్లు,తిక్కవోలు, కొత్తపల్లి, అమలాపురం, పెందుర్తి తదితర మండలాలు ఏ గ్రేడ్ సాధించాయంటూ, అదే విధంగా కొత్తపల్లి, అశ్వాపురం, నక్కపల్లి, ఎగువ తంబళ్లపల్లి గ్రామాలు ఏ గ్రేడ్‌లో ఉన్నాయని తెలిపారు. మిగిలిన మండలాలు, గ్రామాలు కూడా ఏ గ్రేడ్ సాధించాలనే ఆకాంక్ష వ్యక్తం చేశారు. "ఐదో విడత జన్మభూమి-మావూరు తొలిరోజు విజయవంతం అయింది. ప్రజలు ఉత్సాహంగా పాల్గొనడం స్ఫూర్తి దాయకం. గ్రామ, వార్డు సభల్లో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలి. కృష్ణా పుష్కరాలలో 90శాతం సంతృప్తి సాధించాం, జన్మభూమిలో కూడా అదే స్ఫూర్తి కనిపించాలి. అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా, సమర్ధంగా పనిచేయాలి. మన అంకిత భావంతోనే ప్రజల్లో సానుకూలత సాధ్యం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గ్రామ, వార్డు సభలు ప్రశాంతంగా, క్రమశిక్షణతో జరగాలన్నారు. ఎవరైనా అడ్డంకులు సృష్టిస్తే కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆర్థికేతర ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని, ఆర్థికపరమైనవి ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని సూచించారు. జమాబందీ తరహాలో ఫిర్యాదుల పరిష్కారం శరవేగంగా జరగాలన్నారు.' ప్రజా సంతృప్తే అభివృద్ధి, సంక్షేమం, అధికారుల పనితీరుకు కొలమానం. 80% సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలి. ప్రజల్లో అవగాహన, పోటీతత్వం పెంచడం మనందరి బాధ్యత. అత్యున్నత జీవన ప్రమాణాలున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రూపొందాలి" అని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. జన్మభూమి జరుగుతున్న తీరుపై ప్రజాభిప్రాయ సేకరణ :అర్హులందరికీ పింఛన్లు సకాలంలో అందుతున్నాయా? రేషన్ సకాలంలో అందుతోందా? అర్జీల పరిష్కారం బాగుందా, లేదా? చంద్రన్న బీమా మీ గ్రామంలో అమలవుతోందా, లేదా? ఉచిత వైద్యశిబిరాలు, పశు వైద్యశిబిరాల్లో సేవలు బాగున్నాయా, లేదా? వివిధ అంశాలపై జన్మభూమి అధికారులు అవగాహన కల్పిస్తున్నారా, లేదా? అనే అంశాలపై ప్రజాభిప్రాయం సేకరిస్తున్నట్లుగా ముఖ్యమంత్రి తెలిపారు. గుంటూరు, పశ్చిమగోదావరి, నెల్లూరు, కృష్ణా, చిత్తూరు, ప్రకాశం జిల్లాలలో తొలిరోజున ప్రజల్లో 70-80శాతం సంతృప్తి వచ్చిందని, అనంతపురం, విశాఖపట్నం, కడప, కర్నూలు జిల్లాలలో 60నుంచి 70శాతం సంతృప్తి వ్యక్తమైందని చెప్పారు. 80శాతం సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలని మార్గదర్శకం చేశారు.

రాజధానికి ప్రపంచ బ్యాంకు రుణమా!

- కేంద్ర ప్రభుత్వ సహకారం ఇదేనా?
- టీడీపీ ఎంపీల హర్షం గర్హనీయం
- మళ్లీ మళ్లీ తప్పులు చేస్తున్న చంద్రబాబు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ



విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం సహకరించాల్సి ఉండగా ప్రపంచబ్యాంకు రుణాన్ని మంజూరు చేయిస్తామని కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటిం చడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ఇప్పటికే పీకల దాకా అప్పుల్లో కూరుకుపోయిన రాష్ట్రంపై మరింత రుణభారాన్ని మోపడం ఎంతవరకూ సబబని ప్రశ్నించారు. రాజధాని నిర్మాణం పేరుతో ఒక విధంగా రాష్ట్రాన్ని ప్రపంచబ్యాంకుకు తాకట్టుపెట్టడమే అవుతుంద న్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి చంద్రబాబు సహా టీడీపీ ఎంపీలకు చిత్తశుద్ధి ఉంటే రాజధాని నిర్మాణ నిధులను కేంద్రమే భరించే విధంగా ఒత్తిడి పెంచాలని ఆయన సూచించారు. విజయవాడ దాసరిభవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు నుంచి రూ. 3,324 కోట్ల రుణం ఇచ్చే అంశం పరిశీలనలో ఉన్నట్లు రాజ్యసభలో మంగళవారం అరుణ్‌జైట్లీ ప్రకటించడంతో టీడీపీ ఎంపీలు హర్షం వ్యక్తం చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ప్రపంచబ్యాంకు రుణంతో రాజధాని నిర్మాణం చేపడతా మని కేంద్రం గతంలో ఎప్పుడూ చెప్పలేదన్నారు. ప్రపంచబ్యాంకు అప్పు ఇస్తుంటే అమరావతి నిర్మాణంపై ప్రత్యేకంగా కేంద్రం బాధ్యతేమిటో, దీనిపై చంద్రబాబు వైఖరేమిటో స్పష్టం కావాల్సి ఉందన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా ఉన్నప్పుడు చేసిన తప్పులనే చంద్రబాబు మళ్లీ మళ్లీ చేస్తున్నారని, ప్రపంచ బ్యాంకుకు సాగిలపడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ఎంపీలు హైదరాబాద్‌లోనే ఉన్న హైకోర్టు విభజన విషయమై పార్లమెంటులో గొడవ చేస్తే జూన్ 2వ తేదీ నాటికి విభజన చేస్తామని కేంద్రమంత్రి హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేస్తూ రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన నిధులు, ప్రాజెక్టులపై అన్యాయం జరుగుతున్నా ఏపీ ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కేంద్రం సహకారం తప్పనిసరి కనుక ఆ బాధ్యతను సక్రమంగా నెరవేర్చే విధంగా సీఎం, ఎంపీలు ఒత్తిడి పెంచాలని రామకృష్ణ సూచించారు.పార్టీ ఫిరాయింపులపై చర్యల గురించి గవర్నర్‌ను ఎందుకు ప్రశ్నించరు? :అసెంబ్లీలో ఆమోదం తెలిపిన నాలా బిల్లును గవర్నర్ నరసింహన్ ఆమోదించ కుండా జాప్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసిన బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజు పార్టీ ఫిరాయింపుదార్లపై చర్యల గురించి ఎందుకు నిలదీయరని రామకృష్ణ సూటిగా ప్రశ్నిం చారు. నాలా బిల్లుపై ఆలస్యం చేస్తేనే అంతగా సీరియస్ అయిన ఆ నేత మొత్తంగా రాజ్యాంగాన్నే పాతరేస్తుంటే ఎందుకు పెదవి విప్పడం లేదన్నారు. కేవలం రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు మాత్రమే ఉపయోగపడే నాలా బిల్లుపై కోపం రావడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఢిల్లీలో శరద్‌యాదవ్ పార్టీ మారకపోయినా ఉపరాష్ట్రపతి తన అధికారాన్ని ఉపయో గించిన అనర్హత వేటు వేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రానికి వారానికి రెండుసార్లు వచ్చే వెంకయ్యకు, బీజేపీ పక్షనేత విష్ణుకుమార్‌రాజుకు ఇక్కడి ఫిరాయింపులు కన్పించలేదా? నలుగురు ఫిరా యింపుదార్లతో మంత్రులుగా ప్రమాణం చేయించడంపై గవర్నర్‌ను ఎందుకు ప్రశ్నించలేదో ప్రజలకు స్పష్టం చేయాలన్నారు. ఇప్పటికైనా బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే గవర్నర్ వైఖరిని ఖండించి, కేంద్రానికి ఫిర్యాదు చేస్తే సబబుగా ఉంటుందన్నారు. ఆస్తికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుర్గగుడిలో జరిగిన క్షుద్ర పూజలపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులను శిక్షించా లని ఆయన ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఇందులో కార్యనిర్వహణాధికారి సూర్యకుమారి హస్తమున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆమెను బదిలీ చేయాలని రామకృష్ణ సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు జల్లి విల్సన్, రావుల వెంకయ్య పాల్గొన్నారు.

తాంత్రిక పూజల దోషులను జైల్లో పెట్టాలి : కొలనుకొండ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విజయవాడ కనకదుర్గ ఆలయంలో అర్ధరాత్రివేళ తాంత్రిక పూజలు నిర్వహించిన దోషులను జైల్లోపెట్టాలని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలనుకొండ శివాజీ బుధవారం ఒక ప్రకటనలో డిమాండు చేశారు. పోలీసులు ప్రభుత్వానికి అందించిన నివేదిక ప్రకారం..ఈఓ సూర్యకుమారిపై బదిలీవేటు వేస్తే సరిపోదని పేర్కొన్నారు. ఈ ఘటనపై పాలకమండలిని రద్దు చేయాలని కోరారు. ప్రస్తుతం దుర్గగుడి నిర్వహణలో అన్ని స్థాయిలో అవినీతి తాండవిస్తోందని, వ్యక్తిగత స్వార్థం కోసం ఆలయాల్లో ఏం చేయడానికైనా సిబ్బంది, అర్చకులు సిద్ధమవుతున్నారని ఆయన ఆగ్రహం వెలిబుచ్చారు. దశలవారీగా కింది నుంచి పైస్థాయి వరకూ సిబ్బంది మొత్తాన్ని తొలగించాలని శివాజీ డిమాండు చేశారు.

7న ఏఐటీయూసీ కొత్త భవనం ప్రారంభం

జాతీయ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ కౌర్ రాక

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:విజయవాడ నగరం సమీపం లోని గొల్లపూడి దగ్గర నిర్మించిన ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయ నూతన భవనాన్ని ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం10.30 గంటలకు ప్రారంభించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు చలసాని వెంకట రామారావు, జి.ఓబులేసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.నూతన భవన సముదాయాన్ని ఏఐటీయూసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అమ్రజిత్ కౌర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. యూనియన్ కార్యాలయాన్ని జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ హెచ్. మహ దేవన్, జోశ్యభట్ల వెంకట సుబ్బమ్మ ట్రస్టు కార్యాలయాన్ని జాతీయ వర్కింగ్ ఉమెన్స్ ఫోరమ్ కన్వీనర్ బి.వి.విజయలక్ష్మి, కామ్రేడ్ జీవి.కృష్ణారావు మెమోరియల్ హాలును మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర రావు ప్రారంభిస్తారని వివరించారు. ముఖ్య అతిథులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, అతిథులుగా ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్య క్షులు వివి రామారావు, పలువురు ఏఐటీ యూసీ, అనుబంధ సంఘాల జాతీయ, రాష్ట్ర నేతలు పాల్గొంటారని తెలిపారు.

సబ్‌ప్లాన్ అమలులో చంద్రబాబు విఫలం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ సబ్‌ప్లాన్‌ను అమలు చేయడంలో సీఎం చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని వైసీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధ్యక్షులు మేరుగ నాగార్జున విమర్శించారు.విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలో దళితులపై వేధింపులు పెద్దఎత్తున కొనసాగుతున్నాయని వాపోయారు. టీడీపీ నేతల అరాచకాలకు నిజాయితీగల అధికారులు బలవుతున్నారని మండిపడ్డారు.ఈ సమావేశంలో వైసీపీ ఎస్సీసెల్ నాయకులు కాలే పుల్లారావు, బూదాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేషన్‌కార్డుల్లో కోత

3.5 లక్షల కార్డులు నిలిపివేత



విశాలాంధ్ర-నెల్లూరుబ్యూరో : రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం జన్మభూమి - మా ఊరు కార్యక్రమాన్ని మంగళవారం నుంచి అట్టహాసంగా ప్రారంభించింది. ఈ నెల 11 వరకు 9 రోజుల పాటు జన్మభూమి కార్యక్రమాలు నిర్వహించ నున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తొమ్మిది రోజులపాటు ప్రతి గ్రామంలో కార్యక్రమాలను చేయాలని ప్రాధాన్యతాంశాలను పంపించారు. గత నెలలో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు జరిపి అర్హులైనవారు రేషన్‌కార్డులు, పింఛన్లు రాని వారందరూ దరఖాస్తు చేసుకుంటే జన్మభూమిలో కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పారు. నెల్లూరు జిల్లాలో అయితే స్పెషల్ గ్రీవెన్స్‌డేలు నిర్వహించారు. ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక గ్రీవెన్స్‌డేలు నిర్వహించారు. అర్జీలు స్వీకరించి అందరికీ రేషన్‌కార్డులు జన్మభూమిలో అందిస్తామని చెప్పారు. 13 జిల్లాల పరిధిలో కొత్తగా రేషన్‌కార్డుల కోసం 5.10 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వాటిలో 1.5 లక్షల మందికి రేషన్ కార్డులు మంజూరయ్యాయి. మిగిలిన వాటిని అన్‌ఎలిజబుల్‌గా చూపించి పెండింగ్ పెట్టారు. 5.10 లక్షల దరఖాస్తుల్లో 60 శాతం మంది స్ప్లిట్ కార్డుదారులు. అంటే ఒక కుటుంబంలో కుమారుడికి పెళ్లయితే తల్లిదండ్రుల నుంచి బయటకు వెళ్లి వేరుగా ఉన్నవాళ్లు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వాటినే స్ప్లిట్ కార్డులుంటారు. ఈ కార్డులన్నీ నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అందరికీ కొత్త రేషన్‌కార్డులు ఇస్తామని దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దరఖాస్తు చేసుకునే సమయంలోనే కొన్ని తిరస్కరించారు. పెళ్లయిన వారు కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటే కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేసుకునేటప్పుడే సగం దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. స్ప్లిట్ ఆప్షన్ పెట్టినవి రాష్ట్రవ్యాప్తంగా 3.5 లక్షల దరఖాస్తులు తేలాయి. స్ప్లిట్ కార్డులు తాత్కాలికంగా నిలిపివేయాలని, కార్డులు జారీ చేయవద్దని సోమవారం అధికారులకు ఆదేశాలు అందాయి. దీంతో స్ప్లిట్ కార్డులను పెండింగులో ఉంచారు. దరఖాస్తుదారులందరికీ ఆర్‌సీ నంబర్లు వచ్చాయి. వాటిని ఆన్‌లైన్‌లో చెక్ చేస్తే పెండింగ్ అని లేదా వేరే రేషన్‌కార్డులో మీ పేరు ఉందని చూపిస్తుంది. తమకు కార్డులు రాలేదని స్ప్లిట్ కార్డుదారులు జన్మభూమి గ్రామసభల్లో అధికారులను అడిగితే మళ్లీ దరఖాస్తు చేసుకోండని ఉచిత సలహా ఇస్తున్నారు. అన్ని జిరాక్సులతో దరఖాస్తు చేసుకున్నాం.. తమకు ఆర్‌సీ నంబర్ కూడా వచ్చింది .. కార్డు రాలేదని బాధితులు అడుగుతుంటే.. మరోసారి దరఖాస్తు చేసుకోమంటున్నారు. మళ్లీ దరఖాస్తు చేసుకున్నా ఇదే పరిస్థితి. ఆర్‌సీ నంబర్ వస్తుంది. కార్డులు రావు.. ఇలా ఎన్ని రోజులు అధికారులు చుట్టూ తిరగాలో అని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. స్ప్లిట్ కార్డులు నిలిపివేసినట్టు సోమవారం సాయంత్రం వరకు తహశీల్దార్‌లకు కూడా తెలియదు. ప్రభుత్వ తీరుతో అధికారులే తలలు పట్టుకుంటున్నారు.

ఎస్వీ వర్సెస్ టీజీ

కర్నూలు సీటుకోసం తెలుగు తమ్ముళ్లలో పోటీ
అయోమయంలో కార్యకర్తలు



విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : మరో ఏడాదిన్నర కాలంలో అసెంబ్లీ ఎన్నికలు రాను న్నాయి. అయితే కర్నూలు అసెంబ్లీ సీటు అభ్యర్థిత్వం ఎవరిని వరిస్తుందనే విషయంపై ఇప్పటి నుంచే నియోజకర్గంలో సర్వత్రా చర్చింకుం టున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు టీజీ తనయుడు టీజీ భరత్‌ల మధ్య కర్నూలు సీటుపై పోటీ నెలకొనివుంది. ఇరువురు పోటాపోటీగా మీడియా ముందు రాబోయే ఎన్నికలలో కర్నూలు శాసనసభకు పోటీ చేస్తామని ప్రకటించడం కార్యకర్తలను అయోమయంకు గురిచేస్తుంది. 2014 ఎన్నికలలో టీడీపీ అభ్యర్థిగా టీజీ వెంకటేష్ కర్నూలు నియోజకవర్గం నుండి పోటీ చేయగా, ఎస్వీ మోహన్‌రెడ్డి వైకాపా అభ్యర్థిగా రంగంలోకి దిగారు. ఎస్వీ మోహన్‌రెడ్డి స్వల్ప ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. టీడీపీ నియోజకవర్గం సమన్వయకర్తగా టీజీ వెంకటేష్ నిర్వహిస్తూ పార్టీకార్యకర్తలకు అండగా ఉంటూ సంక్షేమపథకాలను ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా పనిచేస్తున్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు టీజీ వెంకటేష్‌కు రాజ్యసభ సీటును కేటాయించారు. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల కారణంగా జిల్లాకు చెందిన పలువురు వైకాపా ఎమ్మెల్యేలతో పాటు ఎస్వీ మెహన్‌రెడ్డి కూడా టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీజీ, ఎస్వీలు కలసి నియోజకవర్గంలో కొంత కాలం పనిచేశారు. టీజీ తనయుడు టీజీ భరత్ కర్నూలు నియోజకవర్గం నుంచి రాబోయే ఎన్నికలలో పోటీ చేస్తానని గతంలో ప్రకటించారు. అదే సమయంలో కర్నూలు నియోజకవర్గం నుంచే రాబోయే ఎన్నికలలో అభ్యర్థిని నేనే అంటూ ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రకటించడం వివాదంగా మారింది. ఇటీవల కర్నూలు నియోజకవర్గంలో సర్వే జరుగుతున్నట్లు పుకార్లు వినవచ్చాయి. హైదరాబాద్ నుంచి రాబోయే ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి ఎవరు.. ఎస్వీ మోహన్‌రెడ్డి అయితే ఒకటి నొక్కండి, టీజీ భరత్ అయితే రెండు నొక్కండి అని ఫోన్‌రావడంతో కార్యకర్తలను ఆందోళనకు గురిచేస్తుంది. ఈ విషయంపై ఎస్వీమోహన్‌రెడ్డి ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమకు తెలియదని టీజీ భరత్ అనడంతో పంచాయతీ రాజధానికి చేరింది. సమన్వయంతో పనిచేసి పార్టీని బలోపేతం చేయాలని, రాబోయే ఎన్నికలలో జిల్లాలోని అన్ని సీట్లలో విజయం సాధించాలని పార్టీ అధిష్టానం ప్రణాళికలు రూపొందిస్తుంటే, నేతల మధ్య మాత్రం పోటీ నెలకొనడంతో కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో ఇరు నేతలు రాబోయే ఎన్నికలలో తామే అభ్యర్థిగా రంగంలో ఉంటామని మంగళవారం మీడియా ముందు పోటాపోటీగా ప్రకటించడంతో కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు.

ఎన్నికల సమయం మరో ఏడాదిన్నర ఉండగా ఇరువురు నేతలు సీటుపై మాటల యుద్ధం ఎన్నికల వేడి పెంచుతుంది. నూటికి నూరుశాతం 2019 కర్నూలు అసెంబ్లీ సీటు నాదే నని టీజీ భరత్ అంటున్నారు. ఇప్పటికే టీజీ భరత్ కార్యకర్తలతో మమేకమై పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పనకై కృషి చేస్తున్నారు. రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ నగర అభివృద్ధిపై దృష్టిసారించారు. మరో వైపు ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ప్రజలలో మమేకమై పనిచేస్తున్నారు. నగర అభివృద్ధికోసం కృషి చేస్తున్నారు. 2019 ఎన్నికలలో కర్నూలు నుంచి తానంటేతానే పోటీ చేస్తానని ఇరువురు నాయకులు పోటాపోటీగా మీడియా ముందు ప్రకటించడం కార్యకర్తలను అయోమయానికి గురిచేస్తుంది.

సంపాదకీయం

హిందూత్వ పుణ్యమే 'మహా' మంటలు

'ఓ కులమా నీవెంతటి కసాయివే' అంటాడు అంబేద్కర్. నిజమే కులం.. మనుషుల్ని చీల్చి ఒకనికి దైవత్వం ఇచ్చి అనేకులకు మనిషి స్థానాన్నే నిషేధించింది. ఒకనికి సంపద, సామాజిక హోదానిచ్చి ఇతరులకు బానిస సంకెళ్లు వేసింది. సమాజం ఆధునికతను సంతరించుకొన్నా.. కులం కనుమరుగు కాకపోగా వేయి తలల విషనాగై బుసలు కొడుతోంది. ఆ బుసలే నేడు మహారాష్ట్రలో మంటలు రేపింది. ఇందుకు కారకులెవరో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ముమ్మాటికీ పాలకవర్గమే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు, మైనార్టీలపై దాడులు గణనీయంగా పెరిగిపోతున్నాయని నేషనల్ క్రైం బ్యూరో రికార్డులు ధ్రువీకరిస్తూనే ఉన్నాయి. అయినా హిందూత్వశక్తుల నేరపూరిత చర్యలకు చెక్ పెట్టే ప్రయత్నం మోడీ సర్కారు ఏ మాత్రం చేయడం లేదు. తాజాగా పూణేలో దశాబ్దాల తరబడి దళితులు నిర్వహిస్తున్న శాంతియుత ప్రదర్శనపై మాటువేసి అగ్రవర్ణాలు తెగబడ్డాయి. దళితులపై విచక్షణరహితంగా దాడులు చేశాయి. వాహనాలకు నిప్పు పెట్టాయి. ఆ ప్రదర్శనంతా రక్తసిక్తమయింది. ఓ దళిత యువకుడి ప్రాణాలు కూడా తీసింది. దీనికి నిరసనగా దళితులంతా ఏకమై చేపట్టిన నిరసన ప్రదర్శనలతో మహారాష్ట్ర అతలాకుతలమవుతోంది. దేశ ఆర్థిక రాజధాని నగరమైన ముంబై సహా 13 మహానగరాలకు అల్లర్లు వ్యాపించాయి. బుధవారం బంద్‌తో జనజీవనం స్తంభించింది.వాస్తవానికి ఈ ప్రదర్శన వెనుక ఓ చరిత్ర ఉంది. అంటరానివాళ్లుగా అవహేళనకు గురైనవారిలోనూ ధీరోదాత్తత, పోరాట పటిమ ఉంటుందని కొరేగామ్ యుద్ధం రుజువు చేసింది. అస్పృశ్యుల ఆత్మగౌరవ పోరాటానికి నాంది పలకడంలో కొరేగామ్ యుద్ధం ఇచ్చిన స్ఫూర్తి ఎంతో గొప్పదని అంబేద్కర్ పేర్కొన్నారు. కచ్చితంగా రెండు శతాబ్దాల కిందట 1817 జనవరి 1న పూణే సమీపంలోని భీమానది ఒడ్డున పీష్వా బాజీరావు-2 సైన్యాన్ని బ్రిటీష్ సైన్యం ఓడించింది. పీష్వాలు కుల ఛాందసత్వానికి, అంటరాని కులాల అణచివేతకు మారుపేరుగా నిలిచారు. బ్రాహ్మణ పీష్వాల పరిపాలనలో అంటరాని కులాల వాళ్ళు అనుభవించిన హింస, ఆ పాలకుల ద్వంద్వ వైఖరి, శిక్షా స్మృతుల గురించి అనేక చారిత్రక ఆధారాలున్నాయి. బ్రిటీష్ వారి బాంబే ఆర్మీలో అంటరాని మహర్ కులానికి చెందిన సైనికులు 25శాతం ఉండేవారు. ఇది మహర్‌లు సాధించిన విజయంగానే చరిత్రకెక్కింది. అంటరాని వాళ్ల విజయంగా పేరొం దింది. ఈ నది ఒడ్డునే ఈ యుద్ధ స్మారక చిహ్నం కూడా ఉంది. వీరోచిత మైన ఈ యుద్ధమే మూడో, చివరి ఆంగ్లో-మరాఠా యుద్ధంలో కీలక పరిణామంగా మారింది. భారత గడ్డపై ఆంగ్లేయులు తమ పట్టు బిగించేం దుకు దోహదపడింది. తర్వాతి కాలంలో 'కొరేగామ్' అన్న పదం మహర్ రెజిమెంట్ పౌరుషానికి పర్యాయ పదంగా మారింది. శివరాం జాంబ కాంబ్లే అనే స్థానిక ఉద్యమకారుడు ఈ చారిత్రక ఘటనను ప్రచారం చేయడంలో ముఖ్య భూమిక పోషించారు. అంబేద్కర్ తన 'ది అన్ టచబుల్స్ అండ్ ద పాక్స్ బ్రిటానికా' పుస్తకంలో మహర్ల త్యాగనిరతిని వివరించారు. ఈ విజయోత్సవాన్ని గుర్తుచేసుకుంటూ ఏటా మహర్‌లు ప్రదర్శన చేస్తుంటారు. ఈ ప్రదర్శనను కూడా అంబేద్కరే ప్రారంభించారు. సోమవారం ఈ ఉత్సవాల సందర్భంగా జరిగిన ఘర్షణలే మహారాష్ట్రను మంటల్లోకి నెట్టాయి.

బ్రిటీష్ విజయంపై ఉత్సవాలు జరపడమేమిటంటూ హిందూత్వ అతివాద గ్రూపులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఆ యుద్ధ స్మారకం వద్దకు వచ్చిన దళితులపై దాడులకు తెగబడ్డారు. యువకుడి ప్రాణాలు తీశారు. ఇది కుల ఘర్షణగా మారి రాష్ట్రమంతటా వ్యాపించింది. ఇలా దళితులపై దాడులకు దిగడానికి ప్రధాన కారణం మోడీ అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలేనంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మోడీ సర్కారు అనుసరిస్తున్న దళిత వ్యతిరేక విధానాలను ఆ వర్గాలు ఇలా ప్రతిఘటించాల్సి వస్తోందని కాంగ్రెస్ అధినేత రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే సకాలంలో స్పందించి ఘర్షణలను అదుపు చేయడంలో మహారాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. పరిస్థితి విషమించిన తర్వాత ఈ హింసాత్మక ఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ ప్రకటించారు. కానీ ఇంతవరకూ దళితులపై తొలుత దాడులకు దిగిన హిందూత్వ శక్తులనెవర్నీ పోలీసులు గుర్తించకపోవడం, అరెస్టు చేయకపోవడం ముఖ్యమంత్రి ప్రకటనలో విశ్వసనీయతను ప్రశ్నార్థకం చేస్తున్నది. ఓ చారిత్రక ఘటనలో తమవారి పోరాట పటిమను నేటి తరానికి స్ఫూర్తిగా నిలిపేందుకు ఏటా నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనను అడ్డుకోవడం, దాడి చేయడం క్షమార్హం కానిది. ఇది కేవలం ఆంగ్లేయుల విషయంగానే పరిగణించరాని ఘట్టం, నాటి కులవివక్షపై బాధితులు సాధించిన విజయంగా నిర్వచించాల్సింది. దళితుల్లో ఆ స్ఫూర్తి రగులుతుందేమోననే భయంతోనే నేడు హిందూత్వ శక్తులు ఈ దురాగతానికి తెగబడ్డాయి. ఇది యాదృచ్ఛికంగా జరిగిన ఘటనగానో, కొందరు ఆకతాయిలు చేసిన పనిగానో చూడకూడదు. ఓ పథకం ప్రకారం చేసిన దాడిగానే పరిగణించాలి. మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాతే కుల దురహంకార హత్యలు, దాడులు పెరిగాయి. 2014లో దేశవ్యాప్తంగా 28 కుల దురహంకార హత్యలు జరిగితే, 2015కి ఆ సంఖ్య 251కి, 2017నాటికి రెట్టింపు అయింది. ఇవి కేవలం వెలుగులోకి వచ్చినవి మాత్రమే.. రానివి ఎన్నో! జరుగుతున్న ఘటనల్లో కేవలం పదిశాతమే రికార్డు అవుతున్నాయి. మోడీ పరిపాలనలో ఈ కులదురహంకార హత్యలు ఏకంగా 792 శాతానికి పెరగడం ఆందోళన కలిగించే అంశం. నేడు ప్రపంచంలో జరుగుతున్న ఈ దురహంకార హత్యల్లో ప్రతి ఐదింటిలో ఒకటి భారత్‌లోనే జరుగుతున్నదంటే ఇది ఎంత తీవ్రమైన విపత్తో అర్థం చేసుకోవచ్చు.

భీమా-కొరేగామ్ ద్విశతాబ్ది విజయోత్సవ ప్రదర్శనపై దాడి చేసి, ఇంతటి హింసకు, విధ్వంసానికి కారణమైన శక్తులను తక్షణమే అరెస్టు చేసి బోనులో నిలబెట్టాల్సిన బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రం కూడా తీసుకోవాలి. అదే విధంగా చనిపోయిన దళిత యువకుడి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలి. భవిష్యత్తులో ఈ విజయోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి ముందుకు రావాలి.

చురక

రాజకీయ మధికారం
రక్తిగట్టే ప్రేమజంట
అవినీతితో యంత్రాంగం
అర్పించే నిధుల పంట

అవినీతి రద్దు అంటూ
అధినేతల కనికట్టు
ఆదేశం అమలు చేయ
అడుగు ముందుకేస్తే ఒట్టు

- వేల్పుల నారాయణ

విశ్లేషణ

తక్షణ తలాక్ బిల్లు లక్ష్యమేమి?


సంగిరెడ్డి హనుమంతరెడ్డి

"నేడు చరిత్ర సృష్టించబోతున్నాం. రాజకీయానికి కాదు, మానవత్వం కోసం." డిసెంబర్ 28 న 'ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ బిల్లు, 2017' నులోక్ సభలో ప్రవేశ పెడుతూ డాంబీకరించారు న్యాయ మంత్రి రవి శంకర్ ప్రసాద్.ఆరోజే ఆ సభ ఆమోదం పొందిన ఈ బిల్లు రాజ్య సభ ఆమోదంతో రాష్ట్రపతి సంతకంతో చట్టమౌతుంది. ముస్లిం మగళ్ళు విడాకులివ్వడానికి మార్గదర్శకాలతో చట్టం చేస్తామని అటార్నీ జనరల్2017,ఆగస్టులోసుప్రీం కోర్టుకు తెలిపారు. ఆమేరకు తయారైన ఈ బిల్లులో హామీ నెరవేరలేదు. ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణాలేదు. తక్షణ తలాక్ ను క్రిమినల్ నేరంగా ఎంచి శిక్షలు విధిస్తోంది ఈ బిల్లు. మోడీయంలో రద్దులూ,వక్రీకరణలే చరిత్రలు.

బిల్లు నేపథ్యం:2016 జూన్ లో సంఘ అనుబంధ 'రాష్ట్రవాది ముస్లిం మహిళా సంఘ్' ముస్లిం వ్యక్తిగత చట్టాన్ని (షరియత్) చట్టబద్ధీకరించమని సుప్రీం కోర్టును కోరింది. ముస్లిం మహిళల సామాజిక, ఆర్థిక స్థితులు విషాదంగా, అపాయకరంగా ఉన్నాయని మోడీ సర్కారు సుప్రీం కోర్టుకు అఫిడవిట్ ఇచ్చింది. అక్టోబర్ 24 న ఉత్తర్ ప్రదేశ్ బుందేల్ ఖండ్‌లో ప్రధాని మతం, సంఘం పేరుతో మన తల్లుల, సోదరీమణులకు అన్యాయాన్ని సహించమన్నారు. 2017 ఫిబ్రవరి, మార్చిలలో జరిగిన యు.పి. ఎన్నికల్లో ఇదే ప్రచార ఆయుధమైంది. ముస్లిం మహిళా లోకం ఓట్లను అందించింది. దీన్ని చట్టం చేస్తే మరింత మేలు జరుగుతుందన్న ఆశ పుట్టింది.అందుకే ఈ "మానవత్వ" బిల్లు.షమీమ్ ఆరా వర్సెస్ ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం కేసులో 2002 లోనే సుప్రీం కోర్టు ముమ్మారు తలాక్ చెల్లదని తీర్పిచ్చింది.షాయరా బానో వర్సెస్ భారత ప్రభుత్వం కేసులో 2017, ఆగస్టు 22 న తక్షణ తలాక్ నిర్హేతుకమైనదని, రాజ్యాంగబద్ధం కానేరదని సుప్రీం కోర్టు తీర్పిచ్చింది. ముమ్మారు తలాక్ కేసును కొట్టేసింది. ఖురాన్ సమ్మతించని తక్షణ తలాక్‌ను షరియత్‌లో పరిగణించలేమని న్యాయమూర్తి కురియన్ జోసెఫ్ వ్యాఖ్యానించారు. 'షరియత్ అనువర్తన చట్టం, 1937' భారత ముస్లింలందరికి షరియత్‌ను అనువర్తింపజేసే చట్టం. ఇందులో సంధిగ్ధతలున్నాయి. ముస్లిం మగవారు భార్యలకు ఏకపక్షంగా విడాకులివ్వవచ్చు. ముస్లిం మహిళ భర్తకు విడాకులివ్వాలంటే 'ముస్లిం వివాహ రద్దు చట్టం, 1939' సెక్షన్ 2 ప్రకారం కోర్టుకు దరఖాస్తు చేసుకోవాలి.అటార్నీ జనరల్ హామీ ప్రకారం రాజ్యాంగ నిబంధన14ను అనుసరించి ఈ చట్టాలను సవరించాలి.ముస్లిం మహిళలను మాత్రమే "పట్టించుకొని", ఇతర మతాల మహిళలను అశ్రద్ధ చేయడంనిబంధన14 ఉల్లంఘనే.రాజ్యాంగ నిబంధన 25(2) ప్రకారం ఆర్థిక, రాజకీయ ప్రగతి కోసం మత సంబంధ విషయాలలో కూడా చట్టాలు చేయవచ్చు. అలాంటప్పుడు తక్షణ తలాక్ మాత్రమే ఎందుకు? ముస్లిం మహిళల వివాహ, విడాకులు, ఆస్తి, వారసత్వ హక్కులను క్రమబద్దీకరిస్తూ ఎందుకు చట్టాలు చేయరు?

బిల్లు వివరాలు: ఈ బిల్లు తక్షణ తలాక్‌ను పౌరనేరంగా కాక క్రిమినల్ నేరంగా పరిగణించింది. వారంట్ అక్కరలేని, బెయిల్ కు అవకాశంలేని నేరంతో మూడేళ్ళ జైలు, జరిమానా విధించింది. హిందూ వివాహం జీవిత బంధం. ముస్లిం వివాహం సామాజిక ఒప్పందమే. పరస్పర ఆమోదంతో విడాకులు తీసుకోవచ్చు. పునర్వివాహాలకూ అవకాశముంది. ముస్లిం వివాహ రద్దు పౌర నేర పరిధిలోనే రావాలి.క్రిమినల్ నేరాలలో చేర్చరాదు. ఒప్పంద తప్పిదంగా సుప్రీంకోర్టు గుర్తించిన విడాకుల లోపాన్నిసవరణతో సరిచేయాలి. నేరపరిధికి చేర్చి శిక్షించడం సరికాదు. ఈ చట్టంతో తలాక్ రద్దు కాదు. తక్షణ తలాక్ పై చర్యలుంటాయి. చట్ట అమలు బాధ్యత కోర్టుకు కాకుండా పోలీసులకు అప్పజెప్పారు. బాధిత ముస్లిం స్త్రీ ఫిర్యాదు చేయకుండానే విడాకులిస్తున్న మగవాళ్ళను జైల్లో పెట్టవచ్చు.దేశంలో 60% పోలీసులు సంఘ కార్యకర్తలని ఒక పరివార నాయకుడన్నాడు. భవిష్యత్తులో ఈ సంఖ్య ఇంకా పెరుగుతుంది. పుకార్లతోనే హత్యలు చేసే పరివార్ కార్యకర్తలు, అధికారుల కనుసన్నల్లో మెలిగే పోలీసులు కలిసి ఏమైనా చేయవచ్చు. మతప్రతీకారాలు తీర్చుకోవచ్చు. ముస్లిం పురుషుల మీద సంఘ్ కర్రలు నాట్యం చేస్తాయి. ముస్లిం మహిళలపై బీజేపీ సానుభూతి పారుతుంది. "బిల్లులో క్రిమినాలిటీయే సమస్య. మంత్రి వింటున్నారని నమ్ముతున్నాను." విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎమ్.జె. అక్బర్ బాధను వెళ్ళగక్కారు.ఈ చట్టం బాధిత భార్యల కష్టాలను తొలగించదు, పెంచుతుంది. సంపాదకుడైన భర్త జైల్లో ఉంటే కుటుంబాన్ని పోషించేదెవరు?ఇతర చట్టాలతో సంబంధం లేకుండా విడాకులిస్తానన్న భర్త భార్యా పిల్లల పోషణకు, దినసరి ఖర్చులకు జీవన భృతిని చెల్లించాలి. జైలుకెళ్ళిన భర్త భృతిని ఎలా చెల్లిస్తాడు? తాత్కాలిక సహాయం వివరణ లేదు. పరిహారం అందేవరకు బాధితురాలు ఎలా బతకాలి? కొడుకును జైలుకు పంపిన మహిళను మెట్టినిల్లు ఆదరిస్తుందా?పెళ్ళి తర్వాత నీ బతుకు నీదే అనే పుట్టినిల్లు ఆశ్రయమిస్తుందా? బిల్లులో ముస్లిం మహిళలకు అదనపు సౌకర్యాలేమీ లేవు.ఈ బిల్లులో ప్రస్తావించిన జీవన భృతి 'ముస్లిం మహిళల విడాకు హక్కుల రక్షణ చట్టం, 1986' ప్రకారం చెల్లించే భృతికి అదనమా అన్న వివరణ లేదు. ముస్లిం వివాహ రద్దు చట్టం, 1939 సెక్షన్ 2 (3) ప్రకారం భర్తకు ఏడేళ్ళ జైలు శిక్ష పడితేనే భార్య విడాకులకు అర్హురాలు. ఈ చట్టంలోని మూడేళ్ళ జైలుతో విడాకుల అర్హత రాదు. విడాకులు రానిదే పునర్వివాహం కుదరదు. బహు భార్యత్వం, నిఖా హలాలా వంటి ముస్లిం మహిళలను వేధించే సామాజిక దుశ్చర్యల నివారణ బిల్లులో లేదు. పూర్వ భర్తను పునర్వివాహం చేసుకోవాలంటే ముస్లిం మహిళ మరొక వ్యక్తిని పెళ్ళి చేసుకొని అతనితో దాంపత్య జీవితాన్ని గడపాలన్న నియమమే నిఖా హలాలా. ఈ పద్ధతిలో ముస్లిం మహిళల సమ్మతికి చోటు లేదు. నిఖా హలాలా పూర్తికి భారీ రుసుము తీసుకునేఅద్దె మొగుళ్ళు తయారయ్యారు. చట్ట రూపకల్పనకు సంబంధిత భాగస్వాములందరినీ సంప్రదించాలి. ఇందులో ముస్లిం మహిళా సంఘాలను, మహిళా ప్రతినిధులను సంప్రదించలేదని ప్రభుత్వమే తెలిపింది.

తలాక్‌తో, మతాలతో సంబంధం లేకుండా ముస్లిం స్త్రీల హక్కులకురక్షణ ఉందనిముంబయి మహిళా న్యాయవాది, సంఘసేవకురాలు షహీన్ నక్స్ ఐంది అన్నారు. భారత మహిళలందరికీ గృహ హింస నిరోధక చట్టం, 2005, భారత శిక్షాస్మృతి 498 ఎ అధికరణల ద్వారా రక్షణ ఉంది. సి.పి.సి 125 ప్రకారం భర్త భార్యాపిల్లలకు జీవన భృతి చెల్లించాలి. ముస్లింల స్త్రీలకు 'ముస్లిం మహిళల చట్టం' రక్షణ కల్పిస్తుంది.దీనికంటే మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టమైతే మహిళలందరికీ మేలు జరిగేది. 2011 జనాభా లెక్కల్లోపట్టిక సి 3 ప్రకారం వివాహబంధంలో కొనసాగుతున్న మహిళల్లో ముస్లింలు 87.8%, హిందువులు 86.2%, క్రైస్తవులు 83.7%, ఇతరులు 85.8%. ఎక్కువ మంది ముస్లిం మహిళలే వివాహబంధంలో ఉన్నారు. పునర్వివాహ సౌకర్యం కారణం కావచ్చు. వితంతువుల్లో ముస్లింలు 11.1%, హిందువులు 12.9%, క్రైస్తవులు 14.6%, ఇతరులు 13.3%. వితంతువుల్లో హిందువుల కంటే ముస్లింలే తక్కువ. విడాకులు ఇవ్వకుండా వదిలేయబడిన మహిళల్లో ముస్లింలు 0.67%, హిందువులు 0.69%, క్రైస్తవులు 1.19%, ఇతరులు 0.68% ఉన్నారు. ఇక్కడా ముస్లింలే తక్కువ. మన దేశంలో అనాథలైన మహిళల సంఖ్య 24.5 లక్షలు. వీరిలో హిందువులు 20 లక్షలు.ముస్లింలు 2.80 లక్షలు, క్రైస్తవులు 90 వేలు, ఇతరులు 80 వేలు. హిందువులలో అధికులు హరిద్వార్, మథుర, బృందావన్, వారణాసిలలో అధ్వాన్నంగా జీవిస్తున్నారు. వీరిపై లైంగిక దాడితో సహా అనేక రకాల దోపిడీలు జరుగుతున్నాయి. మెట్టినింట్లోనో, పుట్టినింట్లోనో ఉన్నవారు పనిమనుషుల్లా బతుకుతున్నారు. దేశంలో 4.30 కోట్ల మంది వితంతువులున్నారు. వారిలో 10 లక్షల మంది ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. రాజు పేద, మతం కులం తేడాలు లేకుండా భర్తకు దూరమైన ప్రతి మహిళ జీవితం దయనీయమే. కొడుక్కు అక్కరలేని కోడలు అత్తింటికి పట్టదు. అక్కడి పిల్లగా పెరిగిన ఆడపిల్లను పుట్టింటివారు పలకరించరు. 43 ఏళ్ళ క్రితం వదిలేయబడ్డ జశోదా బెన్ మోడీ 24.11.2014 న ఆయన పిలిస్తే ఆయన దగ్గరకెళతానన్నారు. ఆయన స్పందించలేదు.తలాక్ ఖురాన్ సమ్మతమే కాని ముమ్మారు తలాక్ ఆమోదనీయం కాదు. సున్నీ చట్టంలోని 3 సాంప్రదాయాల్లో తక్షణ తలాక్ చెల్లుబాటు కాదు. నాల్గవ సాంప్రదాయం దేవ్ బంద్ లో మాత్రం ఇది అమల్లో ఉంది.భారత ముస్లింలలో ఎంత మంది తక్షణ తలాక్ ను పాటిస్తున్నారన్న గణాంకాలు ప్రభుత్వం దగ్గర లేవు. చట్ట నేపథ్యంలో కూడా తెలుసుకునే ప్రయత్నాలు చేయలేదు. ఒక స్వచ్ఛంద సంస్థ అంతర్జాల సర్వేలో 1% కంటే తక్కువ మంది ఈ పద్ధతిలో విడాకులిచ్చారని తేలింది. ఇంత తక్కువ మంది కోసం అందులోనూ సుప్రీం కోర్టు రెండు సార్లు రద్దుచేసిన తలాక్‌పై హామీ తప్పిన బిల్లు అవసరమేమి? రాజకీయ లబ్ధి తప్ప!

వ్యాస రచయిత : ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి, సెల్ : 9490204545

వి-మెయిల్

రోగంకన్నా చికిత్స ప్రమాదకరం : జాతీయ వైద్య కమిషన్ బిల్లు

అవినీతికి, అసమర్థతకి ఆలవాలంగా మారిన జాతీయ వైద్య మండలి స్థానం లో ఉద్దేశించబడిన జాతీయ వైద్య కమిషన్ ఏర్పాటు బిల్లు మరింత ప్రమాదకరంగా కనబడుతోంది. నియంత్రణ మండలిలో లోపాల్ని సరిదిద్ది ,పట్టాలెక్కించడం మాని,వేరే రూపంలో మరిన్ని కోరలతో మరో నియంతృత్వ రూపాన్ని తీసుకురావడం వల్ల ప్రజలకు గానీ,వైద్య రంగానికి గానీ ఒరిగేదేమీ లేకపోగా మరింత నష్టం కలుగజేసేదిగా ఉంది.ఇది అవినీతి సుడిగాలి ఇంట్లోకి రాకూడదని కిటికీలు మూసి,తలుపులు బార్లా తెరవడం లాంటి ప్రక్రియ. ప్రతిపాదిత కమిషన్‌లో 25 మందిలో ఐదుగురే వైద్యులుంటారు.మిగతా అంతా ప్రభుత్వం చే నియమించబడి ఉంటారు.వైద్యరంగాన్ని దిశానిర్దేశం చెయ్యాల్సిన కమిషన్ లో వైద్యులకు చోటు నామమాత్రం కావడం విచిత్రం. పైగా కేవలం ఏవో ఐదు రాష్ట్రాలకు మాత్రమే ప్రాతినిధ్యం ఉండడం రాష్ట్రాల హక్కులకు భంగకరం. నియంత్రణ మండలి వ్యవహారాలలో పారదర్శకత, జవాబుదారీతనం ప్రోది చెయ్యడం ద్వారా మాత్రమే అవినీతిని నిరోధించవచ్చు గానీ ప్రభుత్వ నామినీలను నింపడం ద్వారా కాదు. అది మరింత బరితెగింపు కి ద్వారాలు తెరిచినట్టే. పైగా ప్రయివేటు వైద్యకళాశాలలు తమ సీట్లు పెంచుకోడానికి,అరవై శాతం విద్యార్థుల ఫీజులు పెంచుకోడానికి పూర్తి స్వేచ్ఛని ఈ బిల్లు ప్రతిపాదిస్తుంది. ఆయా కళాశాలల నుండి ఉత్తీర్ణులైన వారి శాతం బట్టి గ్రేడింగులిస్తామని,జరిమానా విధిస్తామని అంటున్నారు.ఈ అస్పష్ట విధానాలు ముందుముందు వేలంవెర్రిగా కళాశాలలు పుట్టుకు రావడానికి ఊతమిస్తాయి తప్పితే ఏవిధంగానూ అవినీతిని కట్టడి చెయ్యలేవు,వైద్యవిద్య నాణ్యత పెంచలేవు.ఏళ్లకేళ్లు వైద్యవిద్యనభ్యసించిన పిమ్మట మళ్ళీ ఎగ్జిట్ పరీక్ష రాయాల్సిరావడం వైద్యవిద్యార్థులకు అదనపు భారం.లోక్ సభ ఈ బిల్లు ని స్టాండింగు కమిటీకి పంపడం మంచి పరిణామం.మరింత అధ్యయనంతో మంచి చట్టాన్ని తీసుకు రావాలి.ప్రస్తుత రూపంలోని బిల్లుని పూర్తిగా వ్యతిరేకిస్తున్న భారత వైద్య మండలి తగు సలహాల్ని అందివ్వాలి.ఎవరి గుప్పిట్లో ఏ అధికారాలుండాలి అని ఆలోచించడానికి బదులు ఏ రకంగా వైద్య రంగాన్ని మెరుగు పర్చగలమో, అందుకు తగ్గ వ్యవస్థని ఎలా తీసుకురాగలమో ఆలోచించాల్సిన అవసరం ఉంది.

- డా.డి.వి.జి.శంకరరావు, మాజీఎంపీ, పార్వతీపురం

బీజేపీ ప్రచార శైలితో

అంతర్జాతీయంగా భారత్ విశిష్టత భగ్నం

విశ్వనాథ్ వై.

అధికారం చేజిక్కించుకునేందుకు దిగజారుడు ప్రచారానికి పాల్పడటం రాజకీయాల్లో కొత్తేమీ కాదు. విలువలకు తిలోదకాలిచ్చిన సందర్భాల్లో మాత్రం ఆయా రాజకీయ పక్షాల తిరోగమన విధానాలను జనానికి తెలియ జేయడం అవసరం. ఈకోణంలో పరిశీలన జరిపినపుడు ప్రజాస్వామ్య లౌకిక విలువలు, జవాబుదారీతనం, పౌరుల నైతిక స్థైర్యం ఇనుమడింపజేయడం, పారదర్శకత, విశ్వసనీ యతలు గత ఐదు సంవత్సరాలుగా భారత రాజకీయాల్లో పతనమవుతున్నట్లు స్పష్టమవుతోంది. ఈ పతనానికి పరాకాష్ట 2014 ఎన్నికలకు ముందు, ఇటీవల జరిగిన హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కళ్లకు కట్టినట్లయింది. రెండవ సారి, 2జీ కేసు తీర్పు వెలువడిన సమయంలోనూ బీజేపీ ప్రచారశైలి, అవినీతిపై పోరు చర్చకు నిలిచాయి. అవినీతి, అభివృద్ధి, ఉగ్రవాద కట్టడి, నిరుద్యోగ నిర్మూలన, పారదర్శక పాలన తదితర హామీలన్నీ బీజేపీ అమ్ముల పొదికే పరిమితమయాయి. అన్ని స్థాయిల్లో వైఫల్యాన్ని చవి చూసిన ఈ హామీల స్థానే అపోహలు,వదంతులు,పుకార్లు వండి వార్చడంలోనూ, కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడంలోనూ కాషాయ దళానికి సమ ఉజ్జీలు లేరనిపిస్తోంది ఏదోలా గెలిచాం కదా ఎవరు నవ్విపోదురుగాక నాకేటి సిగ్గన్న చందంగా. బీజేపీ వ్యవహరిస్తోంది. త్వరలో జరగబోయే కర్నాటక అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం బీజేపీ ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించింది. ఇందుకోసం ఆరాష్ట్ర పర్యటనకు వెళ్లిన సందర్భంలో వామపక్ష భావజాల పాత్రికేయురాలు గౌరీ లంకేష్ హత్య కేసులో న్యాయంజరిగేలా చూడాలంటే తమకు అధికారం కట్టబెట్టాలంటూ కేంద్ర హోంశాఖ మంత్రి హోదాలో రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు.

2జీ స్పెక్ట్రమ్ వేలంలో అక్రమాలు చోటు చేసుకున్న కారణంగా ప్రభుత్వ ఖజానాకు రూ.1.76లక్షల కోట్ల మేర గండిపడిందనేది కేసు సారాంశం. ఇందుకు బాధ్యులుగా నాటి టెలికాం మంత్రి (డీఎంకే) ఏ రాజా, డీఎంకే ఎంపి (కరుణానిధి కుమార్తె) కనిమొళిలు కొన్ని నెలల పాటు జైలు జీవితం గడిపారు. వీరిపై మోపిన అభియోగాల నిరూపణకు తగిన సాక్ష్యాధారాలు లేనందున 17మందిని నిర్దోషులుగా విడుదల చేస్తూ సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం తీర్పు ఇచ్చింది.

2014 ఎన్నికల్లో అధికార యూపీఏ-2 భంగపాటుకు దారి తీసిన అనేక కారణాల్లో 2జీ కేసు ఒకటి. ఈకేసును అడ్డం పెట్టుకుని అధికార యూపీఏ-2కి వ్యతిరేకంగా కాషాయ దళం సాగించిన ప్రచారం అంతా ఇంతా కాదు. ఇలాంటి ప్రచారంతో లబ్ధి పొందిన జాబితాలో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధ్యక్షుడు అరవింద్ కేజ్రీవాల్ మొదటి స్థానం దక్కించుకున్నారంటే అతిశయోక్తి కాదు. అవినీతి అంతానికి లోక్‌పాల్ ఏర్పాటు చేయాలంటూ నిరాహారదీక్షకు దిగిన సామాజిక కార్యకర్త అన్నాహజారే శిష్య బృందంలో కేజ్రీవాల్ ముఖ్యుడు. అందరి కన్నా ఎక్కువ ప్రయోజనం పొందింది బీజేపీ నాయకులు నరేంద్రమోడీ, అమిత్ షా, అరుణ్ జైట్లీలు. న్యాయశాస్త్రంలో అపార ప్రజ్ఞావంతులు తమ పార్టీ సభ్యులుగా ఉన్నారని తరచూ బీజేపీ చెబుతూ ఉంటుంది. ఆర్థిక వేత్తగా కీర్తినందుకున్న మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను అప్రదిష్ట పాల్జేయడానికి ప్రచార సాధనంగా 2జీ కేసును బీజేపీ ఉపయోగించుకుంది. మన్మోహన్‌సింగ్‌ను ప్రజల దృష్టిలో వెన్నెముక లేని నాయకునిగా, ఒక విలన్‌గా చిత్రించేందుకు గోబెల్స్ తరహాలో బీజేపీ నాయకులు విపరీతపు ప్రచారాలు సాగించారు. యూపీఏ-2, మన్మోహన్‌సింగ్‌ల మీద కక్షకట్టి సాగించిన ప్రచారానికి బీజేపీ నాయకులు లబ్ధిపొందారనే చెప్పాలి.

సోనియా ఆదేశిస్తే...మన్మోహన్ పాటిస్తారనే ఒక సాధారణ అభిప్రాయాన్ని జనం మెదళ్లలోకి చొప్పించగలిగారు. ఫలితంగా స్వయం నిర్ణయాలు తీసుకోలేని ఒక అశక్తుడు ప్రధాని మన్మోహన్ అనే అవగాహన జనంలో ఏర్పడింది.. అత్యధిక ప్రజానీకం ఇప్పటికీ ఇదే అవగాహన కలిగి ఉన్నారంటే అతిశయోక్తి కాదు. దేశ ఆర్థిక వ్యవస్థకు అధికార బీజేపీ విధానాలు , మోడీ పాలన హానికరమంటూ మన్మోహన్ ఎంతగా అరచి గీపెట్టినా జనం చెవికెక్కించుకోక పోవడానికి జనంలో నెలకొన్న ఇదే అవగాహన ప్రధాన కారణం. పైగా, ఆయన పేరు విన్నంతనే.. ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసేందుకు కుంభకోణాలను ప్రాయోజితం చేశారంటూ మన్మోహన్‌కు వ్యతిరేకంగా జన విమర్శలు రాజుకునేందుకు దోహదకారులై నారు. సోనియా మాటకు ఎందుకు ఎదురు చెప్పలేక పోయారంటూ మన్మోహన్ మాజీ మీడియా సహాయకుడు ఒకరు తను రాసిన పుస్తకంలోనూ ప్రస్తావించడం గమనిస్తే ప్రతి కూల ప్రచార తీవ్రత ఆనాడు ఎంతటి తీవ్ర స్థాయిలో సాగిందో తేలికగా అర్థం చేసుకోవచ్చు. అప్రదిష్ట పాల్జేసే రాజకీయ అధికార క్రీడలో మన్మోహన్‌ను ఒక పావుగా వాడుకుం టున్నారన్న వాస్తవాన్ని గ్రహించిన జనాలు చాలా తక్కువ. బీజేపీ అగ్రనాయకునిగా గుర్తింపు పొందిన ఎల్కే అద్వానీ ఇలాంటి నిరాధారనిందారోపణ ప్రచారపిత అనడం ఏమాత్రం అతిశయోక్తి కాదు. కాంగ్రెస్ విశ్వసనీయత మూల కేంద్రంగా మన్మోహన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారంటూ అద్వానీ సాగించిన ప్రచారంతో మొత్తంగా కాంగ్రెస్ విశ్వసనీయతను దెబ్బతీయ గలిగారు. ఈప్రచారధాటికి జనంలో కాంగ్రెస్ విశ్వసనీయత కోల్పోయింది. చివరకు 2014లో అధికారం కోల్పోయింది.

ప్రముఖ వామపక్ష భావజాల పాత్రికేయురాలు గౌరీలంకేష్‌ను దారుణంగా హత్య చేసిన కిరాయిమూకలకు వెన్నుదన్నుగా నిలిచిందెవరనేది కర్నాటక సహా అనేక మీడియా సంస్థలు సంకేత ప్రాయకథనాలను ప్రసారం చేశాయి. అయినా, ఇంత వరకు కనీసం నిందితులను గుర్తించడంలో ఆయా ప్రభుత్వాలు విఫలమయ్యాయి. లేదా విఫలమయినట్లు నటిస్తున్నాయి. ఈ స్థితిపై కర్నాటక రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి వ్యతిరేక చర్చలే నడుస్తున్నాయనేది మీడియా సమాచారంగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కర్నాటకలో బీజేపీ అధికారంలోకి వస్తే గౌరీ లంకేష్ హత్యకేసులో నిందితులను పట్టుకుంటామనీ, ఈ కేసులో న్యాయం చేస్తామంటూ రాజ్‌నాథ్‌సింగ్ అప్రకటిత ఎన్నికల బాకా ఊదారు. జనం అనుమానంతో ప్రశ్నిస్తున్నారు. ...ఆయన కేంద్ర హోంమంత్రేనా? అని. ఈప్రశ్నకు బీజేపీ వర్గాలు సమాధానమివ్వడానికి ఇష్టపడటం లేదు. 2017లో దేశ వ్యాపితంగా సుమారు 113 మంది పాత్రికేయులు హత్యకు గురయినట్లు వెలుగులోకి వచ్చిన సమాచారం విషయంలోనూ అధికార బీజేపీకి చీమకుట్టినట్లయినా లేక పోవడం విచారకరం.

హిమాచల్, గుజరాత్ అసెంబ్లీల ఎన్నికల ప్రచారంలో దాదాపు 200లకుపైగా ప్రచార సభల్లో ప్రసంగించిన ప్రధాని మోడీ తమ మూడున్నరేళ్ల అధికార అభివృద్ధిని, దేశ వ్యాప్తంగా ప్రచారంలో పెట్టిన గుజరాత్ తరహా అభివృద్ధి నమూనాను గురించి కనీసం ఏఒక్క సభలోనూ ప్రసంగించలేదు. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ, పటీదార్ ఉద్యమం, దళిత, ముస్లిం మైనారిటీ వర్గాలకు జరుగుతున్న అన్యాయం, మహిళ సాధికారతల్లో ఏఒక్క అంశాన్ని ప్రస్తావించే సాహసమే చేయలేకపోయారంటే అతిశయోక్తి కాదు. వాస్తవానికి గుజరాత్‌లో ఓడిపోతామనే ముందస్తు అభిప్రాయానికి బీజేపీ అగ్రనాయకత్వం వచ్చినట్లు ఫలితాల తదనంతర సంభాషణల్లో చూచాయగా వెల్లడైనట్లు మీడియా కథనాలు వెలువడ్డాయి. గుజరాత్‌లో ఓటమి నేరుగా 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీ గద్దెను తాకుతుందనే అభద్రతా భావం నుంచే ప్రతికూల విమర్శలు, అపోహలు మొదలు చివరకు గుజరాత్ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు పొరుగు దేశం సాయాన్ని కాంగ్రెస్ కోరిందంటూ ప్రధాని మోడీనే చెప్పుకోవడం ఎవరికి గౌరవం? రెండవది,తనను హతమార్చేందుకు పాకిస్తాన్ గడ్డ మీద మాజీ ప్రధాని మన్మోహన్, మణిశంకర్ అయ్యర్లు కుట్రకు పాల్పడ్డారని, విదేశీ హంతకులకు సుపారీ (హత్య చేసినందుకుగాను చెల్లించే నజరానా) ఇచ్చారంటూ అధమ స్థాయి ప్రచారానికి మోడీ దిగజారడమూ కాంగ్రెస్‌ను ఉగ్రవాద బూచిగా చూపి గుజరాత్ గద్దె దక్కించుకోవడానికేనని వేరుగా చెప్పనవసరం లేదు. మోడీ వ్యవహార శైలిని ఉద్దేశించి కోపం పట్టలేని మణిశంకర్ అయ్యర్ ఒక సందర్భంలో 'నీచ్' (నీచుడు) అనే పదాన్ని ఉపయోగించారు. ఇదే పదాన్ని ఆసరగా తీసుకుని గుజరాత్‌లో అత్యధిక సర్క్యులేషన్ గల పత్రిక ఒకటి 'మోడీ నీచ జాతి'కి చెందిన వాడని మణిశంకర్‌ను ఉటంకిస్తూ పతాక శీర్షికగా ఒక కథనాన్ని ప్రచురించింది. వాస్తవానికి మోడీని నీచుడనేంతవరకే మణిశంకర్ అయ్యర్ విమర్శ పరిమితం కాగా, పత్రిక స్వకపోల కల్పితంగా ప్రచురించిన కథనంలోని జాతి పదాన్ని తనను ఉద్దేశించి మణిశంకర్ అయ్యరే అన్నారని తనకు జరిగిన అవమానం మొత్తం గుజరాత్‌కు గుజరాతీయులకు జరిగిపోయిన అవమానంగా మోడీ చిత్రించగలిగారు. ఈచిత్రణకు బీజేపీకి అనుకూలంగా వ్యవహరించే మీడియాలోని ఒక పక్షమూ వత్తాసు పలికింది. ఇదే నిజమేనోమో అనేంతటి తీవ్ర స్థాయిలో మోడీ తదితర వందిమాగధులు జరిపిన విపరీత ప్రచారాన్ని అడ్డుకునే లోపుగానే కాంగ్రెస్‌కు జరిగిపోవాల్సిన నష్టం జరిగి పోయింది. .

కుల,మత,జాతి, భాష, ప్రాంతీయ భావోద్వేగాలు రెచ్చగొట్టడం ద్వారా సమాజంలో చీలికలు తేవడం, అధికారం చేజిక్కించుకోవడమే బీజేపీ ప్రచార లక్ష్యంగా కనిపిస్తోందంటే అతిశయోక్తి కాదు. ఈ క్రమంలో హుందాతనం, విలువలు, రాజ్యాంగ మౌలిక సూత్రాలు, ప్రచార నియమావళి, నిబంధనలు, సాధారణ మంచి-మన్ననలూ అనేవాటిని బీజేపీ పట్టించుకుంటున్న దాఖలాల్లేవు. ఒక దేశ ప్రధానిగా మోడీ జరిపిన అపోహల ప్రచార రభస చివరకు అంతర్జాతీయ మీడియాలోనూ స్థానం దక్కించుకున్న ఫలితంగా అంతర్జాతీయ సమాజంలో భారత్ ప్రజాస్వామ్య, రాజకీయ విలువలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. ఇటీవల హిందుస్తాన్ టైమ్స్ నాయకత్వ సదస్సులో అతిథి ప్రసంగీకునిగా విచ్చేసిన అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామ మాట్లాడుతూ ..కులం, మతం,జాతి, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం దేశాభివృద్ధికి క్షేమదాయకం కాదని ప్రధాని మోడీకి తను గతంలోనే హితవు చెప్పినట్లు చెప్పారు. ఈదేశంలోని ముస్లింమైనారిటీల్లో తీవ్ర అభద్రతా భావం నెలకొందనీ, దాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలనీ చెప్పానన్నారు. తామూ ఈ దేశ పౌరుల మేననే విశ్వసనీయతను భారత్‌లోని ముస్లింల్లో కలిగించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. ఈ దేశ ప్రధాని మోడీ , ఆయన ప్రాతినిధ్యం వహించే బీజేపీ వ్యవహారశైలిని గురించి మన గడ్డ మీద విదేశీ మాజీ అధ్యక్షుడు ఒకరు ఇంతగా చెప్పడం ఎవరికి గౌరవం? ఈ తరహా ప్రచార శైలితో అంతర్జాతీయ సమాజంలో భారత్ ప్రజాస్వామ్య విశిష్టతను బీజేపీ పాలకులు భగ్నం చేస్తున్నారని గుర్తించాలి. భారత్ విశిష్టత పరిరక్షణకు లౌకిక శక్తులు, ప్రజాతంత్ర వాదులు, అభ్యుదయ పథగాములు సహా పీడిత, తాడిత ప్రజానీకమంతా ఐక్యప్రతిఘటనగా ఆవిర్భవించాల్సిన సమయం ఆసన్నమైంది.



స్కై జంపింగ్!

నేలమీద కాళ్ళకు చక్రాలు కట్టుకుని దూసుకుపోయే స్కేటింగ్ పోటీలే మనకు తెలుసు. మరి స్కై జంపింగ్ పోటీలూ ఉన్నాయని తెలుసా? ఆకాశమార్గంలో వెడల్పాటి చెక్కల సాయంతో వేగంగా ప్రయాణిస్తూ దూకడమే ఈ పోటీలు. ఇవి జరిగేది మనదేశంలో కాదులెండి. జర్మనీలో. అక్కడ జరుగుతున్న స్కై జంపింగ్ పోటీల్లో భాగమే ఈ దృశ్యం.

రచయితలకు సూచన

'బతుకు' పేజీలో ప్రచురణకు పంపే రచనలు, వార్తా కథనాలను ఇక నుంచి ఈ దిగువ ఈ మెయిల్ చిరునామాకు పంపగలరని మనవి.

batuku@visalaandhra.com

విశాలాంధ్ర

బతుకు

The Life

www.visalaandhra.com

గురువారం

04 జనవరి 2018



సంక్రాంతి తెలుగువారికి పెద్ద పండగ. ఇది పెద్ద పండగే కాదు ముగ్గుల పండగ కూడా. ఈ సీజన్‌లో పెట్టినన్ని ముగ్గులు ఇంకెప్పుడూ కనిపించవు. ఈ నెల రోజులూ ఇంటి ముంగిళ్ళన్నీ రంగురంగుల రంగవల్లికలతో కళకళలాడుతుంటాయి. ఇంటి ముందు ముగ్గులు వేసేందుకు మహిళలు పోటీ పడే కాలమూ ఇదే. ముగ్గు అంతా వేశాక ఎవరి ముగ్గు బాగుందనే చర్చలూ జరుగుతుంటాయి. ఈ క్రమంలో సంప్రదాయ చుక్కలు, గీతల ముగ్గులే కాదు రకరకాల డిజైన్స్ దర్శనమిస్తుంటాయి. మరి మీరు మధుబని ముగ్గు ఎప్పుడైనా వేశారా? మధుబని పెయింటింగ్ తెలుసు, మధుబని పెయింటింగ్ డిజైన్లతో కూడిన డ్రస్‌లు తెలుసు.... మధుబని ముగ్గు గురించి వినలేదే! అంటారా! మధుబని ముగ్గూ ఉంది. ఈ పండగకి ఈ టైపు ముగ్గునీ వేసి చూడండి. మీ ప్రత్యేకతను చాటుకోండి. మరి దీని కథాకమామీషు ఏంటో తెలుసుకుందామా!

ముంగిట మధుబని ముగ్గు



మధుబని పెయింటింగ్‌లు గురించి అందరికీ తెలిసిందే. బీహార్‌కి చెందిన ఈ కళ చాలా ప్రత్యేకంగా ఉంటుంది. ఇది గోడల మీద వేసే సంప్రదాయ చిత్రకళ. ఇందులో ముగ్గులూ ఒక భాగమే. అయితే ఈ పెయింటింగ్‌లు అయినా ముగ్గులు అయినా సాధారణంగా గోడలమీదే కనిపిస్తుంటాయి.

వీటిని ఇటీవలకాలంలో వాకిట్లోనూ వేస్తున్నారు. ఇప్పుడు మన రాష్ట్రంలోనూ చాలా ప్రాంతాల్లో ముఖ్యంగా గిరిజనుల నివాసిత ప్రాంతాలు, వారు ఉండే పరిసర ప్రాంతాలు ఈ ట్రెండ్ కనిపిస్తోంది. ఇందులో సంప్రదాయ ముగ్గులే కాదు జియోమెట్రిక్ రూపాలు కనిపిస్తున్నాయి. అంతే అందమైన డిజైన్లనే ముగ్గుల రూపంలోకి మార్చుకోవడం.

ఈ మధుబని ముగ్గు లేదా మధుబని డిజైన్లు మన రాష్ట్రంలోని విశాఖ తీర ప్రాంతంలో ఎక్కువగా దర్శనమిస్తున్నాయి. ప్రసిద్ధి చెందిన పర్యాటక ప్రాంతం అరకులోయ, శ్రీకాకుళం, పశ్చిమగోదావరి జిల్లాలోని పోలవరం ప్రాంతం, కృష్ణానదీ తీరంలోని లంక గ్రామాల్లో ఈ మధుబని ముగ్గులు వేస్తున్నారు. పోలవరం ముంపు గ్రామాల్లోని రామయ్యపేట, పోలవరంతో పాటు జంగారెడ్డిగూడెం, నూజివీడు, పాలకొల్లు, రాజమండ్రి లాంటి పట్టణాల్లోనూ ఈ మధుబనీ చిత్రకళ రంగవల్లులు సందడి చేస్తున్నాయి.

మధుబని ముగ్గులు రంగుల హరివిల్లులను తలపిస్తాయి. కంటిచూపును తిప్పుకోనీయకుండా చేస్తాయి. ఇక్కడ కనిపించే ఈ చిత్రాలే అందుకు నిదర్శనం. అతి పెద్ద ఏనుగు, మధ్యలో చిన్నచిన్న పువ్వులు, పైన అందమైన మరో పెద్ద పువ్వు, అలాగే పువ్వుల చుట్టూ ఎగురుతున్న సీతాకోకచిలుకలు, అందంగా నాట్యమాడుతున్న నెమళ్ళు, ఒక దగ్గర చేరి కిచకిచలాడుతున్న పక్షులు, చేపల కుటుంబం, చెట్టుమీద వాలిన చిన్నగువ్వ ఇవన్నీ మధుబని పెయింటింగ్‌లే...ఇవన్నీ మధుబని ముగ్గులే. వీటిని మీ వాకిట్లోకి చేరిస్తే ఇంటికి ఎంత అందం వస్తుందో ఊహించండి. ఈ సంక్రాంతి సీజన్‌లో ముంగిట్లో మధుబని ముగ్గు వేయండి. అందరి చేతా శభాష్ అనిపించుకోండి. కొంచెం నేర్పరితనం ప్రదర్శిస్తే ఈ చిత్రకళతో ముగ్గుల పోటీల్లోనూ మార్కులు కొట్టేయవచ్చు, బహుమతిని పట్టేయవచ్చు. అందరి ప్రశంసలూ అందుకోవచ్చు. మరి మధుబని ముగ్గుల గురించి తెలిసిందిగా. ఇక ఈ ముగ్గులు వేసేందుకు మీరూ సిద్ధమైపోండి! ఇంటిముందు వెరైటీ రంగోలీ వేయాలని ఆరాటపడేవారికి ఈ మధుబని ముగ్గే సరైనది! మామూలు ముగ్గే కాదు రంగులు దిద్దేందకూ ఇది అనువైనదే!



మధుబని చిత్రకళ గురించి చెప్పడానికి మాటలు చాలవు, కళ్ళతో చూసి తరించాల్సిందే. ఇంటి ముంగిట ముగ్గుల గురించి తెలుసుకున్నాం కదా! మరి ఈ పెయింటింగ్‌లు ఎప్పుడైనా మీ ఇంటి గోడల మీద వేయించారా! లేదంటే ఈసారి అది కూడా ట్రై చేయండి. ఇంటి గోడలకే కాదు మొత్తంగా ఇంటికి ఇవి ఒక కొత్త రీవిని తీసుకొస్తాయి. మీదైన ప్రత్యేకతను చాటతాయి. దీనిని సాధారణంగా వేసవి లేదా చలికాలంలో గోడల మీద వేస్తుంటారు. ఇంటి లోపలి గోడల మీద ఈ పెయింటింగ్‌లు వేస్తే ఇంటికి కొత్త అందం వస్తుంది. ఇది ప్రత్యేకంగా కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. ఎండాకాలంలో అయితే ఎర్రటి గోడల మీద తెలుపు సుద్దతో గీస్తారు. ఇంటి లోపలి గోడలకు పెయింటింగ్ వేయాలనుకున్నప్పుడు ఎండాకాలాన్ని ఎంచుకోండి. అదే ఇంటి బయట గోడలపై ఈ పెయింటింగ్ వేయాలనుకుంటే శీతాకాలాన్ని ఎంచుకోండి. ఈ బయట గోడలకు వేసే పెయింటింగ్‌లకు సాధారణంగా పేడనీ వాడుతుంటారు. పేడని ముద్దగా చేసి గోడలకు రాసి ఆపైన ఆకుపచ్చని వర్ణం వేస్తారు. ఆ తర్వాత దీనిమీద తెల్లటి సుద్దతో పెయింటింగ్‌లు వేస్తారు. చెట్టు నుంచి పండ్లు కోస్తున్న అందమైన జవ్వని, ద్రాక్షతోట, నెమలి పింఛం, పొలాల మధ్యలో సూరీడు, పొద్దుతిరుగుడు చెట్లు, సెలయేరు, పచ్చిక బయళ్ళు లాంటి పెయింటింగ్‌లో ఈ కళలో ఎక్కువగా కనిపిస్తాయి. ఇందులో ప్రధానంగా మూడు రకాల రంగులు ఉపయోగిస్తారు. అందులో ఒకటి విజిటబుల్ కలర్ గ్రీన్ కాగా ఇంకొకటి మట్టి రంగు ఎరుపు, మూడోది నలుపు. మనదేశ సంస్కృతి, కళలకు ప్రతిరూపం ఈ మధుబని చిత్రకళ. రాజుల కాలం నుంచి బ్రిటిష్ కాలం వరకూ ఎంతో ప్రాచుర్యంలో ఉన్న ఈ మధుబని చిత్రకళ ప్రస్తుతం అంతరించిపోయే దశలో ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో మినహా ఇంకెక్కడా అంతగా కనిపించడం లేదు. జానపద కార్యక్రమాలు, ఫుడ్ ఫెస్టివల్స్, పండగలప్పుడు జరిపే వేడుకలు లాంటి కొన్ని సందర్భాల్లో మినహా ఇంకెక్కడా ఈ కళను ఆదరించడం లేదు. కొన్ని రకాల డ్రస్‌లు, నేత చీరలు, దుప్పట్లు, ఫొటోఫ్రేమ్స్ తదితరాల పైన ఈ చిత్రకళ కనిపిస్తోంది. వీటిమీద అందమైన ముగ్గుల రూపంలోనూ ఒదిగిపోతోంది. మన పూర్వీకుల నుంచి ఉన్న ఈ కళకు ఆదరణ పెరగాలి. ఇందులో మీరూ భాగం కావాలి. ఈ ఏడాది సంక్రాంతి సీజన్‌తోనే దీనిని ప్రారంభించండి. ఇంటి ముంగిలిలో మధుమని ముగ్గని అలంకరించండి. ఇంటిని అందంగా తీర్చిదిద్దడంతో పాటు, మీ ప్రత్యేకతను చాటుకోవడంతో పాటు ఈ కళనూ బతికించండి. పదిమందికీ దీనిని గురించి తెలియజేయండి.






- ముప్పిడి రాంబాబు













కంఠానికి కొత్త సొగసు!

మెడకి నగలు అనగానే నెక్లెస్‌లే గుర్తుకొస్తాయి. ఇవి బంగారంతో చేసినవే కానక్కర్లేదు. బంగారాన్ని మించిన మెరుపులు ఇప్పుడు చాలానే వస్తున్నాయి. ముత్యాలు, రూబీలు లాంటి మెటీరియల్‌తో తయారుచేసిన ఈ కంఠాభరణాలను చూస్తే మీరూ ఇదే మాట అంటారు. మామూలు నెక్లెస్‌లకు భిన్నంగా ముచ్చటైన డిజైన్లలో మురిపిస్తున్నాయి కదూ!



అతడు-ఆమె

జరిగిన కథ

నాకు కొంత ఓర్వలేనితనం వచ్చింది.

కొసకి అన్నాగదా - "పిల్లకి పాలవేళయింది. ఇక ఇంటి కెళ్ళాలి మనం". అంతవరకూ యెంత చక్కగానో నిద్రపోతున్న పిల్ల వక్కసారి తెలివి వచ్చేసి ఏడవడం మొదలెట్టింది.

దాంతో ఆవిడందీ "మీవారికి పిల్లని ఎలా వూర్కో పెట్టడమో - తర్ఫీదు చెయ్యలేదూ? వారికోసారి ఇవ్వండి! కనగానే సరా - పెంచడం తెలియద్దూ?" ఆవిడ మోటుమాటలు విని శాస్త్రి మొఖం చిట్లించుకున్నాడు. అసలు-అతని మొస్తరేవిటంటే - చంటిపిల్లలు ఆడుకుం టున్నంతసేపు సరిగా ఆడడం - ఓ ఏడ్చినా-ఓ పిసరు ఉచ్చోసినాసరే-ఆమడదూరం పారిపోవడం ఆవిడా మాటలనేసరికి-శాస్త్రికి యెక్కడలేని రోషం వచ్చి- చటుక్కుని పిల్లని తీసుకున్నాడు.

(నిన్నటి సంచిక తరువాయి)

నిద్దరలోనించి ఏడుస్తూ లేచినపిల్ల - దాంతో మరింత గట్టిగా గుక్కపెట్టి ఏడవడం మొదలెట్టింది. దానిమీద-ఏదో హాస్యం మండినట్టు - ఆవిడగారు-బీచంతా మారుమోగు నట్టు-ఫక్కున నవ్వు. శాస్త్రి చీకాకు - ఇహ - ఇంతా అంతా చెప్పలేం. సరే - ఇంతలో ఆవిడ భర్తగారు కూడా వచ్చారు - వాళ్ళిద్దరూ కారుమీద వెళ్ళిపోయారు.

పిల్ల ఏడుపు మానడంలేదు. మనంకూడా బయలుదేరుదాం అని అనుకుంటుండగా సరి లేడీ అయ్యంగారు యెదురుగుండా ఆవిడ రోల్స్ రాయిస్ కారుమీద తయారు నాకు వొళ్ళు మండిపోతుంది. ఆవిడ అంత దూరంనుంచే - "ఏదీ -మీ అమ్మాయిగారూ?" అంటూ వొయ్యారంతో వచ్చింది.

సరే, నేనూ పిల్లని తీసుకుని కారులోంచి దిగి ఆవిడకీ ఎదురుగుండా వెళ్ళేను. ఆ దిగుతూండడంలో పిల్లగుడ్డ తలుపుకొక్కేనికి తగులుకొని కింద మన్నులో పడిపోయింది. దాంతో శాస్త్రి ఆ గుడ్డని తీసి కారులో విసిరేసి "మరోగుడ్డ తెచ్చుకోరూ, అంత వెధవదరిద్రమా?" అని మండిపోతూ సణిగేడు. ఇంతట్లో ఆ రంభగారు "ఏదీ - ముద్దూ?" అంటూ పిల్లని నా చేతిలోంచి తియ్యబోయేసర్కి, పిల్ల కెవ్వుమని మళ్ళీ సంగీతం మొదలెట్టింది. దాంతో శాస్త్రి ఎన్నడూలేని విసుగుతో "లేడీ అయ్యంగారూ! ఈ వేళ లేచి ఎవరిమొహం చూశామోకానీ, అన్నీ పరాభవాలే. మేం పోతాం, సెలవు" అని అంటూ నన్ను కారు దగ్గరికి బలవంతంగా ఈడ్చుకు పోయాడు...దారిలో అరగంట సేపుకూడా ఒక మాటా మంతీ లేదు సరిగదా, ఇల్లు చేరుకుని లోపల అడుగు పెట్టగానే "ఇంట్లో ఎప్పుడు చూసినా చాకలి సంసారమేగదా, పిల్ల గుడ్డలు తడపనూ, ఎండెయ్యనూ, తడపనూ, ఎండెయ్యనూ, తీరా ఎవరేనా వచ్చేసరికి కుళ్ళు గుడ్డలు తయారు! సంసారం అసహ్యం వేసిపోతూంటే..." అన్నాడు.

చమత్కారంగా సంభాషణ - రమ్యమైన రంభలూ - చంటిపిల్ల మాత్రం ఏడవకూడదు - ఎందుకూ, ఏదేనా అంటే శ్రుతిమించి రాగానపడు తుంది అని నేను మాట్లాడకుండా ఇంట్లోకి వెళ్ళిపోయాను.

42 అతడు

నిన్నరాత్రి ఎడ్వకేట్ జనరల్ బార్టను ఇంట్లో విందు; మేం ఇద్దరం వెళ్ళేం. మంచిషోగ్గా వచ్చింది శాంతం. చెప్పేదేమిటి? అందరినీ నవ్వించడమే. అందరూ శాంతంచుట్టే; ఎడ్వకేట్ జనరలు - వారి దొరసానిగారు - జడ్జీలు - వారి భార్యలు - అందరూను! నాకెంతో ఆనందం, అయితే యేం! పాపం - యీమధ్య చితికిపోవడం మూలాన్ని - శాంతం మరీ నలిగిపోయింది. కాని ఇప్పుడు మళ్ళీ - చక్రం తిరిగింది. ఈలాగే పెద్ద కేసులు - మరి రెండొస్తేనా! యేదో ఇప్పటికి బ్యాంకిలో నలభైవేల వరకూ కూడబెట్టేను కదా - ఈ దెబ్బతో - నాయనా! కేసులన్నీ వాయిదాలు పడిపోవడంచేత - వేగమే ఆటవిడుపు అయ్యింది. అనుకోకుండా సెలవుదొరికిన బడి కుర్రాడులాగా అతి ఉబలాటంతో - శాంతాన్ని కలుసుకుని సినీమాకి వెడదాం - అని వరదరాజులు కారులో బీచికి బయలు దేరేను. వెంకటస్వామినాయుడు భార్యే కాంసును - ఆవిడతో కూర్చుని - బాతాఖానీ కొదుతూంది శాంతం. ఇదివరకావిడని నేను చూడకపోయినా - ఆ తళుకు బెళుకులు - లోలక్కులూ లవ్ లక్కుల కులుకులు - దొండపండు పెదిమెలు - జేగురు గోరింట - నాకు తల నొప్పొచ్చింది. శాంతం వేసుకోవడం వేరూ - అయితే తీరు సొగసు వుండాలి. కాని ఈవిడేమిటి? ఈ బొమ్మరిల్లు మార్చేసి మాంబళంలో పెద్ద మేడ - బేబీ ఆస్టిను పారేసి చెవ్రలెటు - తీసుకోవాలి. అప్పుడు శాంతం తెలివితేటలు నల్గురికీ తెలియడం!

అబ్బ - ఈ వేళ జరిగిన పరాభవాలా - పగవాడికేనా వద్దు





డాక్టర్ వుప్పల లక్ష్మణరావు

నాయనా? సరి - ఏమైతేనేం! స్త్రీకదా? గౌరవం మర్యాదా చూపాలిగా అని చెప్పి - మాటాడేసర్కి - బాబూ! ఆవిడ - వెటకారం - మొరటుశ్లేష చెప్పలేం! నేనూ - తెలివి తక్కువగా - ఆ ధోరణిలోనే ప్రసంగం సాగించా - శాంతం చీకాకుతో చిందులు తొక్కుతూందని నాకు బోధపడిపోయింది. అయితేయేం, ప్రసంగం ఒక్కసారిగా - చివరికి - సినిమా "పుల్‌స్టాపు" అనలేంగా!

"క్లోజప్పు"లా వెళ్ళింది. అక్కడికి ఆపేశాగా. అయినా శాంతం శాంతించలే. అంత కోపం ఎందుకో? ఇంతట్లో పాపాయి బీచి ఎగిరి పోయేటట్లు ఏడుపు - నేను తియ్యారించ వలసిసోచ్చింది. నేను - నా ఆఫీసు కోర్టుదుస్తులు - వొళ్ళో పిల్ల - తెలిసిన వాళ్ళందరూ అప్పుడే కనిపించాలీ? నాకు అతి తలవంపులైపోయింది. ఇహ రేపు ప్రొద్దున్న బారు రూములోనూ, క్లబ్బులో - రంగనాథం సీతారాం దేవనేశం "శాస్త్రిది కింద చెయ్యేను రోయ్!" అనీ - "ఆడమలయాళంలో మంగళ సూత్రం కడితే ఇదిగో!" అనీ - ఈలా తట్టాబాజా వెటకారం, వెక్కిరింతలూ సరా - గోరుచుట్టుమీద రోకటి పోటులా, ఆ వేళకే లేడీ అయ్యంగారు అప్పుడే తటస్థపడాలీ! - నా ఖర్మం కాలితే! ఎప్పుడేనా పాత స్నేహితుల్ని పిల్చి, కాస్త మజా చేసుకుందాం అని అనుకునే సర్కి, ఆవేళే తయారు ఇంటికి గాంధీ దాసు లందరూ. ఇహ వాళ్ళ గుసగుసలు, వాళ్ళ ధర్మ పన్నాలున్నూ, నాకు పరాయిస్త్రీలతో మాట్లా డటం అంటేనే మొహమాటం. ఖర్మం చాలక మాట్లాడేనా - ఏదో అపభ్రంశం రావడం - శృతిమించిన రాగం-సరాగం - శాంతారగం వున్నూ.

సాయంకాలం అలాగే అయింది. నేనేదో గొప్పగా- గోటుగా - పాపాయినీ, శాంతాన్నీ నా స్వంతం-నాఆస్తీ అని నల్గురికీ తెలియాలని తంటాలు పడుతూంటే-ఆ లేడీ అయ్యంగారికి పాపాయిని చూపించ బోయే, ఆ పిల్లక్రింద గుడ్డలు బురదలో కింద పడిపోవాలీ! సరీ, నా ఆల్పాకా కోటుమీదరే పాపాయి పాడుచేయడం. దీంతోపాటు శాంతం కట్టుకున్న చీరె యేతాతలనాటిదో, అలుగ్గుడ్డలా వెలిసి పోయింది. ఇదంతా జరగడం బీచిమీద వల్లకాటిలో రామ నాథయ్యరులా నేను ఆమధ్యని. షికారు కొచ్చే పెద్దమనుష్యులూ, జడ్జీలు, వకీళ్ళు, బారిష్టర్లు అందరూ అప్పుడే తటస్థపడాలీ? పీక పోయి నట్టయింది. ఓమూల లేడీ అయ్యంగారి నవ్వులూ, లీలావతమ్మగారి కేరింతలూ-ఛీ!

ఇంటికెళ్ళాక "పాపాయికి గుడ్డముక్కలు లేవా? నీకు గుడ్డ ముక్కలు లేవా? రోజంత సేపూ మరో పనిపాటూ లేదుకదా! వీధిలో కొచ్చినప్పుడేనా నీకోసం కాకపోతే నా మర్యాదకోసం - సరిగ్గా అలంకరించుకోవద్దూ! ఆ పిల్లనా? చందనబొమ్మల్లే గుడ్డా గుడుసూలేదాయే? ఇంత ఏబ్రాసితనమా?" అని కోపంకొంతా కక్కేశా.నేను ఉగ్ర నరసింహమూర్తినైతే, ఆవిడ ఏం తక్కువా? సాక్షాత్తూ కాళికా అమ్మవారే! శాంతం, అందికదా: "ఛీ, మరి నే నాలేడీ అయ్యంగారి మరి మాట్లాడలేక, కారేసుకుని మౌంటురోడ్డు వెళ్ళి కన్నిమారాలో భోంచేసి, అడయార్‌లో భరతనాట్యం చూసుకొని, తెల్లవారుజాం నాలుగింటికి ఇంటి కొచ్చి, వసారాలో మడతమంచం వేసుకుని పడుకున్నా. శాంతా నికి కూడా నిద్రపట్టివుంటుంది. అయినా నేలేకపోతే, నా కోసం మేలుకొని వుండొద్దూ? మొండిపట్టు. నేనూ మేడమీదికి వెళ్ళలే!

పొద్దున్న కాఫీ దగ్గర సాయంత్రం సందర్భమే - మాట్లాళ్ళే - అసలు ఒకరినొకరు పలకరించుకోలే.

43 ఆమె

తేనాంపేట బంగళాకి బస మార్చాం. పెద్ద బంగళా. వరండాలు, తోట. మోటారు షెడ్లూ, నౌకర్లకి ఇళ్ళు - పాపం! శాస్త్రికి ఇప్పుడు మనిస్థిమితముగా ఉంటుంది. ఈ చిక్కులు వీడిపోయి మనుష్యుల్లో పడ్డాం అని అతనికి ఎంతేనా ఆనందంగా వుంటుంది!

అయితే నాకు ఆనందంగా వుందా? ఏమిటో - ఇదో పెద్ద మహా లోకంలా వుంది. ఈ యింట్లో వొక్కర్తిని యెలా వుండడం? ఇరుగులేదు. పొరుగులేదు. ఎంత సేపూ తాయారు తోనూ, తోటమాలితోనూ, పుస్తకాలతోనూ, పత్రికలతోనూ - ఎలా కాలం వెళ్ళబుచ్చడం? మరి నెలరోజుల్లో పాపాయికి రెండో యేడు వస్తుంది! ఇక నా అవసరంకూడా వుండదు దానికి!

రాయపురంలో ఇళ్ళే బాగున్నాయేమో అనిపిస్తుంది. ఇంటిమీద ఇల్లనీ, బొమ్మరిళ్ళని, వాళ్ళింట్లో మాటలు వీళ్ళింట్లోకి వినిపిస్తాయనీ, ఉమ్మడి కొళాయనీ - ఇన్నీ అనుకునేదాన్ని. ఇప్పుడు పొరుగు సాయానికేనా - సానుభూతికేనా - చదు వొచ్చినా - రాకపోయినా అమ్మలక్కలందరూ కలిసికట్టుగా వుండేవారు. చదువుకొన్నదాన్ననీ, బారిష్టరు గారి భార్యననీ ఎంతో గౌరవించేవారు. ఇక్కడ ఈ బంగ్లాలో నడి సముద్రంలో తెప్పలాగున్నాను...ఇళ్ళు మారడం అంటే కొందరికి అతి సరదా. సినీమాకు నాటకానికి వెళ్ళడం అంటే ఎంత సరదానో అంత. ఆ సామాను ప్యాకు. చెయ్యడం. ఆ రభస. కూలివాళ్ళమీద అధికారం. నౌకర్లని తిట్లు - ఈ హంగామా అంతా మళ్ళా కొత్త యింట్లోను. అది యేమి హాయి ఆనందమోకాని, నాకు తలనొప్పి. పాము పొరవిడిచినట్టు అస్తమానం మనం ఇళ్ళు మార్చుకోగలమా? ఇళ్ళుకూడా మనలో ఒక భాగం అయి పోవడవే? లేకపోతే - నేనే ముసలిదాన్ని అయిపోతున్నానా? మార్పు అంటేనే వస్తే దాని అంతరార్థం ఏమిటి? బుర్ర బెరడు గట్టిందనేగా?

- ఇంకా వుంది.

భారతీయ భాషల్లో ఆధునిక సాహిత్యం









తమిళ సాహిత్యం

- ఆధునిక యుగంలో మిగతా భాషలవలెనే తమిళభాషపై కూడా ఇస్లాం, క్రైస్తవ మతాల ప్రభావం బాగా పడింది.
- ముస్లిం తమిళ కవుల్లో (1605-1703) నాటి ఉమరుప్పులవర్ మహమ్మద్ మొదటివాడు. ఆయన 'శిరప్పురాణం' అనే కావ్యాన్ని రాశాడు. ఇది మహమ్మద్ ప్రవక్త జీవిత చిత్రణ.
- ఇస్లాం మతానికే సంబంధించి వెలువడిన మరో కావ్యం "ముహైదీన్ పురాణం" 1845లో మొహమద్ ఇబ్రహీం రాశారు.
- **కాన్‌స్టాంజియో బెస్చి (1680-1747) :** 'వీరామమునివర్' అనే కలం పేరుతో జీసస్ జీవితంపై 'తెంబవాణి' అనే కావ్యాన్ని రాశారు.
- **సుబ్రహ్మణ్య భారతి (1882-1921) :** ఆధునిక తమిళ సాహితీవేత్తలలో సుబ్రహ్మణ్యభారతి కడు ప్రసిద్ధులు. సమకాలీన సమాజ పరిణామాలపై ఆయన రచించిన సాహిత్యం, దేశభక్తిపూరిత గేయాలు ఎంతో ఆదరణకు నోచుకున్నాయి. 'పాంచాలి శపథం' అన్న ఆయన కావ్యం బాగా ప్రసిద్ధి చెందింది. 'కలిప్పట్టు', కన్నప్పట్టు, కుయిల్‌ప్పట్టు' అనే గ్రంథం కూడా బహుళ ప్రచారం పొందిన ఆయన గ్రంథాల్లో ఒకటి.

హిందీ సాహిత్యం

1. హిందీ సాహిత్యంలో ఆధునిక కాలం 19వ శతాబ్ది మధ్యకాలం నుండి ప్రారంభమైంది. అంతవరకు రాజ్యమేలుతుండిన వ్రజభాష స్థానే 'ఖరీబోలి' వచనం చోటుచేసుకోవడం చాలా ముఖ్యమైన పరిణామం. ఈ ఆధునిక కాలాన్ని నాలుగు భాగాలుగా విభజించారు. అవి :

1. భారతేందు యుగం - పునరుజ్జీవనోద్యమం (1868-1893),
2. ద్వివేది యుగం (1893-1918),
3. ఛాయావాద యుగం (1918-1937),
4. సమకాలీన యుగం (1937 నుంచి).


- **భారతేందు హరిశ్చంద్ర (1849-1882) :** హిందీ సాహిత్యానికి నవీన పోకడలు కల్పించినది ఈయనే. అందుకే ఈయనను నవీన హిందీ సాహిత్య పితగా అభివర్ణిస్తారు.
- **మహావీర్ ప్రసాద్ ద్వివేది (1868-1938) :** అధునాతన హిందీ సాహిత్యంలో వచనానికి ఇంపైన రూపు తీసుకువచ్చిందీయనే. అందుకే వీరిని ఆధునిక వచన హిందీ నిర్మాతగా చెబుతారు. ఈ కాలంలో సామాజిక, రాజకీయ, ఆర్థికపరమైన సమస్యలను పద్యరూపంలో సమాజానికి తెలియజెప్పడం జరిగింది.
- **ఛాయావాద్ యుగ్ :** ద్వివేది యుగం తరువాత హిందీ సాహిత్యంల ఛాయావాదం పేరుతో కొత్త తరహా కాల్పనిక కావ్యాలు పుట్టుకొచ్చాయి. ఈ కొత్త తరహా సాహిత్యవాదం ప్రాచీన రూపవాదం పైన, మధ్యయుగం సందేశాత్మక వాదంపైన ధ్వజమెత్తింది. తమది సౌందర్య ప్రధాన, భావాత్మక పరిణామంగా ఛాయావాదం పేర్కొంది.
- **మఖన్‌లాల్ చతుర్వేది (1989-1968) :** బాలకృష్ణ శర్మ - 'నవీన్' (1897-1959), సియారాంశరణ్ గుప్తా (1895-) జయశంకర్ ప్రసాద్, సూర్యకాంత్ త్రిపాఠీ - 'నిరాలా (1897-1963), సుమిత్రానందన్ పంత్ (1900×1997), మహాదేవి వర్మ (1907-), సుభద్రా కుమారి చౌహాన్ (1904-1948) మొదలైనవరు ప్రఖ్యాత ఛాయావాద కవులు.
- హిమకిరీతిని, హిమ తరంగిణి అనే ప్రఖ్యాత కావ్యాలు మరెన్నో రచనలు మఖన్‌లాల్ చతుర్వేది కలం నుంచి వెలువడ్డాయి.
- పల్లవ, గుంజన, యుగవాణి, గ్రామ్య, స్వర్ణకిరణ, శిల్పి, లోకాయతన వంటి ప్రసిద్ధ రచనలు సుమిత్రానందన్ పంత్ కలం నుంచి వెలువడ్డాయి.
- వీరుకాక ఛాయావాద కాలంలో మరికొందరు కూడా సమాజంపై తమ రచనలతో ప్రభావం చూపారు.
- **జై శంకర్ ప్రసదాన్ :** కామయాని, ఝర్నా, అంశూ జౌర్ లహర్.
- **మహాదేవి వర్మ :** రశ్మి (1932), నీరజ (1934), సంధ్యాగీత (1936), యమ (1940), దీపశిఖ (1942).
- **సుభద్రా కుమారి చౌహాన్ :** ఝాన్సీకి రాణి, ముకుల్ (1931), ఉన్మాదిని రచనలు కూడా సమాజాన్ని ఎంతో ప్రభావితం చేశాయి.
- **ప్రగతివాదం :** ఛాయావాద భావాల ప్రభావం తగ్గిపోతున్న దశల హిందీ పద్యసాహిత్యం ఎన్నో కొత్త పుంతలు తొక్కింది. ఈ దశలో 'ప్రగతివాదం' అనే పేరుతో కొత్త ఒరవడి ప్రారంభమైంది. బాలకృష్ణ శర్మ- నవీన్ (1897-1960), భగవతీ చరణ్ వర్మ (1903), రామ్‌ధారీ సింగ్ దినకర్ (1908), రామేశ్వర్ శుక్లా 'అంకాలా' (1915), నరేంద్రశర్మ (1907) వంటివారి రచనలు ఈ ప్రగతివాదానికి బహుళ ప్రచారాన్ని తెచ్చాయి.
- **హరివంశ్‌రాయ్ బచ్చన్ (1907) :** మధుశాల (1935), మధుబాల (1936), మధుకలశ్ (1938) పేర్లతో హరివంశ్‌రాయ్ వెలువరించిన సంకలనాలు, గ్రంథాలు హిందీ పద్యకవితా లోకాన్ని ఎంతగానో సుసంపన్నం చేశాయి. ఛాయావాదుల కాల్పనిక సాహిత్యానికి, ప్రగతివాదుల భావోద్రేకానికి అతీతంగా సాగుతుంది హరివంశ్‌రాయ్ రచనా వ్యాసంగం. ఈయన తరహా కవిత్వానికి 'హృదయవాదం'గా ముద్రపడింది కూడా.
- **ప్రయోగవాద్ :** ఆ తరువాత ప్రయోగవాదం మొదలైంది. ఆ తరువాతి కాలంలో ఇదే 'నయీ కవితా' ప్రక్రియగా వినుతికెక్కింది. నవ్య ఆలోచన పంథాతో, మేథా సంపత్తితో ఈ వాదం సరికొత్త ప్రక్రియను హిందీ సాహిత్యంలో ఆవిష్కరించింది. ఈ 'నయీ కవితా' రూపాన్ని ముందుకు తీసుకువచ్చిన ప్రముఖుల్లో ఎస్. హెచ్.వాత్సాయన్ 'అజ్ఞేయ' (1911), శివమంగళ్‌సింగ్ 'సుమన్' (1916), గిరిజాకుమార్ మాథుర్ (1917), గజానన్ మాధవ్ ముక్తిబోధ్ (1918- 1964), ధరమ్‌వీర్ భారతి (1926), నిర్మల్‌వర్మ తదితరులు ఉన్నారు. ఇలా హిందీ సాహిత్య ప్రక్రియ వెయ్యి సంవత్సరాల వయసు సంతరించుకుంది.
- **హిందీ వచనం :** హిందీ వచన కాలాన్ని కూడా మూడు దశలుగా విభజించారు.

మొదటి దశ (1868-1918),
పరిణతి దశ (1918-1937),
ఆధునిక దశ (1938 నుంచి) గా పరిగణిస్తున్నారు.

- భారతేందు, ద్వివేది కాలాల నాటి సాహితీ వచన రూపం మొదటి దశగా వర్గీకరించారు. ఈ కాలాలనాటి రచయితలే నాటకం, కథానిక, వ్యాసం, సాహితి విమర్శ మొదలైన సాహితీ రూపాలను ఆవిష్కరించారు. భారతేందు హరిశ్చంద్ర, బాలకృష్ణ భట్, రాధాకృష్ణదాస్ వంటివారు ఆనాటి మేటి రచయితలు.
- రెండవదశ నాటి రచయితల్లో జయశంకర్ ప్రసాద్ (ఛాయ, అకాశ్‌దీప్), రామ్‌కృష్ణదాస, మహాదేవివర్మలు ప్రముఖులు. ప్రఖ్యాత కాల్పనిక రచయిత ప్రేమ్ చంద్ (1880-1936) ఈ కాలంనాటివాడే. ప్రేమ్‌చంద్ అసలుపేరు ధనపతి రాయ్. సేవాసదన, ప్రేమశ్రమ, నిర్మల, కాయకల్ప, రంగభూమి, ఘబన్, గోదాన్ వంటి ఆయన ప్రఖ్యాత రచనలు సమాజంపై ఎంతో ప్రభావాన్ని చూపాయి. ప్రేమ్‌చంద్ 'గోదాన్'ను ప్రధాన భారతీయ భాషల్లోకి అనువదించారు.
- **సమకాలీన దశ :** జైనేంద్రకుమార్ (సునీత, త్యాగపత్ర, సుఖద, వైవర్త); ఫణీశ్వర్‌నాథ్ రేణు (మైలా అంచల్) ; సచ్చిదానంద వాత్సాయన్ (శేఖర్ ఏక్ జీవని); ధర్మవీర్ భారతి (సూరజ్ కా సాత్వా ఘోడా); యశ్‌పాల్ (దాదా-కామ్రేడ్, దేశ్‌ద్రోహి, దివ్య, మనుష్య కె రూపె) ; జగదంబా ప్రసాద్ దీక్షిత్ (ముర్దాఘర్), రహీ మసూమ్ రజా (అధాగం) వంటివారు తమ కాల్పనిక రచనలతో ఆధునిక పాఠకుల్లో ఉత్కంఠ రేకెత్తించారు.
- నవయుగ హిందీ సాహిత్యంలో పూర్తిగా హిందీ భాషదే అయిన తొలి నాటకం 'నహుష్ నాటక' (1857లో) వెలువడింది. దీనిని భారతేందు తండ్రి గోపాలచంద్ర రచించారు.

బెంగాలీ సాహిత్యం

- ఆధునిక బెంగాలీ సాహిత్యానికి సీరాంపూర్ క్రైస్తవ మిషనరీలు, పోర్టు విలియం కాలేజీ బీజం వేసి అభివృద్ధిపరిచాయి.
- మొట్టమొదటి బెంగాలీ వ్యాకరణాన్ని 1778లోనే నథానియల్ బి.హాల్‌హెడ్ ప్రచురించారు.
- తరువాత 1801లో బెంగాలీ భాషలోకి బైబిల్ అనువాదమై, ప్రచురితమైంది.
- ఆ రకంగా 19వ శతాబ్ది ప్రారంభాన రూపుదిద్దుకున్న బెంగాలీ వచనం పూర్తిగా సంస్కృత, అరబిక్, పర్షియా పదాల సంక్లిష్ట భూయిష్టమైనదిగానే చెప్పుకోవాలి.
- ఆధునిక బెంగాలీ సాహిత్యంలో అసలైన వచనాల కావ్యం రామ్‌రామ్ బసు రాసిన 'రాజా ప్రతాపాదిద్య చరిత్ర' కూడా 1801లోనే ప్రచురితమైంది. ఈయనే 'లిపిమాల' అనే పుస్తకాన్ని ప్రచురించారు.
- **మృత్యుంజయ విద్యాలంకార్ :** 1802లో 'బత్రిస సింహాసన' అనే కావ్యాన్ని వీరు రచించారు. హితోపదేశ్, రజబలి (వేదాంత చంద్రిక), ప్రబోధ్ చంద్రిక అనే మరో మూడు ప్రఖ్యాత గ్రంథాలను కూడా వీరు రచించారు.
- **రాజా రామ్మోహన్ రాయ్ :** ప్రముఖ సంఘ సంస్కర్త అయిన రాజా రామ్మోహన్‌రాయ్ 1815లో వేదాంత గ్రంథ అనే వచన వేదాంత కావ్యాన్ని ప్రచురించారు. 1815-1830 మధ్యకాలంలో ఆయన ఏకంగా బెంగాలీల 30 రచనలు చేశారు. ఆయన కొన్ని ఉపనిషత్తులను కూడా బెంగాలీ భాషలోకి అనువదించారు. అంతేకాక బెంగాలీ పద్యంలో భగవద్గీతను కూడా అనువదించారు.
- ఆ తరువాత బంకిం బాబుగా ప్రసిద్ధిగాంచిన బంకించంద్ర ఛటర్జీ, శరత్ బాబుగా ప్రసిద్ధులైన శరత్‌చంద్ర ఛటర్జీ, శాంతినికేతన్ రూపశిల్పి రవీంద్రనాథ్ ఠాగూర్, ప్రముఖ విద్యారంగ సంస్కర్త ఈశ్వరచంద్ర విద్యాసాగర్, ప్యారీచంద్ మిత్రా, టేక్‌చంద్ ఠాకూర్ వంటి మహామహులు తమ కావ్యాలతో బెంగాలీ వచన సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు.



- రవీంద్రనాథ్ ఠాగూర్ గీతాంజలి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన విషయం తెలిసిందే. అప్పటినుంచి బెంగాలీ వచన సాహిత్యం క్రమ పరిణామానికి లోనవుతూ వచ్చింది.
- ఆధునిక బెంగాలీ వచన సాహిత్యపితగా వినుతికెక్కిన ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ (1820-91) శకుంతల (1854), సీతా వనవాస (1860), భ్రాంతి-విలాస (1869) అనే గ్రంథాలను ప్రచురించారు.
- **ప్రఖ్యాతి చెందిన ప్రముఖ బెంగాలీ రచయితలు :** చారుచంద్ర బెనర్జీ (1876-1938), ఇందిరాదేవి (1880-1922), అనురూపాదేవి (1882-1958), నిరుపమాదేవి (1883-1951), శౌరీంద్రమోహన్ ముఖర్జీ (1884-1966), రఖల్‌దాస్ బెనర్జీ (1885-1930), గోకుల్ చంద్రనాగ్ (1895-1925), శైలజానంద ముఖర్జీ (1900-1976), బిభూతి భూషణ్ బెనర్జీ (1899-1950), రబీంద్రనాథ్ మైత్ర (1896-1933), రాజశేఖర్ బసు (1880-1960), ప్రబోధ్‌కుమార్ సన్యాల్ (1907), సీతాదేవి (1896-1974), శాంతాదేవి (1894).
- బంకింబాబు (1838-1894) రాసిన దేవీ చౌధరాణి, కమలాకంతర్ దఫ్తర్, ఆనంద్‌మఠ్ (1882), సితారం రచనలు ప్రఖ్యాతిగాంచాయి.
- **రవీంద్రనాథ్ ఠాగూర్ ఇతర రచనలు :** సంధ్యా సంగీత్ (1881), పదావళి, సోనార్ తరి (1894), నైవేద్య (ఇది పద్య సంకలనం)
- **ప్యారీచంద్ :** మొట్టమొదటి బెంగాలీ పూర్తి నవలగా వీరు రాసిన 'అలాలెర్ ఘరేర్ దులాల్' ప్రసిద్ధికెక్కింది.
- **దీనబంధుమిత్ర :** వీరు రాసిన నీల్ దర్పణ్ చాలా ప్రభావితం కలిగించింది. తేయాకు తోటల యజమానులు రైతులను ఏ రకంగా దోపిడీ చేస్తున్నారో ఈ నాటకం కళ్లకు కట్టినట్లు చూపెడుతుంది. కమలే కామిని అన్న నవల కూడా వీరు రాశారు.
- ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ (1947లో) బేతాళ్ పంచవింశతి అనే నవలను రాశారు.
- బిబూతి భూషణ్ ప్రఖ్యాత పథేర్ పాంచాలి నవల రాశారు. అరణ్యక్ అనే మరో నవలను కూడా రాశారు.
- **మైకేల్ మధుసూదన్ దత్ :** సంప్రదాయ శృంఖలాలను తెంచి సాహిత్యంలో కొత్త ఊహలు చొప్పించినవాడిగా దత్ నిలిచిపోయారు. ఆయన బరోపా సాహితీ ప్రక్రియలను, బెంగాలీ సాహిత్యానికి అనుగుణంగా మలచడంలో కృతకృత్యులయ్యారు. మేఘనాబంధ్ పేరుతో రామాయణంలోని ఒక ఘట్టానికి ఆయన ఇచ్చిన ఆధునిక భాష్యం ఎంతో అలజడి సృష్టించింది.

ఉర్దూ సాహిత్యం

- ఆధునిక ఉర్దూ సాహితీ కాలం 19వ శతాబ్ది చివరి భాగం నుండి ప్రారంభమైంది. దీనిని రెండు కాలాలుగా విభజించవచ్చు. ఒకటి అలీగఢ్ సంప్రదాయం కింద, తదుపరి కాలం ఇక్బాల్ కాలంగానూ విభజించవలసి వస్తుంది.
- సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్ అలీగఢ్ సంప్రదాయాన్ని ప్రారంభించగా, తరువాతి కాలం సర్ మొహమ్మద్ ఇక్బాల్ వల్ల ప్రభావితమైంది.
- అయితే ఉర్దూ పద్య కవిత్వంలో ఆధునిక భావాలను నెలకొల్పినది మాత్రం అల్తాఫ్ హుస్సెయిన్ హాలి (1837-1914) గా చెప్పుకోవచ్చు.
- జీవితకథల చిత్రీకరణలో ఒక కొత్త తరహా విమర్శనాత్మక శైలిని హాలి ప్రవేశ పెట్టారు. ఆయన రాసిన హయత్-ఎ-సదీ, హయత్-ఎ-జావీద్ అనే జీవిత చరిత్రలను గమనిస్తే ఇది అర్థమవుతుంది.
- **షిబ్లి నొమానీ (1857) :** అలాగే ఆధునిక ఉర్దూ చరిత్ర రంగానికి నోమానీని పితగా పేర్కొంటారు. ఆయన ఎంతో శ్రమించి చారిత్రక పరిశోధనను జరిపి, ముఖ్యంగా ఇస్లామిక్ చరిత్రను పరిశోధించి దాని ఆధారంగా ఎన్నో గ్రంథాలు వెలువరించారు.
- సీరత్-ఉన్- నోమన్ (1892), అల్ ఫరూఖ్ (1899) వాటిలో ముఖ్యమైనవి.

- సయ్యద్ అక్బర్ హుసేన్ అక్బర్ అల్లాహాబాదీ (1846-1921) : ఈయర ధార అమోఘం. తల ఎత్తకుండా, ఊపిరి తీసుకోకుండా పాఠకుడిని ఈయన రచనలు చదివిస్తాయి. వ్యంగ్య చిత్రణ, హాస్యరస పోషణ ఈయన ప్రత్యేకతలు.

- **ఖుషి మొహమ్మద్ నజీర్ (1872-1944) :** మొహమ్మద్ ఇక్బాల్ (1873-1938), దుర్గా సహాయ్ సరూర్ (-1910), మొహమూద్ అలీ జీహార్ - (1931), హజ్రత్ మొహానీ (-1951) లు తమతమ సాహితీ ప్రక్రియలతో జనావళిని ఆహ్లాదపరిచారు.
- ఘనకీర్తి గడించిన ఇక్బాల్ సాహితీ ప్రక్రియ ఎన్నో రూపాంతరాలు చెందింది.

ఉర్దూ కథానిక

- మున్షీ ప్రేమ్‌చంద్ రాసిన సోజ్-ఎ-వతన్ (1908) తో ఉర్దూ కథానిక రూపుదిద్దుకుంది. ప్రేమ్‌చంద్ రాసిన కథానికలే ఏకంగా 12 సంపుటాలుగా ఉన్నాయి. వీరి తరువాత మొహమ్మద్ హుస్సేన్ ఆస్కర్, ఖ్వాజా అహ్మద్ అబ్బాస్ వంటి ప్రముఖులు కథానికను సుసంపన్నం చేశారు.

ఉర్దూ నవల

- ఉర్దూ నవలకు నజీర్ అహ్మద్ (1836-1912) ఆద్యుడు. ఆయన మీరట్-ఉల్-ఉరుస్ (1869), తౌబత్-ఉన్-నాసుహ్ (1877), ఫసానా-ఎ-ముబ్తాలా (1885), అయమ (1891) వంటి నవలలను రచించారు.
- పండిత్ రతన్‌నాథ్ సర్షాల్ (1845-1903) రచన ఫసానా-ఎ-ఆజాద్; అబ్దుల్ హలీమ్ షరార్ (1860-1920) రచనలు బదర్-ఉస్-నిసాకీ బుసీబత్, ఆఘాసాదిక్ కీ శాదీ; మీర్జా మొహమ్మద్ హదీ రుస్వా రాసిన ఉమ్రావో జాన్ అదా (1899) చాలా పేరు ప్రఖ్యాతులు గడించి తెచ్చాయి.
- నియాజ్ ఫతేపురి (1887-1966), కాజీ అబ్దుల్ గఫార్ (1862-1956) వంటి రచయితలు తమ కాల్పనిక రచనా ప్రక్రియలతో సమాజాన్ని ఆకట్టుకున్నారు.

ప్రేమ్‌చంద్ (1880-1936)

- ఉర్దూ సాహిత్యంలో వాస్తవికతను ప్రవేశపెట్టిన ఘనత ప్రేమ్‌చంద్‌కు దక్కుతుంది.
- ఆయన ప్రఖ్యాత నవలలో భాగమైన బజారు-ఎ-హుస్న్ (1917), గోషా-ఎ-అఫీయత్, చౌగన్-ఎ-హస్తీ, మైదాన్-ఎ-అమత్, గోదాన్ వాస్తవికతను ప్రతిబింబిస్తాయి.
- వీరి వాస్తవ దృక్పథాన్ని భారత అభ్యుదయ రచయితల సంఘ సభ్యులైన సజ్జద్ జహీర్, కృష్ణ చందర్, ఇస్మత్ చుగ్‌టాయ్ వంటి ప్రఖ్యాత రచయితలు తమ రచనల ద్వారా మరింత ముందుకు తీసుకుపోయారు.

మరాఠీ సాహిత్యం

- 1829లో మొట్టమొదటి మరాఠీ పదకోశం, మరాఠీ వ్యాకరణంపై వ్యాఖ్యానం వెలువడ్డాయి.
- బాలగంగాధర్ శాస్త్రి జంభేకార్ నేతృత్వంలో మొట్టమొదటి దిన వార్తపత్రిక 'దర్పణ' 1831లో ప్రారంభమైంది.
- 1880-81లలో ప్రారంభమైన కేసరి దినపత్రిక ఆధునిక మరాఠీ సాహిత్యాన్ని సుసంపన్నం చేసింది.

మిగతా రేపటి సంచికలో

విశాలాంధ్ర బిజినెస్

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం (విజయవాడ)	వెండి	డాలరు Vs రూపాయి	ముడి చమురు
-18.88	1.00		300		
33,793.38	10,443.20	28,250 (22 క్యారెట్లు, 10 గ్రాములు)	39,900 (కిలో (రూపాయల్లో))	63.52	66.57 (బ్రెంట్ ధర (డాలర్లలో..))

టాప్ గెయినర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	మార్పు (శాతాల్లో)
అదానీ పోర్ట్స్	410.85	2.82
లారెన్స్	1,284.00	2.71
ఐసీఐసీఐ బ్యాంక్	316.50	2.34
యెస్ బ్యాంక్	316.35	1.40
టాటా మోటార్స్	257.45	1,03

టాప్ లూజర్స్ (సెన్సెక్స్)

కంపెనీ	ప్రస్తుత ధర	లాస్ (శాతాల్లో)
డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్	2,415.00	-2.97
విప్రో	320.00	-2.59
ఓఎన్‌జీసీ	197.50	-1.65
బజాజ్ ఆటో	3,306.40	-1.61
మారుతి సుజుకీ	9,635.15	-1.35

విదేశీమారకం విలువ (ఫారెక్స్)

కరెన్సీ	రూ.విలువ (క్రి.ముగింపు)	రూ.విలువ (ప్ర.ముగింపు)
డాలర్	63.56	63.52
యూరో	76.63	76.44
పౌండ్	86.20	86.26
ఆస్ట్రేలియా డాలర్	49.84	49.76
సింగపూర్ డాలర్	47.85	47.79

బులియన్

బంగారం (10 గ్రాములు)	22 క్యారెట్లు రూ.	24 క్యారెట్లు రూ.
హైదరాబాద్	28,190	30,150
చెన్నై	28,190	30,150
బెంగళూరు	27,500	29,412
ముంబై	28,960	30,973
విజయవాడ	28,250	30,500



వరుసగా మూడోరోజూ

నష్టాల్లో ముగిసిన మార్కెట్లు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు తీవ్ర ఒత్తిడులకులోనై వరుసగా మూడవరోజు ఫ్లాట్‌గా ముగిశాయి. ఫెడరల్ రిజర్వు వడ్డీ రేట్లను పెంచనున్న సంకేతాలు సన్నగిల్లడంతో డాలర్ సూచీలు మూడు నెలల కనిష్టానికి దిగజారాయి. ఆసియా మార్కెట్లు పటిష్టంగా ఉండటంతో దీని ప్రభావం మార్కెట్ ప్రారంభంలో దేశీయ మార్కెట్లపై ప్రభావం చూపింది. మధ్యాహ్న సమయానికి అంతర్జాతీయ ముడిచమురు ధరలు పెరగడం, యూరోపియన్ మార్కెట్లు బలహీనంగా ఉండటంతో కార్పొరేట్ ఫలితాలు పెరగడంతో బిఎస్ఇ సెన్సెక్స్ ఫ్లాట్‌గా ముగిసింది. 30షేర్ల సెన్సెక్స్25.3 పాయింట్లు నష్టపోగా 0.07 శాతంతో 33,786.96 పాయింట్ల వద్ద ముగిసింది. గేజ్ 2018లో 244.98 పాయింట్లు నష్టపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 3.55 పాయింట్లతో 0.03 శాతంతో 10,438.65 వద్ద ముగిసింది. బిఎస్ఇ సెక్టరల్ సూచీల్లో, ఆటో ఇండెక్స్ 0.56శాతం, ఆయిల్ అండ్ గ్యాస్ 0.3శాతం, ఐటి 0.3శాతం,హెల్త్‌కేర్ 0.24శాతం నష్టపోయాయి. క్యాపిటల్ గూడ్స్ సూచీలు 1.43శాతం, మెటల్ 1.32శాతం, కన్సూమర్ డ్యూరబుల్స్ 0.83శాతం రియాల్టీ 0.54శాతం నష్టపోయాయి. విదేశీ మదుపరులు సుమారు రూ.522.74 కోట్లు షేర్లను అమ్మినట్లు తెలుస్తోంది. మెటల్‌స్టాక్స్ 1.8శాతం పెరిగి రికార్డుసృష్టించాయి. హిందాల్కో ఇండస్ట్రీస్, వేదాంత లిమిటెడ్ నిఫ్టీ టాప్ గెయినర్స్‌గా నమోదయ్యాయి. జపాన్ వెలుపల ఆసియా పసిఫిక్ షేర్లు 0.4శాతం లాభాన్ని నమోదు చేశాయి. వాల్‌స్ట్రీట్ నూతన సంవత్సరంలో రికార్డులు నెలకొల్పింది. డౌ జోన్స్ 0.42శాతం, ఎస్ అండ్ పి 500 0.83 శాతం, నాస్డాక్ 1.5శాతం లాభాన్ని నమోదుచేసింది.



తగ్గిన రూపాయి విలువ

ముంబై: డాలర్‌తో రూపాయి మారకపు విలువ బుధవారం 63.53 వద్ద నమోదైంది. మంగళవారం 63.48 వద్ద నమోదైన రూపాయి 0.07 శాతం తగ్గింది. బ్లూమ్‌బర్గ్ నివేదిక ఆధారంగా అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ ఇండెక్స్ బాస్కెట్‌లోని ఇతర దేశాల కరెన్సీలతో చూసుకుంటే నిలకడగానే నమోదైంది. అమెరికా ఫెడరల్ రిజర్వు సమావేశం జరగనున్న నేపథ్యంలో కీలక వడ్డీరేట్లు పెంచనున్నట్లు అంచనా. దీనితో 2017లో వడ్డీరేట్లను మూడుసార్లు పెంచినట్లయింది. 2017లో రూపాయి 6.35శాతం లాభపడింది. సెన్సెక్స్ 28శాతం పెరిగింది. కాగా విదేశీ మదుపరులు సుమారు 7.73 బిలియన్ డాలర్ల షేర్లను అమ్మినట్లు నమోదైంది.

విదేశీ విద్యపైనే మోజు..!

- మనవాళ్ల ఏటా ఖర్చు రూ. 42వేల కోట్లు
- విదేశాల్లోని మన విద్యార్థులు 5.53 లక్షల మంది
- స్థిరపడేందుకే వలసలు అంటున్న విద్యావేత్తలు
- ఉన్నతవిద్యపై కేంద్ర విద్యాశాఖ ఖర్చు రూ.30వేల కోట్లు



న్యూఢిల్లీ: భారతీయ యువతకు అమెరికా, కెనడా, జర్మనీ, చైనా తదితర దేశాల్లో చదువంటే ఎంతో ఆసక్తి.. నాణ్యమైన విద్య.. మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయనేది వారి ఆశ. కొందరైతే ఇందుకోసం ఎంత ఖర్చుకైనా సిద్ధపడుతున్నారు. ఒక్క అమెరికాలోనే విద్య కోసం మన విద్యార్థులు పెడుతున్న ఖర్చు కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యపై వెచ్చిస్తున్న బడ్జెట్‌ను మించిపోతోందని ఇటీవల విడుదలైన నివేదిక ఒకటి స్పష్టం చేసింది. అమెరికా విద్యాశాఖతో కలిసి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సంస్థ సర్వేచేసి ఈ నివేదికను రూపొందించింది. ఈలెక్కన ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో మన విద్యార్థులు చదువు కోసం పెడుతున్న ఖర్చు మొత్తం లెక్కిస్తే ఎన్నో రెట్లు ఉంటుందనేది నిపుణుల అంచనా.

అమెరికాలోనే 2 లక్షల మంది

మొత్తం 86 దేశాల్లో 5,53,440 మంది భారతీయ విద్యా ర్థులు చదువుకుంటున్నారు. వారిలో అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా దేశాల్లోని వారే దాదాపు 3.70 లక్షలమంది ఉండటం గమనార్హం. అమెరికాలో ఇతర దేశాల విద్యా ర్థుల సంఖ్య 11 లక్షలు ఉండగా, వారిలో 2.6 లక్షల మందితో చైనా తర్వాత భారత్ రెండో స్థానంలో నిలి చింది. ఒక్కో భారతీయ విద్యార్థి ఏటా సగటున ట్యూషన్ రుసుం, ఇతర ఖర్చులకు రూ. 15 లక్షల వరకు వెచ్చి స్తారని అంచనా వేసుకున్నా ఏడాదికి మొత్తం రూ. 30, 900 కోట్లు అవుతుంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ సంస్థ సర్వే ప్రకారం 2016-17 సంవత్స రంలో భారతీయ విద్యార్థులు 6.54 బిలియన్ అమెరికా డాలర్లు ఖర్చు చేసినట్లు వెల్లడైంది. ఇది దాదాపు రూ. 42,000 కోట్లు. 2013-14 విద్యాసంవత్సరంలో 3.3 బిలియన్ అమెరికా డాలర్లు వెచ్చించారని, 2016-17 నాటికి అది 6.54 బిలియన్ డాలర్లకు పెరిగిందని సర్వే వెల్లడించింది. విశేషమేమిటంటే.. అదే సంవత్సరం కేంద్ర ప్రభుత్వం ఉన్నత విద్యకు వెచ్చించిన మొత్తం రూ. 29,700 కోట్లు. అంటే అమెరికాలో మన విద్యార్థులు పెడుతున్న ఖర్చు దీనికంటే రూ. 12వేల కోట్లు అధికం. ఇక మిగతా అన్ని దేశాల్లో ఖర్చును వెచ్చిస్తే ఇది మరింత ఎక్కువగా ఉంటుంది.

కేవలం చదువు కోసమే కాదు..

ప్రపంచస్థాయి ప్రమాణాలతో పోల్చినప్పుడు తొలి 500 విద్యాసంస్థల్లో నిలిచే వాటిలో అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లోని విద్యాసంస్థలే ఎక్కువగా ఉంటాయి. భారతీయ విద్యాసంస్థలు నాలుగైదు కంటే ఉండవు. అయితే మనవాళ్లు విదేశీ విద్యపై ఆసక్తి చూపడానికి ఇదే ప్రధాన కారణమని కూడా చెప్పలేమని విద్యావేత్తలు అంటున్నారు. ఎందుకంటే విదేశాలకు వెళ్లినవారంతా తొలి 500 జాబితాలోని విశ్వవిద్యాలయాల్లోనే చేరడం లేదని.. అన్నింటిలోనూ చేరుతున్నారని ఉస్మానియా విశ్వ విద్యాలయం అకడమిక్ ఆడిట్ విభాగం సంచాలకుడు, ఆర్థికశాస్త్రం ఆచార్యుడు వేణుగోపాల్‌రెడ్డి చెప్పారు. అమెరికా లాంటి దేశాల్లో చదువు కోసం ఎంత ఖర్చు చేసినా తర్వాత ఉద్యోగం సంపాదించి జీవితంలో స్థిరపడవచ్చని వారు ఆశిస్తున్నారని తెలిపారు. 'విదేశాల్లో చదువుకుంటూ సంపాదించుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి... దానివల్ల మొదటి సెమిస్టర్‌కు ఖర్చు భరిస్తే తర్వాత ఏదో ఒక తాత్కాలిక ఉద్యోగం చేసి ట్యూషన్ రుసుములు చెల్లించవచ్చని భావిస్తున్నారు' అని ఓయూ వాణిజ్యశాస్త్రం సీనియర్ ఆచార్యుడు ఎస్వీ సత్యనారాయణ చెప్పారు. కేంద్రం ఇక్కడా చదువుకుంటూ సంపాదించుకోవడం లాంటి సంస్కరణలను ప్రవేశపెట్టాలని, యువతకు ఉజ్వల అవకాశాలు ఇక్కడే ఉన్నాయన్న భరోసా లభిస్తే తప్ప విద్యార్థుల వలసలు ఆగవన్నారు.

'కియా' ఎండీగా కుక్ హున్ షిన్ నియామకం...!



విజయవాడ: కియా మోటార్స్ ఇండియా ఎండీ. సీఈవోగా కుక్ హున్ షిమ్ నియమితులయ్యారు. ఈ మేరకు కియా మోటార్స్ ఇండియా ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ నియామకం తక్షణం అమలులోకి వస్తుంది. భారత్‌లో కియా మోటార్స్ విస్తరణకు షిమ్ బాధ్యతవహిస్తారు. భారత్‌లో కియా తొలి నిర్మాణాన్ని షిమ్ పర్యవేక్షిస్తారు. నిర్దేశిత సమయంలో పూర్తి చేయటంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారు. ప్రపంచ ఆటోమోటివ్ రంగంలో భారత్ ఐదో స్థానంలో ఉంది. ఇక్కడ కియా మోటార్స్ బలోపేతానికి షియా కృషి చేస్తారు. భారత్‌లో భవిష్యత్తు అభివృద్ధికి కియా 110 కోట్ల డాలర్ల పెట్టుబడి పెడుతోంది. కుక్ హున్ షిమ్ (58)కు ఆటోమోటివ్ రంగంలో 30 ఏళ్ల అనుభవం ఉంది. ప్రస్తుతం ఆయన జార్జియాలో కియా మోటార్స్ కోఆర్డినేషన్ హెడ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇంతకముందు స్లోవేకియాలోని కియా మోటార్స్ ప్రొడక్షన్ గ్రూప్ హెడ్ కోఆర్డినేటర్‌గా పని చేశారు. కియా మోటార్స్ ప్రెసిడెంట్ హన్-వూపార్క్ మాట్లాడుతూ, షిన్‌ను భారత్‌లో మేనేజింగ్ డైరక్టర్, సీఈవోగా నియమించటం చాలా ఆనందంగా ఉందన్నారు. "కియా ఉత్పత్తి చేసే ప్రపంచ శ్రేణి కార్లకు భారత్‌లో మంచి డిమాండు ఉందని గుర్తించాం. షిమ్ నాయకత్వంలో ఇండియాలో కిమ్ కార్యకలాపాలు సరైన దిశలో నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుతామని నమ్ముతున్నాం. విశ్వవాప్త వ్యాపార ప్రణాళికలకు ఆయన నాయకత్వం చేయూతనిస్తూ, ప్రపంచంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న భారత్ మార్కెట్‌లో మమ్మల్ని మైలు రాయిగా నిలబెడుతుందని ఆశిస్తున్నాం" అని అన్నారు. కియా నూతన సీఈవో కుక్ హున్ షిమ్ మాట్లాడుతూ, భారత్ కోసం కియా దగ్గర బృహత్తర ప్రణాళికలు ఉన్నాయని, తాము చేపట్టబోయే కార్యకలాపాల్లో ఆశ్చర్యపోయే శక్తిని ప్రదర్శిస్తామన్నారు.

ఐఐఎంలలో డిప్లొమా బదులు డిగ్రీలు

నూతన చట్టానికి రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ : దేశంలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎంలు) తమ పని తీరు విషయంలో ప్రభుత్వ పాత్రను నియంత్రిస్తూ మరింత స్వయం ప్రతిపత్తిని సాధించాయి. తమ గ్రాడ్యుయేట్లకు డిప్లొమోలకు బదులుగా డిగ్రీలను ప్రదానం చేసే అధికారాన్ని పొందినట్లు నూతన చట్టం ఒకటి పేర్కొంది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఐఐఎం బిల్లు-2017కి ఆదివారం ఆమోదం తెలపడంతో అది ఇపుడు చట్ట రూపం దాల్చింది. 2017, జూలైలో లోక్‌సభలో ఈ బిల్లు ఆమోదం పొందగా, డిసెంబరు 19న రాజ్యసభ ఆమోదించింది. దీంతో డైరెక్టర్లు, బోధనా సిబ్బందితో సహా అమలులోని ఐఐఎంలకు చట్టబద్ధమైన అధికారులు మంజూరయ్యాయి. 'బిల్లు ద్వారా ఈ సంస్థలకు స్వయంప్రతిపత్తి లభిస్తుంది. ఐఐఎంల కార్యకలాపాల్లో ప్రభుత్వ జోక్యాన్ని తొలగిస్తుంది' అని కేంద్ర మానవ వనరుల శాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ గత నెలలో రాజ్యసభ సమావేశాల్లో జరిగిన చర్చల్లో చెప్పారు. బిల్లు నిబంధనల ప్రకారం, ఒక్కొక్క సంస్థకు గవర్నర్ల బోర్డు 19 మంది సభ్యులతో కార్యనిర్వాహక మండలిగా ఉంటుంది.

వార్తల్లో చత్తీస్‌గఢ్.. కాసింత చెడ్డగానే

రాయ్‌పూర్: 2017లో కాసింత చెడ్డగానే చత్తీస్‌గఢ్ వార్తల్లో నిలిచింది. రమణ్‌సింగ్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీవ్ర ప్రతికూల విమర్శలు వినవ చ్చాయి. రాయ్‌పూర్, సుక్మా బస్తర్ ఏరియాల్లో మావోయిస్టుల దాడులను ప్రభుత్వం అరికట్టలేక పోయిందనే విమర్శలు ఎక్కువైనాయి. 25మంది సీఆర్‌పీఎఫ్ జవా న్లను మావోయిస్టులు పొట్టనపెట్టుకున్నారు. ప్రభుత్వ నిధులతో నడుస్తున్న శిబిరాల్లో సుమారు 200గోవులు మంఱం సంచలనం రేపింది. సెక్స్ సీడీలో ఒక మంత్రి చిక్కుకోవడం, అటవీభూములను ఆక్రమి ంచుకున్నాడంటూ మరో మంత్రి మీద ఆరోపణలు సంచలనం రేపాయి. బస్తర్ రేంజ్‌లోని పోలీసు ఐజీ ఎస్‌ఆర్పీ కల్లూరి మీద మావోయిస్టులు మెరుపుదాడి జరిపారు. పలు నకిలీ ఎన్‌కౌంటర్లకు పాల్పడిన అభియోగాలను కల్లూరి ఎదుర్కొంటున్నారు. చాలీచాలని వర్షపాతం కారణంగా రాష్ట్రంలోని 96తహసీల్దారు కార్యాలయాల పరిధిలొ దుర్భిక్ష పరిస్థితులు ఏర్పడ్డాయి. పలువురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

ముడిచమురు ధరలు పెరగడంతో

తీవ్ర ఒత్తిడిలో భారతీయ చమురు కంపెనీలు

ముంబై: అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు 31నెలల గరిష్టానికి చేరడంతో భారతీయ చమురు కంపెనీలు (ఐఓసి) తీవ్ర ఆందోళనలో ఉన్నట్లు తెలుస్తోంది. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలుపెరగడంతో భారతీయ చమురుకంపెనీల లాభాలపై ప్రతికూల ప్రభావం చూపిందని వెల్లడించారు. బ్రెంట్ క్రూడ్ ధరలు అత్యధికంగా నమోదై 31నెలల గరిష్టానికి చేరి బ్యారెల్ 67.29డాలర్ల పైనే పలికింది. 2016నవంబరులో బ్యారెల్ 48 డాలర్లుగా ఉన్న క్రూడ్‌ఆయిల్ ధరలు 2017 డిసెంబరులో ఏకంగా 40శాతం పెరిగి బ్యారెల్ 67 డాలర్లకు చేరింది. దీనితో క్రూడ్ ఆయిల్ ఉత్పతిని తగ్గించాలని ఆర్గనైజేషన్ ఆఫ్ ద పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్(ఒపెక్) దేశాలు నిర్ణయించాయి. అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో, ఉత్పత్తిని తగ్గించే అంశంపై ఒపెక్, నాన్ ఒపెక్ దేశాలు నిర్ణయాలు అంతర్జాతీయ డిమాండ్‌కు తగినట్లుగా పెట్రోలియం ఉత్పత్తుల సరఫరాలో తీవ్ర అంతరాయంతో ముడిచమురు ధరలు పెరిగేందుకు కారణమైంది. గడిచిన మూడు నెలలకాలంలో, ఎక్కువ ఓఎంసి కంపెనీలు బిఎస్ఇ ఆయిల్ అండ్ ఇండెక్స్ కింద పనిచేస్తున్నాయి. బిఎస్ఇ ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు 9.71శాతం లాభపడటంతో బెంచ్‌మార్క్ సెన్సెక్స్ 8.86శాతం లాభపడింది. కాగా ఐఓసి 2.91శాతం, హెచ్‌పిసిఎల్ 2.39శాతం నష్టపోగా,బిపిసిఎస్ 9.87శాతం లాభపడింది. క్రూడ్ ఆయిల్ ధరలు అమాంతంగా పెరగడంతో ఓఎంసి స్వల్పకాలిక రుణాల అవసరాలను, స్వల్పకాలిక రుణాల స్థాయిని పెంచింది. దీనివలన లాభాలపై ప్రతికూల ప్రభావం పడిందని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రవిచంద్రన్ వెల్లడించారు.


మహిళల హక్కుల రక్షణపై న్యాయవ్యవస్థ దృష్టి



న్యూఢిల్లీ: మహిళల హక్కుల రక్షణ విషయమై న్యాయ వ్యవస్థ ప్రత్యేక దృష్టి సారించింది. లింగ సమానత్వ, వివక్షలకు తావు లేని విధంగా న్యాయప్రక్రియ సజావుగా సాగేందుకు దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు స్థాయిలోనే ప్రత్యేక శ్రద్ధ చూపిన పరిస్థితిని గమనించవచ్చు. మైనరు భార్యతో శృంగారం, మహిళలకు వ్యతిరేకంగా జరిగే అత్యాచారాలు, అఘాయిత్యాలు ముస్లిం మహిళల కోసం ముమ్మారుతలాక్‌ను నేరంగా పరిగణించాలన్న బిల్లు వంటి కొన్నిటిని ఉదాహరణగా చెప్పుకోవచ్చు. డిసెంబరు 16న జరిగిన సామూహిక అత్యాచారం, హత్య కేసులో నిందితులుగా అభియోగాలను ఎదుర్కొన్న నలుగురు మైనర్లకు మరణశిక్ష విధించడమే సమంజసమన్న సుప్రీంకోర్టు వ్యాఖ్యలు గమనార్హం. కాగా, దేశ వ్యాపితంగా వివిధ స్థాయిల్లోని కోర్టుల్లో మహిళలకు వ్యతిరేకంగా జరిగే అన్యాయాలు, ఆయా కేసుల్లోని నిందితులపై కఠినంగా వ్యవహరించాలన్న న్యాయవ్యవస్థ చొరవ గుర్తించాల్సి ఉంది. హర్యానాలో డేరా సచ్చా సౌదా అధిపతి గర్మీత్ రామ్ రహీమ్ సింగ్ సాగించిన అక్రమాలు, ముఖ్యంగా మహిళలపై గుర్మీత్ సాగించిన దురాగతాలపై కోర్టులు కఠినంగా వ్యవహరించాయి. గుర్మీత్‌కు 20సంవత్సరాల కఠిన కారాగారవాస శిక్షను కోర్టు విధించింది. ఢిల్లీలో బాబా ముసుగులో మహిళలను, మైనరు బాలికలను బంధించి వేధింపులకు గురి చేస్తున్న వీరేంద్రదేవ్ దీక్షిత్‌ను పోలీసులు బోనెక్కించారు. శబరిమల ఆలయ ప్రవేశవిషయంలో నెలసరి మహిళలనూ అనుమతించాలని, కులాంతర వివాహం చేసుకున్న పార్సీ మహిళలనూ 'టవర్ ఆఫ్ సైలెన్స్' క్రతువులో పాల్గొనేందుకు అనుమతించడం సహా అనేక మహిళ సమస్యలు న్యాయపరిష్కారం కోసం కోర్టు గుమ్మమెక్కాయి వీటికి ఆయా కోర్టులు స్పందించిన తీరూ సానుకూలంగానే ఉంది. శబరిమల , పార్సీ మహిళల అంశాల్లో సుప్రీంకోర్టు అనుసరించిన వైఖరి అభ్యుదయ కరంగా ఉందని జనం అభిప్రాయపడుతున్నారు. కేరళలో వెలుగు చూసిన లవ్ జిహాద్‌ఉదంతంలోనూ బాధితురాలిగా నిలిచిన యువతి పక్షానే కోర్టులు నిలిచాయి. ఈ తరహా కేసుల్లో అవసరమైన ప్రతి సందర్భంలోనూ వైద్య నిపుణుల సలహామేరకు వ్యవహరించాలని కోర్టులు ఆదేశాలిచ్చాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం 2015తో పోల్చినపుడు 2016లో రేప్ ఉదంతాల నమోదు స్వల్పంగా పెరిగాయి. మహిళలకు వ్యతిరేకంగా నేరాలు మూడు శాతం పెరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. రేప్ కేసుల పరంగా ఢిల్లీలోనే రికార్డు స్థాయిలో 13,803 దుర్ఘటనలు జరిగాయి. లక్నోలో 1,260కేసులు నమోదయాయి. 81సంవత్సరాల వితంతువును ఆమె నివాసంలోనే రేప్‌చేసిహత్య చేసిన పనివాడికి జీవిత ఖైదు విధిస్తూ ఢిల్లీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. రేప్‌లు, పరువు హత్యలు, దోపిడీలు, హత్యలు అక్రమ రవాణా ఇలా ఏకేసులోనైనా బాధిత మహిళలకు సత్వర న్యాయం దక్కేలా ఆయా కేసుల్లో కోర్టులు వ్యవహరించిన తీరు ప్రశంసనీయం.

విజ్ఞానం

ఎలుక కణాలతో జుట్టు పెరుగుదల



జుట్టు ఊడటాన్ని నిరోధించేందుకు గాను అమెరికా శాస్త్రజ్ఞులు నివారణోపాయాన్ని కనుగొన్నారు. ఎలుకలనుండి తీసిన స్టెమ్ సెల్ సహాయంతో మొదటిసారి శాస్త్రజ్ఞులు హెయిర్ ఫాలికిల్స్‌ను ల్యాబ్‌లో చర్మాన్ని రూపొందించారు. సింగిల్ స్కిన్ ఆర్గ నాయిడ్ యూనిట్‌ను డెవలప్‌చేయడంతో చర్మంలోని రెండు పొరల గుండా వెంట్రుకలుపెరగడం ప్రారంభమైందని ఇండియానా యూని వర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ రీసెర్చర్ వెల్లడించారు. ఎపిడెర్మిస్, డెర్మిస్ అనే పైపొర,లోపలిపొరలను సహజసిద్ధంగా ఉండేట్లు రూపొందిం చారు. దీనిపైఅనేక పరిశోధనలుచేసిన అనంతరం తలపై ప్రవేశపెట్టి వెంట్రుకలు మొలకెత్తినట్లు తెలిపారు. ఈ స్టెమ్ సెల్ థెరపీ భవిష్యత్తులో హెయిర్ లాస్ వారికి అత్యంత ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపారు. దీన్నిరూపొందించినవారే చెవి అంతర్భాగానికి కావలసిన చర్మాన్నికూడా రూపొందించినట్లు ఇండియానా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు వెల్లడించారు.



మెదడు పనితీరును దెబ్బతీస్తున్న సుగర్

భోజనం అనంతరం తీపి పదార్థాలు తీసుకుంటున్నారా... జాగ్రత్త అది మీ మెదడు పనితీరును మందగిస్తుందని న్యూజిలాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ ఒటాగో వెల్లడించింది. (ఫ్రూట్ సుగర్) ఫ్రక్టోజ్ లేక ఆర్టిఫిషియల్ స్వీటనెర్ అయిన సుక్రలోజ్ (ప్లేస్‌బో) తీసుకున్న వారితో పోల్చిచూసుకుంటే గ్లూకోజ్ లేక టేబుల్‌షుగర్‌ను తీసుకున్నవారిలో ఏకాగ్రత లోపించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా గ్లూకోజ్ వినియోగం జ్ఞాపకశక్తిపై కూడా ప్రభావం చూపుతుంది. 49 మంది వ్యక్తులపై చేసిన పరిశోధనలో వీరికి గ్లూకోజ్,సుక్రోజ్,ఫ్రక్టోజ్ వంటి పదార్థాలను ఇచ్చి వారి అరిథమేటిక్ ప్రాసెసింగ్‌తోపాటు బ్లడ్ గ్లూకోజ్ స్థాయిని పరీక్షించారు. ఫ్రక్టోజ్, సుక్రలోజ్ వినియోగించినవారి కన్నా గ్లూకోజ్‌తోపాటు సుక్రోజ్ వినియోగించినవారిలో కాగ్నిటివ్ పరీక్షలో 200 మిల్లీ సెకన్లు వెనుకబడి ఉన్నారు. వీరి మెదడు పనితీరునుకూడా న్యూరో ఇమేజింగ్ టెక్నిక్‌ద్వారా వీరి ఏకాగ్రతను పరీక్షించి చూశారు.

అపోలో 'విన్‌ష్యూర్' ఆవిష్కరణ...!

విజయవాడ: అపోలో మ్యూనిచ్ హెల్త్ ఇన్సూరెన్స్ కంపెనీ కొత్తగా విన్‌ష్యూర్ పేరిట హెల్త్‌వాలెట్ ప్లాన్‌ను ప్రకటించింది. జనరల్ హెల్త్ పాలసీల్లో కవర్ కాని హాస్పిటలైజేషన్, ఓపీడీ ఖర్చులను ఈ ప్లాన్ కవర్ చేస్తుంది. రిజర్వు బెనిఫిట్ సౌలభ్యాన్ని కల్పించింది. రెన్యువల్ సమయంలో రిజర్వు బ్యాలెన్స్‌పై ఖాతాదారులకు 6 శాతం బోనస్ ఇస్తుంది. స్పీచ్ థెరపీ, ఔషధాల కొనుగోలు, వ్యాక్సినేషన్, డెంటల్ ఖర్చులు, రోగ నిర్ధారణ పరీక్షలు, కళ్లద్దాలు, కాంటాక్ట్ లెన్సులు, బీపీ, షుగర్ మానిటర్స్ కొనుగోలు, ఆక్సి మీటర్లు, ప్రొటెస్టెస్, డాక్టర్ కన్సల్టేషన్స్, ఫిజియోథెరపిస్ట్, డైటీషియన్ ఫీజులు నుంచి ఈ ప్లాన్‌లో రక్షణ పొందవచ్చు. ఇతర ఆరోగ్య బీమా పాలసీల్లో మినహాయించిన నాన్ పేయబుల్ ఐటెమ్స్‌కూ చెల్లింపు చేసుకునే అవకాశం ఖాతాదారులకు ఇస్తుంది. కాస్మటిక్స్, ఆల్జీమర్స్ కూడా ఈ ప్లాన్ పరిధిలోకి వస్తాయి. ఈ సందర్భంగా అపోలో మ్యూనిచ్ హెల్త్ ఇన్సూరెన్స్ సౌత్ అండ్ సెంట్రల్ జోన్ సీఈవో సూరజ్ మిశ్రా మాట్లాడుతూ, ఆరోగ్య సంరక్షణలో అధిక వ్యయం భరించక తప్పదు, భారతీయులు డబ్బుకు అధిక విలువలను ఆశిస్తారు, విశ్రాంత ఉద్యోగులు తమ ఆరోగ్య వ్యయాలపై ఆందోళన చెందుతుంటారు, ఈ మూడు అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ నూతన పాలసీని రూపొందించామన్నారు.



ఆన్‌లైన్ వినియోగదారులకు శుభవార్త

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ మార్కెట్‌లో కొనుగోళ్లు జరిపే వినియోగదారుల ప్రయోజనాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్ని వస్తువులపై సోమవారం నుంచి గరిష్ఠ చిల్లర ధర (ఎమ్మార్పీ)తో పాటు వాటి ఎక్స్‌పైరీ తేదీని, కస్టమర్ కేర్ వివరాలను తప్పనిసరిగా ముద్రించాలని ఈ-కామర్స్ సంస్థలకు స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించిన తూనికలు, కొలతల నిబంధనలను వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ సవరించింది. ఈ-కామర్స్ సంస్థలు ఈ కొత్త నిబంధనలను పాటించేందుకు ఆరు నెలల గడువు ఇచ్చింది. వినియోగ దారుల ప్రయోజనాలను పరిరక్షించడంతో పాటు వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు పాత నిబంధనలను సవరించామని, కొత్త నిబంధనలు జనవరి 1వ తేదీ నుంచే అమలులోకి వస్తాయని వినియోగదారుల వ్యవహారాల శాఖ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. సవరించిన నిబంధనల ప్రకారం ఈ-కామర్స్ వెబ్‌సైట్ల ద్వారా అమ్మకాలు జరిపే వస్తువుల లేబుళ్లపై వాటి గరిష్ఠ చిల్లర ధర, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ తేదీ, పరిమాణం, తయారీ దేశం, కస్టమర్ కేర్ వివరాలతో పాటు ఆ వస్తువులకు సంబంధించిన డిక్లరేషన్లను కూడా వ్యాపారులు తప్పనిసరిగా ముద్రించాల్సి ఉంటుంది. ఈ డిక్లరేషన్లను వినియోగదారులు సులభంగా చదువుకునేందుకు వీలుగా వాటిలోని అక్షరాలు, సంఖ్యల పరిమాణాన్ని కూడా పెంచామని, అలాగే ఒకే రకమైన వస్తువుపై ఎవరూ వేర్వేరు ఎమ్మార్పీలను ముద్రించరాదని కొత్త నిబంధనల్లో ప్రత్యేకంగా స్పష్టం చేశామని వినియోగదారుల వ్యవహారాల శాఖ తన ప్రకటనలో వివరించింది.

వీడియో పాఠాలతో విద్యారంగంలో విప్లవం



వీడియో పాఠాలతో విద్యారంగంలో విప్లవంరెండు మూడు తరాల క్రితం స్కూల్స్ పెద్దగా అందుబాటులో లేని పరిస్థితి... నిన్నమొన్నటి తరానికి మంచి ట్యూషన్ మాస్టర్‌ని వెతుక్కోవటం ఓ పెద్దటాస్క్.. క్రమంగా గల్లీకో ట్యుటోరియల్ వచ్చి ఆ లోటుని తీర్చేసింది. కానీ, ఇప్పుడు స్మార్ట్‌ఫోన్‌లతో స్మార్ట్‌గా రోజులు మారాయి. అందుకే మీ లాప్‌ట్యాప్ లోకి, మీ స్మార్ట్ ఫోన్‌లోకే మీ టీచర్ అంటున్నారు. అవును. టెక్నాలజీ విద్యారంగాన్ని అనూహ్యంగా మార్చేస్తోంది. మంచి లెక్చరర్ ఏ ఊళ్లో ఉన్నా మీ ఇంట్లోకి లాక్కొస్తానంటోంది. పాఠాలు చెప్పిస్తానని ప్రామిస్ చేస్తోంది.. అభిషేక్ బజాజ్, రోహిత్ బజాజ్...ఇద్దరూ ఇదే బాటలో ఉన్నారు. అలా సీఏ పూర్తి చేశారో లేదో.. ఎడ్యూటెక్ ఫీల్డ్‌లో తమ ప్రతిభను చాటుకోవడానికి సిద్ధమయ్యారు.



జనవరి 2015.. జీరో ఇన్ఫీకామ్ (zeroinfy. com). ఇద్దరు మిత్రులు 2015లో తమ సీఏ పూర్తి చేశారు.. ఈ ప్లాట్‌ఫాంకు సంబంధించిన బీజం ఆదిత్య, రోహిత్ విద్యార్థులుగా ఉన్నపుడే పడింది. ఓసారి ఇద్దరూ ట్యూషన్ ఫీజైతే కట్టారు కానీ హాజరు కాలేకపోయారు. ఫీజు దండగ, టైమ్ వేస్ట్. మరో పక్క ఆన్‌లైన్ పోర్టల్స్‌ని ఆశ్రయిద్దామంటే ఒక్కో సబ్జెక్ట్‌కి ఎంతోమంది టీచర్లు కనిపిస్తుంటే ఎవర్ని ఎంపిక చేసుకోవాలో తెలియని అయోమయ పరిస్థితి. అలా ఈ ప్లాట్‌ఫాం ఆలోచన మొదలయింది..

ఇది కోల్‌కతాలో మొదలైన ఇంటరాక్టివ్ ఎడ్యుకేషన్ ప్లాట్ ఫాం.. ఇందులో విద్యార్థులు తమకు కావలసిన వీడియో పాఠాలు కొనుక్కునే అవకాశం ఉంది. అంతే కాదు.. తోటి విద్యార్థులతో తమ అనుభవాలు, ఆయా పాఠాలకు సంబంధించిన విషయాలు పంచుకుంటూ నేర్చుకునే అవకాశాన్ని కూడా ఈ ప్లాట్‌ఫాం కల్పిస్తోంది. సీఏ, సీఎస్, సీఎస్‌ఏ, యూపీఎస్సీ, ఐఐటి-జెఈఈ మొదలైన కోర్సులకు సంబంధించి అనుభవజ్ఞులైన లెక్చరర్ల పాఠాలను అందజేస్తోంది. దీనికోసం అభిషేక్, రోహిత్ ఇద్దరూ కలిసి కోల్‌కతా, ఢిల్లీ, ముంబయి, పూణె, చెన్నై, జైపూర్, జోధ్‌పూర్ ఇలా దేశమంతా తిరిగి... దేశ నలుమూలలనుంచి టీచర్లతో ఒప్పందాలు చేసుకుంటున్నారు.

"టీచర్లంటే అలాంటిలాంటి వారు కాదు.. కనీసం ఐదేళ్లపాటు, కనీసం ఓ వెయ్యిమంది విద్యార్థులకు బోధించిన అనుభవం ఉన్న ఉపాధ్యాయులను అన్ని రకాలుగా సమాచారం రాబట్టుకుని.. నమ్మకం కలిగిన తర్వాతనే ఒప్పందాలు చేసుకుంటున్నాం. ఆ విధంగా ఒప్పందాలు కుదుర్చుకున్న తర్వాత ఆయా టీచర్ల వీడియోలను జీరోఇన్ఫీ.కామ్ సర్వర్‌లో పెడుతున్నాము. ఈ ప్లాట్ ఫాంని డెవలప్ చేయటానికి దాదాపు 6 నెలలు పట్టింది. ఆ తర్వాత మరో రెండు నెలలు బీటా వెర్షన్ రన్ చేశాము." అని ఆదిత్య తెలిపాడు

ప్రణాళికనుంచి ప్రాక్టికల్ సీన్ వరకు...

కోల్‌కతా సెయింట్ జేవియర్ కాలేజ్‌లో చదివిన ఈ

మొదట మార్కెట్‌ని సరిగ్గా అంచనా వేయలేకపోయినా, ఆ తర్వాత సరిచేసుకుని పక్కా లెక్కలతో, సరైన ప్రొడక్ట్‌తో వచ్చారీ ఇద్దరు దోస్తులు. కుటుంబ సభ్యులు, స్నేహితుల నుంచి పోగుచేసి పదిలక్షలు పెట్టుబడిగా పెట్టారు. ఈ ప్లాట్‌ఫాం ఇప్పటివరకు 10వేల మందికిపైగా విద్యార్థులను ఆకట్టుకుంది. స్టూడెంట్స్ మొదట డెమో చూసి, నచ్చితే ఆయా కోర్సులకు సంబంధించిన వీడియో పాఠాలను కొనుక్కుంటారు. మొత్తం కోర్సు లేదా, విడివిడి పాఠాలను కూడా కొనుక్కునే అవకాశం ఉంది. వీటి విలువ 500 నుండి 10,000 రూపాయల వరకు ఉన్నాయి. ఈ ఫీజు బయట క్లాసులకు కట్టాల్సిన దానికంటే దాదాపు సగం పైగా తక్కువగా ఉండటం విశేషం..

ప్రస్తుతం జీరో ఇన్ఫీలో 8 మంది ఉద్యోగులున్నారు. 25 మంది ఇన్‌స్ట్రక్టర్లు పనిచేస్తున్నారు. డిటిజల్ మార్కెటింగ్ ద్వారా ఈ ప్లాట్ ఫామ్ దుర్గాపూర్, భువనేశ్వర్, విజయవాడ, అసన్‌సోల్ మొదలైన ద్వితీయ శ్రేణి నగరాల విద్యార్థులను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. నెలకు రెండున్నర లక్షల వరకు ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు.

భవిష్యత్తు చాలా ఉంది..

రాబోయే కొద్ది నెలల్లో జీరోఇన్ఫీ.కామ్ మార్కెటింగ్‌పై మరింత దృష్టి పెట్టే యోచనతో ఉంది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ మార్కెట్‌లో సింహభాగం సాధించటమే కాదు.. ముఖ్యంగా చిన్న చిన్న పట్టణాల్లో కూడా పట్టు సాధించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికైతే ఫేస్‌బుక్ ద్వారా విద్యార్థులను చేరేందుకు ప్రయత్నిస్తోంది. అంతే కాదు.. ఆయా కళాశాలల్లో అవేర్‌నెస్ పెంచటానికి సెమినార్లు కూడా నిర్వహిస్తోంది.




ఎంత ఆన్ లైన్ పాఠాలైనా, సీడీలు అమ్మేశామా... ఫీజు తీసుకున్నామా అన్నట్టు కాకుండా విద్యార్థులకు ఉపయోగపడే ప్లాన్స్ చాలా సిద్ధం చేస్తోంది జీరోఇన్ఫీ. ఇందులో భాగంగా స్టార్టప్ మెంటర్ మాడ్యూల్ విడుదలకు సన్నాహాలు చేస్తోంది. దీనికోసం సీఏ టాప్ ర్యాంకర్లు, ఐఐటి ర్యాంకర్లతో టై అప్ కూడా పెట్టుకున్నారు. జీరోఇన్ఫీలో కోర్సు కొనుగోలు చేసిన ప్రతి విద్యార్థికీ ఓ మెంటార్‌ని ఎసైన్ చేస్తారు. ఇది విద్యార్థుల ప్రగతిని మానిటర్ చేసేందుకు ఉపయోగపడుతుంది..

ఇప్పటికే ఫ్రెండ్స్, ఫ్యామిలీ మెంబర్స్ నుండి పెట్టుబడి వసూలు చేశారు...కానీ, వ్యాపారం అభివృద్ధి చెందాలంటే మరింత పెట్టుబడి కావాలి. దీనికోసం కొత్త ఇన్వెస్టర్ల కోసం అన్వేషిస్తున్నారు. సంవత్సరానికి 6 కోట్లకు పైగా ఆదాయాన్ని సమకూర్చుకోవడం ఈ సంస్థ లక్ష్యం.

విద్యారంగంలోసాంకేతిక ప్రగతి....

స్మార్ట్ ఫోన్లు, నోట్ బుక్స్, పామ్ టాప్స్ లాంటి అందుబాటులోకి వచ్చి విద్యారంగాన్ని సమూలంగా మార్చేస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే క్లాస్ రూమ్ పాఠాల రెగ్యులర్ చదువులో ఇప్పుడో విప్లవమే రాబోతోంది. ఇండియా బ్రాండ్ ఈక్విటీ ఫౌండేషన్ రిపోర్ట్ ప్రకారం, భారతదేశ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ మార్కెట్ 2017కల్లా 40 బిలియన్ డాలర్లను చేరుతుందని అంచనాలున్నాయి. రియల్ టైమ్ బుక్ అప్ డేట్స్, ఆన్ లైన్ ట్యూషన్లు, ఎడ్యుటెయిన్ మెంట్, హెచ్ డీ క్వాలిటీ ఎడ్యుకేషనల్ వీడియోలు, ఆన్ లైన్ టెస్టుల ద్వారా ఎడ్యుకేషన్ స్టార్టప్స్ విద్యార్థులను అనూహ్యంగా ఆకట్టుకుంటున్నాయి. ఇవి నగరాలనుండి, చిన్న పట్టణాలకు సైతం వేగంగా విస్తరిస్తున్నాయి.

వేదాంతు, సింప్లిలెర్న్, బైజు, టాపర్, ఐప్రాఫ్ లెర్నింగ్ సొల్యూషన్స్, ఎడ్యూకార్ట్, టాలెంట్ ఎడ్జ్, సూపర్ ప్రొఫ్, ఎంబైబ్.కామ్... మొదలైన సంస్థలు ఇప్పుడు ఎడ్యుటెక్ రంగంలో పోటీపడుతున్నారు. ఫ్యూచర్ గ్రోత్‌ని వివరిస్తూ పెద్ద కంపెనీల నుండి పెట్టుబడులు పొందే ప్రయత్నాలు చేస్తున్నాయి. వేదాంతు ఇప్పటికే 5మిలియన్ డాలర్లను టైగర్ గ్లోబల్, యాక్సెల్ పార్టనర్స్ నుండి పొందింది. టాపర్ 10మిలియన్ డాలర్లను ఎన్ఏఐఎఫ్, హీలియన్, ఫిడెలిటీ గ్రోత్ నుండి, మెరిట్ నేషన్ 5 మిలియన్ డాలర్లను ఇన్ఫోఎడ్జ్ నుండి, సింప్లి లెర్న్ 15 మిలియన్ డాలర్లను మే ఫీల్డ్ ఫండ్, కలారి క్యాపిటల్ నుండి, ఎడ్యుకార్ట్ 1మిలియన్ డాలర్లను యు వియ్ క్యాన్ విన్ వెంచర్స్, యునైటెడ్ ఫిన్సెక్ నుండి పెట్టుబడులు సంపాదించాయి.



"అంతా స్మార్ట్ మయమై, స్టార్ ఫోన్లను అటు విద్యార్థులు, ఇటు టీచర్లు మాధ్యమంగా వాడుతున్న సందర్భంలో స్టూడెంట్ ప్రతిభ, టీచర్ చొరవ రెండిటినీ సరిగ్గా అంచనా వేసే వీలు కలుగుతోంది. రాబోయే కాలమంతా ఈ ఎడ్యూ టెక్ రంగానిదే అంటే ఆశ్చర్యపడనక్కర్లేదు" అని విజ్ ఐక్యూ చీఫ్ రెవెన్యూ ఆఫీసర్ మనీష్ శర్మ పేర్కొంటున్నారు.



సెన్సార్ పూర్తి చేసుకొన్న "హార్ట్ బీట్"

ధృవ, వెంబ జంటగా దేవాన్ మీడియా ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై శ్యామ్ దేవభక్తుని నిర్మాణ సారథ్యంలో ద్వారక్ రాజా దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం "హార్ట్ బీట్". డిఫరెంట్ లవ్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ చిత్రం సెన్సార్ పూర్తి చేసుకొని క్లీన్ యు సర్టిఫికేట్ అందుకొంది. ఇటీవల విడుదలైన టీజర్, పోస్టర్స్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకోగా అతి త్వరలో చిత్రాన్ని విడుదల చేసేందుకు దర్శకనిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత శ్యామ్ దేవభక్తుని మాట్లాడుతూ.. "ఒక 16 ఏళ్లమ్మాయి తనకంటే వయసులో పెద్దవాడైన యువకుడిని మనస్ఫూర్తిగా ప్రేమిస్తే ఎలా ఉంటుంది అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రం "హార్ట్ బీట్". ఎక్కడా అసభ్యతకు, అశ్లీలతకు తావులేకుండా చాలా ఆసక్తికరంగా తెరకెక్కించాం. మా డైరెక్టర్ చిత్రాన్ని తెరకెక్కించిన విధానం అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరిస్తుంది. సెన్సార్ పూర్తి చేసుకొని క్లీన్ యు సర్టిఫికేట్ అందుకొన్నాం. హిలేరియస్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్‌గా తెరకెక్కిన "హార్ట్" బీట్" చిత్రాన్ని అతిత్వరలో ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాం" అన్నారు.

విశాలాంధ్ర సినిమా

తనీష్ ఓ "దేశ దిమ్మరి"



సవీణ క్రియేషన్స్ పతాకంపై బాలీవుడ్ నిర్మాత సావి గోయల్ నిర్మిస్తున్న చిత్రం 'దేశదిమ్మరి'. నగేష్ నారదాశి దర్శకత్వంలో తనీష్ హీరోగా రూపొందనున్న ఈ చిత్రం చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలను జరుపుకుంటోంది. సుభాష్ ఆనంద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రంలో సుమన్, ముకుల్ దేవ్, ఫిష్ వెంకట్ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు నగేష్ నారదాశి మాట్లాడుతూ.మానవత్వ విలువలను చాటి చెప్పే చిత్రమిది. ప్రకృతి మన అవసరాలను తీరుస్తుంది తప్ప.. అత్యాశను కాదు అనే సిద్ధాంతాన్ని నమ్మే ఓ యువకుడి కథే ఈ దేశ దిమ్మరి. డబ్బుతో అవసరం లేకుండా జీవనం సాగించే ఓ వైవిధ్యభరితమైన కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాము. పంజాబ్ హర్యానా, హిమాచల్‌ప్రదేశ్‌లలో షూటింగ్ చేశాము. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో సినిమాను విడుదల చేస్తామన్నారు.

'శైలజారెడ్డి అల్లుడు'!



నాగచైతన్య

1993లో అక్కినేని నాగార్జున కథానాయకుడిగా నటించిన 'అల్లరి అల్లుడు' అద్భుతమైన విజయం అందుకుంది. ఇప్పుడు ఆయన కుమారుడు అక్కినేని నాగచైతన్య 'శైలజా రెడ్డి అల్లుడు' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ సినిమా 'అల్లరి అల్లుడు' సినిమా తరహాలోనే ఉండబోతోందని టాలీవుడ్ వర్గాల సమాచారం. ఇందులో చైతన్యకి జోడీగా అను ఇమ్మాన్యుయేల్ నటిస్తున్నారు. 'అల్లరి అల్లుడు'లో నాగార్జున..మీన, నగ్మకు జోడీగా నటించారు. అందులో నాగ్‌కు అత్తగా వాణిశ్రీ నటించారు. ఇప్పుడు రాబోయే సినిమాలో నాగ చైతన్యకు అత్త పాత్రలో రమ్యకృష్ణ నటించనున్నారు. నాగ్ సినిమా స్ఫూర్తితోనే దర్శకుడు మారుతి 'శైలజా రెడ్డి అల్లుడు' సినిమాను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. దాంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. మరోపక్క నాగచైతన్య 'సవ్యసాచి' సినిమాతో బిజీగా ఉన్నారు. చందూ మొండేటి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో చైతూ ఎడమ చెయ్యి పనిచేయని కుర్రాడి పాత్రలో కన్పించనున్నారు. చైతూకి జోడీగా బాలీవుడ్ భామ నిధి అగర్వాల్ నటిస్తున్నారు.

"నీతో ఏదో చెప్పాలని ఉంది"-ఆర్పీ



మ్యూజిక్ డైరెక్టర్ ఆర్.పి.పట్నాయక్...తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయం అక్కర్లేని పేరు. చిత్రం, జయం, నువ్వు-నేను, సంతోషం మనసంతా నువ్వు లేక నేను లేను వంటి బ్లాక్ బస్టర్ చిత్రాలకు సంగీతం అందించిన ఆర్.పి.పట్నాయక్. దర్శక నిర్మాతగా మారిన తర్వాత తన సంగీతంతో మ్యూజిక్ ప్రేమికులను అలరించడం తగ్గిపోయింది. సంగీత ప్రేమికుల కోసం ఆర్.పి ఇప్పుడు నీతో ఏదో చెప్పాలని ఉంది అనే మెలోడీ సాంగ్‌ను సిద్ధం చేశారు. ఈ సాంగ్ ఆదిత్య మ్యూజిక్ ద్వారా మార్కెట్లోకి విడుదలవుతోంది. సంగీతం అందించడమే కాకుండా ట్యూన్‌కు తగ్గ సాహిత్యం కూడా ఆర్.పియే అందించడం విశేషం. ఈ సాంగ్‌ను ఆస్ట్రేలియాలో చిత్రీకరించారు. బాహుబలి సినిమాలో మమతల తల్లి.. పాటను పాడిన సత్య యామిని పాడగా, సత్య యామిని, అనుదీప్ కలిసి నటించారు. జనవరి 5న ఈ పాటను విడుదల చేస్తున్నారు. ఈ సాంగ్ సంగీత ప్రపంచంలో ఓ సెన్సేషన్ క్రియేట్ చేస్తుందని ఆదిత్య మ్యూజిక్ కాన్ఫిడెంట్‌గా ఉంది. అలాగే మంచి కాన్సెప్ట్‌తో కూడిన ఒరిజినల్ సాంగ్స్‌ను, మ్యూజిక్ ఆర్టిస్టులను ఎంకరేజ్ చేయడానికి ఆదిత్యమ్యూజిక్ ఎప్పుడూ ముందుంటుంది.

శాంతించండి : రాజకీయపార్టీల పిలుపు

ముంబై : మహారాష్ట్రలో శాంతిస్థాపన కోసం సంయమనం పాటించాలని అన్ని రాజకీయపార్టీలు విజ్ఞప్తి చేశాయి. ముంబైతో సహా అన్ని ప్రాంతాలకు విస్తరించిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో దళితనేతలు బుధవారం మహారాష్ట్ర బంద్‌కు పిలుపునివ్వడంతో రాజకీయపార్టీలు పై విధంగా స్పందించాయి. బీమ- కోరేగాన్ యుద్ధం ద్విశతాబ్ది ఉత్సవాల సందర్భంగా పూనేలో ఈ అల్లర్లు చెలరేగాయి. రాష్ట్రంలో తక్షణమే శాంతిని పునరుద్ధరించాలని ఎన్సీపీ అధ్యక్షుడు సునీల్ టట్కర్ కోరారు. ఆ పార్టీ అధినేత శరద్‌పవార్ ఇప్పటికే రాష్ట్రంలో శాంతి-సుహృద్భావాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందని ప్రకటించడాన్ని ఆయన గుర్తుచేశారు. దళితులు- మరాఠాల మధ్య అల్లర్లు చెలరేగడం దురదృష్టకరమని శివసేన నాయకుడు నీలం గోరే ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని అందరూ సమైక్యంగా దాన్ని ఎదుర్కోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం దీనిపై న్యాయవిచారణకు ఆదేశించిందని ఈ అల్లర్లకు అసలు కారణం త్వరలో తెలుస్తుందన్నారు.

లోక్‌సభకు ఓబీసీ సవరణ బిల్లు

న్యూఢిల్లీ : గత సమావేశాల్లో రాజ్యసభలో నిరాకరించిన ఓబీసీ బిల్లును కేంద్ర ప్రభుత్వం బుధవారం లోక్‌సభలో ప్రవేశ పెట్టింది. వెనుకబడిన తరగతుల వారి సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. ఓబీసీ కమిషన్ ప్రతిపాదనకు చట్టబద్ధత కల్పించడం కోసం గత సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టగా ప్రతిపక్షం సవరణలు ప్రతిపాదించింది. కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, టీఎంసీ సభ్యులు కల్యాణ్ బెనర్జీలు వాగ్బాణాలు విసురుకోవడంతో 2017లో 123వ సవరణకు అంతరాయం కలిగింది. అధికార బీజేపీ ఏకపక్షంగా వ్యవహరిస్తోందని, గుజరాత్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఈ సవరణను చేపట్టాయని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోశాయి. తొలుత సామాజిక న్యాయ సాధికార శాఖ మంత్రి తవార్‌చంద్ గేహ్లోట్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లు లోక్‌సభలో పాస్ అయినప్పటికీ మహిళలకు సముచిత స్థానం లభించలేదని రాజ్యసభలో ఆమోదం పొందలేదు. ఓబీసీల సమస్యలపై చర్చించేందుకు ప్రత్యేక శాఖ ఉండాలని కాంగ్రెస్‌కు చెందిన రాజీవ్ సతావ్ వెల్లడించారు.

'తలాక్' పై రగడ

సెలెక్ట్ కమిటీకి పంపాలని కాంగ్రెస్ నోటీసు

బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం

మూడుసార్లు వాయిదా పడిన రాజ్యసభ



న్యూఢిల్లీ : ట్రిపుల్ తలాక్ బిల్లుపై రాజ్యసభలో బుధవారం తీవ్ర గందరగోళం చోటుచేసుకుంది. న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ బిల్లును సభలో ప్రవేశపెట్టిన వెంటనే బీజేపీ, కాంగ్రెస్ సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. బిల్లును రాజ్యసభకు చెందిన ఒక సెలెక్ట్ కమిటీకి పంపాలని కోరుతూ కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్ శర్మ నోటీసు ఇచ్చి కమిటీ సభ్యుల పేర్లను కూడా ఆయన ప్రతిపాదించారు. ఈ సందర్భంగా తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో డిప్యూటీ చైర్మన్ పి.జె.కురియన్ సభను వాయిదా వేశారు. గత వారం లోక్‌సభలో ఆమోదం పొందిన ట్రిపుల్ తలాక్ బిల్లును రాజ్యసభ ఉదయం ప్రవేశపెట్టిన తర్వాత 3 గంటల వరకు సభ మూడుసార్లు వాయిదా పడింది.

ప్రసాద్ మాట్లాడుతూ ముస్లిం మహిళకు మూడుసార్లు తలాక్ చెప్పి విడాకులు కోరిన ముస్లిం వ్యక్తి ఎవరికైనా జరిమానా, మూడేళ్ల జైలు శిక్ష నిబంధనలు కలిగిన చారిత్రాత్మక బిల్లును ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. 'లోక్‌సభలో తలాక్ బిల్లు ఆమోదం తర్వాత కూడా తలాక్ ఆచారం కొనసాగుతోంది. వరకట్నం విషయమై మొరాదా బాద్‌లో ఒక మహిళకు ట్రిపుల్ తలాక్ ఇచ్చారు' అని రవిశంకర్ ప్రసాద్ తెలిపారు. అయితే కాంగ్రెస్ సభ్యుడు ఆనంద్ శర్మ మాట్లాడుతూ బిల్లును పార్లమెంటరీ సెలక్ట్ కమిటీకి పంపాలని డిమాండు చేశారు. కమిటీ సభ్యుల పేర్లను కూడా ప్రతిపాదించారు. 'మేము వ్యతిరేకించడం లేదు. బిల్లుకు మద్దతునిస్తున్నాం. కానీ ఏ చట్టమైనా పరిశీలన ద్వారానే జరగాలి. మహిళల హక్కుల పట్ల సభ గట్టి నిబద్ధత కలిగి ఉంది. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని నేను నోటీసును ప్రవేశపెట్టాను' అని చెప్పారు. అయితే అరుణ్ జైట్లీ అభ్యంతరం వ్యక్తం చేస్తూ 'రెండు- మూడు రోజుల ముందే ఈ బిల్లును ప్రతిపాదిం చడం జరిగింది. కనీసం ఒక రోజు ముందు నోటీసు అంద జేయాల్సి ఉంటుంది. కానీ ఒక రోజు ముందు ఇవ్వలేదు' అని అన్నారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు తెలిపిన కాంగ్రెస్ పార్టీ ఇపుడు ద్వంద్వ వైఖరి అవలంబిస్తుందని ఆరోపించారు. 'మరో సభలో మీరు బిల్లుకు మద్దతు తెలుపుతూ, ఈ సభలో మీరు చేస్తున్న అడ్డుకునే ప్రయత్నాలను దేశమంతా చూస్తున్నారు' అని ఆయన తెలిపారు. కాగా సెలెక్ట్ కమిటీకి పంపబడపోవడానికి కారణాలు న్నాయన్నారు. ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించిందన్నారు.

దీనికి శర్మ స్పందిస్తూ మహిళల గౌరవం, హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ కూడా కట్టుబడి ఉందన్నారు. 'వారు మాత్రమే బాధ్యత వహిస్తున్నట్లు చెప్పడం అన్యాయం. మాది బాధ్యత కాదా. గత మూడేళ్లుగా మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు తీసుకురాలేకపోయారు. ఇపుడే మహిళా హక్కుల పట్ల శ్రద్ధ కనబరుస్తున్నారా' అని ఆయన ప్రశ్నించారు. ఇదిలాఉండగా, రాజ్యసభ 12 గంటల సమయంలో గందరగోళం నడుమ 2 గంటలకు వాయిదా పడింది. అయితే తిరిగి 2 గంటలకు సమావేశమైనప్పటికీ మహారాష్ట్రలో కుల ఘర్షణలతో మరోసారి గందరగోళం చెలరేగింది. ప్రతిపక్ష సభ్యులు అనేక మంది నిరసన తెలుపుతూ ప్రభుత్వం 'దళిత వ్యతిరేకి' అంటూ నినాదాలు చేయడంతో సభ డిప్యూటీ చైర్మన్ పి.జె.కురియన్ సభను 3 గంటల వరకు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన తర్వాత న్యాయ మంత్రి రవిశంకర్ ప్రసాద్ మాట్లాడుతూ తలాక్ బిల్లును అడ్డుకునేందుకే భీమ-కోరేంగావ్ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ ఉద్దేశపూర్వకంగా లేవనెత్తిందని ఆరోపించారు. దీనికి కాంగ్రెస్ నాయకుడు గులామ్ నబీ ఆజాద్ స్పందిస్తూ, ప్రభుత్వం దళిత వ్యతిరేకి అని, న్యాయ మంత్రి ప్రకటనను ఖండిస్తున్నామన్నారు. తలాక్ బిల్లు, భీమ-కోరేంగావ్ హింసపై ప్రతిపక్షాల నిరసనల నడుమ రాజ్యసభ మరోసారి వాయిదా పడింది.

ఆప్ రాజ్యసభ అభ్యర్థులు వీరే

అసమ్మతి గళం విప్పిన విశ్వాస్

న్యూఢిల్లీ: రాజ్యసభ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) తన అభ్యర్థులను ఖరారు చేసింది. ఢిల్లీ అసెంబ్లీ నుంచి రాజ్యసభకు ఈ నెల 16న మూడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆ స్థానాలకు తమ అభ్యర్థులుగా సంజయ్ సింగ్, సుశీల్ గుప్తా, ఎన్‌డీ గుప్తాను ఆప్ ప్రకటించింది. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో బుధవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు 56 మంది హాజరయ్యారు. రాజ్యసభ సీటును కోరుతున్న ఆ పార్టీ నేత కుమార్ విశ్వాస్ ఈ సమావేశానికి దూరంగా ఉన్నారు. సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. పార్టీ అత్యున్నత నిర్ణాయక రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) త్వరలో సమావేశమై నిర్ణయానికి లాంఛనంగా ఆమోదం తెలపనున్నది. ఎంపికైన అభ్యర్థుల్లో సంజయ్ సింగ్ ఆప్ ఏర్పడినప్పటి నుంచి పార్టీ సభ్యుడిగా ఉన్నారు. దిల్లీ, హరియాణా ప్రాంతంలో విద్య, వైద్యాభివృద్ధికి తన వంతు కృషి చేశారు. సుమారు 15వేల మంది చిన్నారులకు ఉచిత విద్యను అందిస్తున్నారు. సుశీల్ గుప్తా ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త కాగా, ఎన్‌డీ గుప్తా ఛార్టెడ్ అకౌంటెంట్. ఢిల్లీలో ఆప్‌కు మెజార్టీ ఎమ్మెల్యేలు ఉన్న నేపథ్యంలో వీరి ఎన్నిక నల్లేరు మీద నడక కానుంది. ఈ నెల 5తో నామినేషన్లకు గడువు ముగియనుంది.

కేజ్రీవాల్‌పై ధ్వజమెత్తిన కుమార్ విశ్వాస్ : రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన కొద్దిసేపటికే ఆప్ అసమ్మతి నేత కుమార్ విశ్వాస్ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వాస్తవాలను మాట్లాడినందుకు తాను శిక్షకు గురయ్యానని చెప్పారు. రాజ్యసభ సీటును విశ్వాస్ ఆశించి భంగపడ్డారు. కేజ్రీవాల్‌తో ఒక సారి విభేదించిన తరువాత ఆప్‌లో నిలదొక్కుకోవడం చాలా కష్టమని చెప్పారు. "గడిచిన ఏడాదిన్నర కాలంగా అనేక అంశాలపై నేను వాస్తవాలు మాట్లాడాను. అరవింద్ కేజ్రీవాల్ తీసుకున్న నిర్ణయాల పైన లేదా సర్జికల్ దాడులు, టికెట్ల పంపిణీలో అక్రమాలు, పంజాబ్‌లో తీవ్రవాదుల పట్ల మెతకవైఖరి, జేఎన్‌యూ ఘటన తదితరాలపై నేను మాట్లాడిన వాస్తవాలకు ప్రతిఫలంగా శిక్షను విధించారు" అని ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ, విశ్వాస్ అన్నారు.

ఐరాస భాషగా హిందీకి నిబంధనలు అడ్డంకి

లోక్‌సభలో సుష్మ వెల్లడి



న్యూఢిల్లీ : ఐక్యరాజ్యసమితి భాషలలో ఒకటిగా హిందీని చేసేందుకు ఐక్యరాజ్యసమితి నిబంధనలు అడ్డంకిగా మారాయి. ఐరాస అధికార భాషల్లో ఒకటిగా హిందీని చేర్చేందుకు అయ్యే వ్యయం రూ. 400 కోట్లను అవసరమైతే భరించేందుకు సిద్ధంగా ఉన్నట్టు భారత్ తెలిపింది. అయితే, అటువంటి హోదాను భారత్ పొందేందుకు ఐరాస నిబంధనలు అడ్డంకిగా మారాయని విదేశీ వ్యవహారాల మంత్రి సుష్మా స్వరాజ్ బుధవారం తెలిపారు. ఐరాస నిబంధనల ప్రకారం ఐక్యరాజ్య సమితి భాషగా ఒక భాషను గుర్తించేందుకు మొత్తం 193 సభ్య దేశాలలో మూడింట రెండొంతుల సభ్య దేశాల (129) మద్దతు పొందాలని లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో ఒక ప్రశ్నకు సమాధానంగా సుష్మ తెలిపారు. ఐరాస అధికార భాషల్లో ఒకటి హిందీని చేయడంలో అయ్యే వ్యయాన్ని అన్ని సభ్యదేశాలు భరించాలన్నారు. "మూడింట రెండొంతుల సభ్య దేశాల మద్దతు పొందడం అంత కష్టమేమి కాదు. అయితే, అందుకు అయ్యే వ్యయాన్ని భరించే అంశమే సమస్య, అనేక చిన్న దేశాలు ఇందుకు సుముఖంగా లేవు, అదే ఐరాస అధికార భాషల్లో హిందీని ఒకటిగా చేయడంలో ప్రధాన అడ్డంకిగా పరిణ మించింది" అని కేంద్ర మంత్రి తెలిపారు. అయినప్పటికీ, ప్రభుత్వం తన ప్రయత్నాలను చేస్తోందని చెప్పారు. ఐక్యరాజ్య సమితి అధికార భాషల్లో హిందీని ఒకటిగా చేసేందుకు భారత్ రూ. 40 కోట్లను చెల్లిస్తోందా అని బీజేపీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం ఇస్తూ, 'అవసరమైతే రూ. 400 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. కానీ, ఐరాస నిబంధనలు అందుకు అడ్డంకిగా మారాయి" అని తెలిపారు. ఐరాస అధికార భాషగా హిందీని చేర్చేందుకు భారత్ ఎందుకు ప్రయత్నం చేస్తోంది, అది కేవలం భారత అధికార భాష మాత్రమే, జాతీయ భాష కాదని కాంగ్రెస్ పార్టీ సభ్యులు శశి థరూర్ అన్నారు. 'రేపు తమిళనాడు లేదా పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారు ప్రధానమంత్రి అయితే, ఐరాసలో హిందీలో మాట్లాడమని మనం ఎందుకు ఒత్తిడి తీసుకురావాలి" అని ప్రశ్నించారు. హిందీ కేవలం ఒకే ఒక దేశానికి అధికార భాషని థరూర్ అన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 19 మంది మృతి

సికార్/జైపూర్ : రాజస్థాన్‌లో జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో 19 మంది మృతిచెందగా, 18 మంది గాయపడ్డారు. మృతుల్లో నలుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. సికార్‌లో 1వ నెంబరు జాతీయరహదారిపై బస్సు-ట్రక్కు ఢీకొన్న ఘటనలో 11మంది మృతిచెందగా, 12 మంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. బస్సు డ్రైవర్ మరొక బస్సును ఓవర్‌టేక్ చేస్తుండగా వేగంగా వస్తున్న ట్రక్కును ఢీకొందని చెప్పారు. గాయ పడిన వారిని చికిత్స కోసం ఫతేపూర్ ఆసుపత్రికి తరలించినట్టు చెప్పారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. జైపూర్‌లో మంగళవారం రాత్రి వేరొక రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతిచెందగా, ఆరుగురికి గాయాలయ్యాయి. టెంపో-ట్రక్కును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. ఛోము పట్టణంలో వివాహ కార్యక్రమానికి హాజరై తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. గాయ పడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించినట్టు తెలిపారు.

తలాక్ బిల్లుపై కాంగ్రెస్‌ది ద్వంద్వ వైఖరి

కేంద్రమంత్రి అరుణ్ జైట్లీ



న్యూఢిల్లీ : ట్రిపుల్ తలాక్ బిల్లుపై కాంగ్రెస్ పార్టీ 'ద్వంద్వ వైఖరి' ప్రదర్శిస్తోందని బీజేపీ సీనియర్ నాయకుడు అరుణ్ జైట్లీ బుధవారం ఆరోపించారు. లోక్‌సభలో తలాక్ బిల్లుకు మద్దతు ఇచ్చిన తర్వాత రాజ్యసభలో బిల్లును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు. బీజేపీ పార్లమెంటరీ పార్టీని ఉద్దేశించి కేంద్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం బిల్లుపై చర్చను కోరుతోందన్నారు. కాగా జీఎస్‌టీ బిల్లు మాదిరిగా ఏకగ్రీవంగా ఆమోదించబడాలని పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి అనంతకుమార్ విలేకరులతో మాట్లా డుతూ చెప్పారు. 'కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి అవలంబిస్తోందని' జైట్లీని ఉటంకిస్తూ కుమార్ పేర్కొన్నారు. బీజేపీ ఎంపీల వారం సమావేశానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాలు కూడా హాజరయ్యారు. ఇదిలా ఉండగా లోక్‌సభలో మాదిరిగా రాజ్యసభలో మెజార్టీ లేకపోవడంలో ఈ బిల్లు ఆమోదం కోసం రాజ్యసభలో ప్రతిపక్షాలు, ఎన్డీయేతర పక్షాలపై ప్రభుత్వం ఆధారపడి ఉంది. కుమార్ మాట్లా డుతూ ట్రిపుల్ తలాక్ బిల్లు ఆమోదం కోసం కాంగ్రెస్, ఇతర పార్టీలతో ప్రభుత్వం మాట్లాడిందన్నారు. గతవారం లోక్ సభలో ముస్లిం మహిళ (వివాహ హక్కుల రక్షణ) బిల్లు ఆమోదం పొందిం ది. సామాజిక న్యాయ, సాధికారత మంత్రి తవార్ చాంద్ గెహ్లాట్ ఈ బిల్లుకు సంబంధించిన అంశాలను ఎంపీలకు వివరించారు. మైనార్టీ వ్యవహారాల మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ మాట్లాడుతూ 45 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయసు కలిగిన మహిళకు 'మెహరం'(పురుషుని రక్షణ లేకుండా) హజ్ యాత్రకు వెళ్లేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తప్పుడు ప్రచారం చేస్తోందని ఆయన అన్నారు.

ఇకపై గోనె సంచుల్లోనే ఆహార ధాన్యాల ప్యాకింగ్

న్యూఢిల్లీ : ఈ ఏడాది చివరినాటికి ఆహారధాన్యాలు, పంచదారను గోనెసంచుల్లోనే ప్యాకింగ్ చేయడాన్ని తప్పని సరి చేస్తూ ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఈఏ) నిర్ణయం తీసుకుంది. దీంతో జౌళి పరిశ్రమకు ఊతం అందించినట్లవుతుందని, పశ్చిమ బెంగాల్, బీహార్, ఒడిశా, అసోం, ఆంధ్రప్రదేశ్, మేఘాలయ త్రిపురలో అనేక మంది ఉపాధిపొందుతారని కమిటీ ప్రకటించింది. 1987 చట్ట ప్రకారం ఇది తప్పని సరని అధికారిక ప్రకటనలో పేర్కొంటూ, నిబంధనల ప్రకారం 90 శాతం ఆహారధాన్యాలు, 20 శాతం పంచదార గోనేసంచుల్లో సరఫరా చేయడం తప్పనిసరని తేల్చి చెప్పింది. జౌళి పరిశ్రమ ప్రభుత్వంపై ఆధారపడి ఉందని, ఏడాదికి రూ. 5,500 కోట్ల ఖరీదు గోనె సంచులను కొంటుందన్నారు. ఈ పరిశ్రమపై 3.7 లక్షల మంది కార్మికులు 40 లక్షల మంది రైతులు ఆధారపడ్డారని ప్రకటన తెలిపింది. బంగ్లాదేశ్, నేపాల్‌ల నుంచి దిగుమతి అయ్యే గోనెసంచులపై పన్ను విధించడం ద్వారా మరో 2 లక్షల మెట్రిక్ టన్నుల జూట్ సంచులను దేశీయంగా ఉత్పత్తి చేయవచ్చని ప్రకటన పేర్కొంది.




2300 మదరసాలకు చెక్

యూపీ ప్రభుత్వం కుట్ర

జనవరి చివర్లోగా చర్యలు

రాష్ట్ర మంత్రి చౌదరి



లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని దాదాపు 2,300 మదరసాల ప్రభుత్వ గుర్తింపును రద్దు చేసే యోచనలో యూపీ సర్కార్ ఉంది. ఉత్తరప్రదేశ్ మదరసా బోర్డు వెబ్‌సైట్‌లో వివరాలను నమోదుచేసుకోని మదరసాల గుర్తింపును రద్దు చేసే అవకాశమున్నట్టు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ మంత్రి లక్ష్మినారాయణ్ చౌదరి బుధవారం వెల్లడించారు. ఆయా మదరసాలను నకిలీవిగా పరిగణించి, తగు చర్యలు తీసుకోవచ్చునన్నారు. 'యూపీ మదరసా బోర్డు కింద గుర్తింపు పొందిన మదరసాలు 19,108 ఉన్నాయి. వీటిలో 16,808 మదరసాల వివరాలు బోర్డు వెబ్‌సైట్‌లో ఉండగా 2,300 మదరసాల వివరాలు లెవు. అసలు ఈ మదరసాలు ఎక్కడున్నాయి 2,300 మదరసాలకు సంబంధించి ఒక్క విద్యార్థిగానీ, టీచర్, ప్రిన్సిపాల్ లేదా మేనేజర్‌గానీ సంప్రదించక పోవడం ఆశ్చర్యకరం. దీంతో వీటిని నకిలీ విగా పరిగణిస్తున్నాం. ఈనెలాఖరులోగా వీటిపై చర్యలు తీసుకుంటాం' అని పీటీఐ కిచ్చిన ఇంటర్వ్యూలో చౌదరి వెల్లడించారు. ప్రభుత్వ గుర్తింపుగల మదరసాలు ఎలాంటి ఇబ్బందులున్నా ప్రభుత్వాన్ని ఆశ్రయించి, తమ సమస్యలను వెల్లడించవచ్చునని.. వాటికి పరిష్కారం చూపేందుకు యత్నిస్తామని మంత్రి చెప్పారు. ఆ మదరసాల విద్యార్థులు అన్ని పరీక్షలకు హాజరవ్వొచ్చునని తెలిపారు. మదరసాలలో సరైన విద్యావ్యవస్థ ఉండాలన్నదే సర్కార్ ఉద్దేశమని, దీన్ని ప్రతిపక్షాలు అనవసరంగా రాద్ధాంతం చేస్తూ, రాజకీయ రంగు పులుము తున్నాయని విమర్శించారు. మదరసా టీచర్లకు వేతనాలు అందకపోవడంపై స్పందిస్తూ ' రాష్ట్రంలో 560 ప్రభుత్వ మదరసాలున్నాయి. వీటన్నింటికి అవసరమైన నిధులను ప్రభుత్వం సమకూరుస్తోంది. 46 మదరసాలలో 298 మంది టీచర్లు, సిబ్బందికి వివిధ కారణాల వల్ల వేతనాలు అందలేదు. ఆ గొడవను నెలరోజుల్లోగా పరిష్కరించాలని శాఖ డైరెక్టర్‌ను ఆదేశించాం. గొడవ సర్దుమణిగిన తర్వాత సిబ్బందికి వేతనాలు అందుతాయి' అని మంత్రి చౌదరి వివరించారు. ఎవరి జీతాన్ని నిలిపివేయడం ప్రభుత్వ ఉద్దేశం కాదన్నారు. మదరసా బోర్డు రిజిస్ట్రార్ రాహుల్‌గుప్తా మాట్లాడుతూ 'శాఖ వెబ్‌సైట్‌లో మదరసాల వివరాలను నమోదు చేసుకునే గడువు ప్రస్తుతానికి ముగిసిందని తెలిపారు.

శాటిలైట్‌తో లోకోమోటివ్ అనుసంధానం

న్యూఢిల్లీ : ఇస్రో ఉపగ్రహంతో అన్ని లోకోమోటివ్‌లు అనుసంధానం అయ్యేందుకు డిసెంబర్ 2018 తుది గడువని రైల్వే శాఖ తెలిపింది. అనుసంధానం ద్వారా రైలు సిబ్బంది ఎక్కడున్నారు, ఏం చేస్తున్నారనేది తెలుస్తుందని రైల్వే అధికారి తెలిపారు.దాదాపు 10, లోకోమోటివ్‌లపై అంటెన్నాలు అమర్చుతున్నాట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం 10 లోకోలపై ట్రయల్ రన్ నిర్వహించామన్నారు.

ఒడిశాకు రూ.372.51 కోట్ల నాబార్డ్ నిధులు

భువనేశ్వర్(ఒడిశా) : గ్రామీణ మౌలికసదుపాయాల అభివృద్ధి నిధులు కింద ఒడిశాకు నీటి పారుదల, గ్రామీణ వంతెనల ప్రాజెక్ట్ నిర్మాణం కోసం నాబార్డ్ రూ. 372.51 కోట్ల నిధులను విడుదల చేసింది. బోరు పంపులు, నీటి గొట్టాల బావులు లాంటి దాదాపు 17,322 లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టలను రూ. 130.17 కోట్ల నిధులతో రూపొందించాల్సివుంటుందని బ్యాంక్ అధికారి తెలిపారు. దాదాపు 40 వేల రైతులు, 36,440 హెక్టార్ల వ్యవసాయ భూమికి ఈ నిధులు ఉపయుక్తంగా ఉండేదుకు ఈ నిధులు ఉపయోగించనున్నారని ఆయన పేర్కొన్నారు.

ఎంపీలో రాష్ట్రపతి, ప్రధాని పర్యాటన

భోపాల్(మధ్యప్రదేశ్): ఈ నెల 7, 8 తేదిల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు మధ్యప్రదేశ్ రానున్నారు. చిత్రకూట్‌లో 8న రాష్ట్రపతి వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ప్రధాని మోడీ 7న గ్వాలియర్‌లోని టెకన్‌పూర్‌లో జరిగే రాష్ట్ర పోలీసు వార్షిక సమావేశంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాలను మధ్యప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి బసంత్ ప్రతాప్ సింగ్ పర్యవేక్షిస్తున్నారు.

సీఆర్పీఎఫ్ జవాను మృతి

ఔరంగబాద్(బీహార్) : మావోయిస్టులతో జరిగిన కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన సీఆర్పీఎఫ్ జవాను మృతి చెందాడని పోలీసులు తెలిపారు. మదన్‌పూర్ స్టేషన్ పరిధిలోని చకర్‌బందా అడవుల్లో మావోయిస్టులతో జరిగిన ఎన్‌కౌంటర్‌లో 205 కోబ్రా బెటాలియన్‌కు చెందిన ఆశిష్ పాత్రా(28) గాయాలు పాలై, రాంచీలోని ఆసుపత్రిలో చేరాడని ఔరంగాబాద్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి పీఎన్ సాహూ పేర్కొన్నారు. తలపై బులెట్ గాయంతో ఆసుపత్రిలో చేరిన ఆశిష్ మరణించాడని ఆయన తెలిపారు.

మర్యాదలు పాటించండి : అన్నాడీఎంకే

చెన్నై(తమిళనాడు) : వచ్చే వారం ఆరంభంకానున్న శాసనసభ సమావేశాల్లో అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు మర్యాదలు పాటించాలని ఆ పార్టీ నేతలు ఓ.పన్నీర్ సెల్వం, కే.పళనిస్వామి పార్టీ సమావేశంలో ఉద్బోధించారు. ఆ సమావేశంలో 103 ఎమ్మెల్యేలు హాజరైయారని, ఏడుగురు వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేకపోయారని అన్నాడీఎంకే సీనియర్ నాయకుడు తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు క్రమశిక్షణతో మెలగాలని ఆయన అన్నారు.

సావిత్రీబాయి పూలేకు మోడీ నివాళి

న్యూఢిల్లీ : సాంఘిక సంఘసంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతు సమాజంలోని అట్టడుగు వర్గాల సాధికారత కోసం ప్రభుత్వం విరామం లేకుండా శ్రమిస్తుందని ఆయన పేర్కొన్నారు. విద్యకు, సాంఘిక సంస్కరణకు ఆమె ఎంతో ప్రాముఖ్యత నిచ్చారని ప్రధాని అన్నారు. ఆమె ఆదర్శాలకు కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు.

కుప్పకూలిన మిగ్ విమానం

పనాజి(గోవా): భారత నావికాదళానికి చెందిన మిగ్ 29కె విమానం కుప్పకూలింది. అయితే ఎలాంటి ప్రాణ హాని జరగలేదు. ప్రయాణం ఆరంభించిన విమానం ఆకస్మికంగా రన్‌వేపై నుంచి దిశను మార్చుకొని ఒక్కసారిగా కుప్పకూలిందని అధికారులు తెలిపారు. శిక్షణలో ఉన్న పైలట్ చాకచక్యంగా ప్రమాదం నుంచి తప్పించుకున్నాడని వారు వెల్లడించారు. ఈ దుర్ఘటన వల్ల విమానాశ్రయంలో ఇతర విమాన రాకపోకలకు అంతరాయం కల్గిందని గోవా విమానాశ్రయం అధికారి బీసీహెచ్ నేగీ తెలిపారు.

కిరణ్ బేడికి పుదుచ్చేరి సీఎం ప్రశంస

న్యూఢిల్లీ: పాండిచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌ను ముఖ్యమంత్రి వీ.నారాయణ స్వామి ప్రశంసించారు. ఎప్పుడూ పలు విషయాలపై గొడవ పడుతుండే ఇలా వ్యవహరించడంతో పలువురు ఆశ్చర్యం పొందారు. నూతన సంవత్సర వేడుక సందర్భంగా శాంతి, భద్రతలను కాపాడటంలో లెఫ్టినెంట్ గవర్నర్ కిరణ్ బేడి సహరించారని పాండిచ్చేరి ముఖ్యమంత్రి నారాయణసామి ప్రశంసించారు. కొన్ని విషయాలపై విరుద్ధ సిద్ధాంతాలున్నాయని, అయితే శాంతి, భద్రతల విషయంలో కిరణ్ బేడి ఎంతో సహకరించారని ఆయన అన్నారు.

రాజ్యసభకు కేంద్ర మంత్రి నామినేషన్

లక్నో(ఉత్తరప్రదేశ్) : కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి బీజేపీ సభ్యుడిగా బుధవారం రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభ సీటుకు రాజీనామా చేసి, గోవా ముఖ్యమంత్రిగా మనోహర్ పారికర్ పదవి చేపట్టడంతో ఈ రాజ్యసభకు సీటుకు ఏర్పడింది. దౌత్యాధికారిగా ఉండి, ఆ తర్వాత రాజకీయనాయకుడుగా మారిన 65 ఏళ్ల పూరీ సెప్టెంబర్‌లో హౌసింగ్, అర్బన్ అభివృద్ధి శాఖ మంత్రిగా నియమితులయ్యారు.

అనుమానాస్పద వ్యక్తి అరెస్టు

థానే(మహారాష్ట్ర) : థానేలో ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు అరెస్టు చేశారు. జమ్మూకాశ్మీర్‌కు చెందిన షౌకత్ అహ్మద్ కసం కతనం సయ్యద్(35) అనే వ్యక్తి థానేలోని కోల్‌షెట్‌లో నిషిద్ధ ప్రాంతమైన ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ గోడ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతుంటే అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. అరెస్టు అయిన షౌకత్ మతిస్థిమితం లేని వ్యక్తి అని ఏంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ అధికారి తెలిపారు.

ఆధార్ బిల్లుకు కర్ణాటక ఆమోదం

బెంగళూరు(కర్ణాటక) : ప్రభుత్వ సబ్సిడీలను పొందేందుకు ఆధార్ తప్పనిసరి చేస్తూ రూపొందించిన బిల్లుకు కర్ణాటక కేబినెట్ మంత్రులు ఆమోదం తెలిపారు. పార్లమెంట్ ఇదివరకే ఆమోదించిన 'ఆధార్ బిల్లు-2016'ను కేబినెట్ ఆమోదించిందని కేంద్ర న్యాయ, పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి టీబీ. జయచంద్ర తెలిపారు. 2016లో పార్లమెంట్‌లో ఈ బిల్లు ఆమోదం కోసం ప్రవేశ పెట్టినప్పుడు కాంగ్రెస్, ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసన వచ్చింది. కర్ణాటక శాసనసభ సమావేశాలు ఫిబ్రవరి 2 నుంచి 9 వరకు జరగనున్నాయి.

బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

ముజఫర్‌నగర్ (ఉత్తరప్రదేశ్) : బీజేపీ ఎమ్మెల్యే విక్రం సైనీ మళ్లీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్ కేవలం హిందువులదని, అందుకే భారత్‌ను హిందుస్థాన్ అని పిలుస్తారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ముజఫర్ నగర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బాధ్యతారహితులైన కొందరు భారత్‌లోకి ముస్లింలకు అనుమతి ఇచ్చారని ఆయన వ్యాఖ్యానించారు. ఆవులను వధించిన వారి పక్కెటెముకలు విరిచేయాలంటూ విక్రంసైనీ గత ఏడాది వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు.

ఏడుగురు మావోయిస్టులు అరెస్టు

రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్) : మవోయిస్టుల ప్రాబల్యం ఉన్న సుక్మా జిల్లాలో బుధవారం ఏడుగురు మావోయిస్టులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. స్పెషల్ టస్క్ ఫోర్స్, జిల్లా రిజర్వ్‌డ్ దళాలు, సీఆర్పీఎఫ్, కోబ్రా దళాలు సంయుక్తంగా జరిపిన తనిఖీలో ఈ మావోయిస్టులను అదుపులోకి తీసుకున్నట్టు ఛేల్జి పోలీసు స్టేషన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు సుందరాజ్ తెలిపారు. పట్టుబడిన మావోయిస్టులు డీఏకేఎంఎస్ గ్రూప్‌కు చెందిన వారని ఆయన పేర్కొన్నారు.



రిమాండుకు మసీదు మౌజాన్ హంతకుడు

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన లాలాచెరువు మసీదు మౌజాన్ హత్యకేసులో నిందితుడు ఆర్మగం మణిరత్నం అలియాస్ మణిని అర్బన్ జిల్లా పోలీసులు బుధవారం సాయంత్రం రిమాండుకు పంపించారు. తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అర్బన్ ఎస్పీ బి.రాజకుమారి కేసు వివరాలు వెల్లడించారు. గుంతకల్లుకు చెందిన మణిరత్నం గత నెల 28వ తేదీ రాత్రి గతంలో దొంగిలించిన వెండివస్తువులను తీసుకుని ఖర్చుచేసేందుకు నగరాని కి వచ్చాడు. రైల్వేస్టేషన్ నుంచి లాలాచెరువు వచ్చి అక్కడే మద్యం సేవించాడు. రాత్రి సమయంలో మసీదులో డబ్బు దొంగిలించేందుకు నిర్మాణంలో ఉన్న ఒక ఇంట్లో నుంచి కర్ర తీసుకుని మసీదు గోడ దూకాడు. అక్కడ పడుకుని ఉన్న మౌజాన్ మొహ్మద్ ఫరూక్‌ను సర్వేకర్రతో అతి దారుణంగా తలపై కొట్టాడు. ఆతర్వాత అతని జేబులోని తాళాలతో మసీదులోపలకు ప్రవేశించాడు. అక్కడ ఉన్న హుండీలు పగలకొట్టి డబ్బు దొంగిలించాడు. ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు, సాక్ష్యాలు లేకుండా చేసేందుకు అక్కడ ఉన్న కార్పెట్‌ను తగులబెట్టాడు. అదే సమయంలో మౌజాన్ మూల్గు విని మరోసారి అదేకర్రతో కొట్టిచంపాడు. అక్కడి నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకుని దుస్తులు మార్చుకుని గుంతకల్లు వెళ్ళిపోయాడు. 29వ తేదీన మసీదులో మౌజాన్ హత్య ఘటన వెలుగులోకి రావడంతో తాము అక్కడకు చేరుకుని సాక్ష్యాధారాలు సేకరించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. రాష్ట్రంలోని పోలీసు అధికారుల సహకారంతో నిందితుడి వేలిముద్రల ఆధారంగా కేసు చిక్కుముడి త్వరితగతిన వీడిందన్నారు. మణిరత్నం చిన్నవయసు నుంచే నేరప్రవృత్తికి అలవాటుపడి, చిన్న మొత్తాల కోసం కూడా హత్యలు చేశాడని, నేరం చేసే సమయంలో అమాయక ప్రజలను చంపడానికి వెనకాడడని, అదేవిధంగా సాక్ష్యాధారాలు దొరకకుండా వాటిని నాశనం చేయడం ద్వారా ఇప్పటివరకు కేసుల నుంచి బయటపడుతున్నాడన్నారు. నవంబరు 22న విద్యుత్ కాలనీలో వినాయకుడి గుడిలో చొరబడి హుండీ పగులకొట్టి వెండి వస్తువులు, నోట్లు, చిల్లర దొంగిలించి వాటిని రోడ్డుకు అవతల ఉన్న జీడిమామిడి తోటల్లో పాతిపెట్టి అక్కడ్నుంచి గుత్తికి పరారయ్యాడన్నారు. ఈకేసు ప్రకాష్‌నగర్ పోలీసుస్టేషన్‌లో నమోదైందన్నారు. ఈ కేసును ప్రభుత్వం, పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అన్ని విభాగాల పోలీసుల సహకారంతో కేసు ఛేదించడమైందని, కేసు దర్యాప్తులో పాల్గొన్న అందరికీ రివార్డులు ఇస్తామన్నారు. సంచలన కేసుల దర్యాప్తుకు సమయం పడుతుందని, ప్రజలంతా సంయమనం పాటించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ(అడ్మిన్) రజనీకాంతరెడ్డి, అడిషనల్ ఎస్పీ సయిం అస్మీ, తూర్పుజోన్ డీఎస్పీ యు.నాగరాజు, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై 23న సమ్మె

విశాలాంధ్ర - గుంటూరు సిటీ : కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై కార్మిక వర్గం యావత్తు ఉద్యమించడానికి ఈ నెల 23న సమ్మెను ప్రకటించడమైందని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చలసాని వెంకటరామారావు తెలిపారు. గుంటూరు మల్లయ్యలింగంభవన్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు వేముల వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చలసాని వెంకట రామారావు మాట్లాడుతూ ఎన్నో పోరాటాల ద్వారా సాధించిన హక్కులను ఈ ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. వాటికి వ్యతిరేకంగా కార్మికలోకం మొత్తం ఏకతాటిపై నడుస్తుందన్నారు. ఈ నెల 7వ తేదీన విజయవాడలోని గొల్లపూడిలో ఏఐటీయూసీ రాష్ట్ర సమితి కార్యాలయం ప్రారంభోత్సవం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని వెల్లడించారు. ఏఐటీయూసీ నాయకులు, కార్మికవర్గం యావత్తు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెలుగూరి రాధాకృష్ణమూర్తి, నాయకులు చల్లా చిన ఆంజనేయులు, జి.సురేష్‌బాబు, కోట మాల్యాద్రి, రావుల అంజిబాబు, ఏ.మారుతీవరప్రసాద్, బూదాల శ్రీను, కంబాల శ్రీనివాస్, ఆలూరి రమణయ్య, ఎల్.శాంతి, జె.హెల్డాఫారెన్స్, కె.శైలజ, వరహాలు, పుప్పాల సత్యనారాయణ,



కాసా సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

అనంతలో సాగునీటి కష్టాలకు చెక్ !

- హెచ్చెల్సీ ఆయకట్టుకు సకాలంలో నీటిసరఫరా
- జలాశయాల్లో నిండుగా నీటినిల్వలు
- ఆదుకున్న హంద్రీనీవా, రైతుల్లో ఆనందోత్సాహాలు
- రబీలో లక్ష ఎకరాల్లో వరి, ఇతర పంటల సాగుకు అవకాశం

విశాలాంధ్ర - కళ్యాణదుర్గం : దశాబ్దకాలంగా ఎన్నడూ లేనంతగా నీటినిల్వలు అనంతపురం జిల్లా రైతాంగాన్ని ఊరిస్తున్నాయి. జలాశయాల్లో నిండుగా చేరుకున్న నీటినిల్వలకు తోడు హంద్రీనీవా, హెచ్చెల్సీ కాలువల ద్వారా నేటికీ నీటిసరఫరా అవుతుండగా భవిష్యత్తులోనూ నీటిప్రవాహం ఉంటుందనే సంకేతాల నేపథ్యంలో అనంతపురం జిల్లాలోని హెచ్చెల్సీ, పీఏబీఆర్, ఎంపీఆర్, సీబీఆర్, చాగల్లు, పెండేకల్లు, జీడిపల్లి జలాశయాల కింద ఆయకట్టు రైతుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. ఎన్నోఏళ్లుగా ఎదురుచూసిన నీటినిల్వలు ఈ ఏడాది కొంతలో కొంత ఆశలు రేపుతున్నాయి. ఏటా వరి నారుమళ్లు పోసుకునే సమయానికే హెచ్చెల్సీలో నీటికొరత ఏర్పడేది. దీంతో అధికారులు కూడా ఆరుతడి పంటలు పెట్టుకోవాలని ప్రోత్సహించేవారు. చివరి ఆయకట్టుకు నీరందక ఆరుతడి పంటలు కూడా పండేవికాదు. అయితే ఈ రబీలో అలాంటి పరిస్థితి లేదని రైతులు అంటున్నారు. వరినారుమళ్లు నాట్లుపడిన నేపథ్యంలో మరో రెండు,


నిండుగా నీటితో కళకళలాడుతున్న గొల్లపల్లి రిజర్వాయర్

మూడు నెలల వ్యవధిలో పంటకోతలు పూర్తి అవుతాయని, ఉన్న నీటినిల్వలు సరిపోతాయనే మనోధైర్యంతో ఉన్నారు. హెచ్చెల్సీ ఆయకట్టుకింద 40వేల ఎకరాల్లో ఇప్పటికే వరినాట్లు పడ్డాయి. మరో 45 వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు వేసుకున్నారు. జిల్లా ప్రజలకు తిండిగింజలకు తోడు, పశుగ్రాసం కొరత తీర్చడానికి హెచ్చెల్సీ ఆయకట్టు సరిపోతుందని ఈ ప్రాంత రైతులు అంటున్నారు. హెచ్చెల్సీ, హంద్రీనీవా ద్వారా ఇప్పటివరకు జిల్లాలోని జలాశయాలకు 20 టీఎంసీలకు పైగా నీరు చేరింది. ఈ నీటిని కొంత వాడుకున్నా, తాగునీటి అవసరాలకు అనుగుణంగా నిల్వఉంచుతున్నారు. హెచ్చెల్సీ కాలువల ద్వారా తుంగభద్ర నుండి 14.215 టీఎంసీల నీరు చేరినట్లు రికార్డులు చెప్తున్నాయి. హంద్రీనీవా నుండి కూడా 14.967 టీఎంసీల నీరున్నట్లుగా గణాంకాలున్నాయి. పీఏబీఆర్‌లో 4.181 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 2.375 టీఎంసీలు, సీబీఆర్‌లో 4.238 టీఎంసీలు, జీడిపల్లిలో 1.398 టీఎంసీలు, పెండేకల్లులో 0.321 టీఎంసీలు, చాగల్లులో 0.753 టీఎంసీల నీటిని నిల్వ ఉంచారు. ఈ నీటిలో కొంత భాగాన్ని ఇప్పటికే వాడుకున్నా అధిక మొత్తం నీటినిల్వలు అందుబాటులో ఉన్నాయి.

తాగునీటికి ఢోకా లేదు : వచ్చే వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి కష్టాలు ఉండకూడదని జిల్లా యంత్రాంగం ముందస్తు ఏర్పాట్లు చేసింది. అవసరాలకు తగినట్లుగా ఆయా జలాశయాల్లో నీటినిల్వ ఉంచుకుని శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటిపథకం, అనంతపురం కార్పొరేషన్ తాగునీటి పథకం, రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ, కళ్యాణదుర్గం, పుట్టపర్తి, ధర్మవరం, హిందూపురం, మడకశిర నియోజకవర్గాలకు తాగునీటి కోసం సుమారు 10 టీఎంసీల నీటిని అందుబాటులో ఉంచింది. ఏటా వర్షాభావంతో అరకొరగా వచ్చే తుంగభద్ర నీళ్లు అనుకున్న మేరకు రావడంతో ఇబ్బందులు తొలగిపోయినట్లు యంత్రాంగం భావిస్తోంది. శ్రీశైలం బ్యాక్‌వాటర్ కూడా హంద్రీనీవా కాలువల ద్వారా నేటికీ సరఫరా అవుతోంది. ఈనెలాఖరు వరకు నీటిసరఫరా ఉండొచ్చని అంచనాతో ఉన్నారు. చెరువులు, కుంటలకు గత అక్టోబరులో కురిసిన వర్షాలకు వర్షం నీరు చేరడంతో గ్రామీణ ప్రాంతాల్లోని చేతిపంపులు, రక్షిత నీటి పథకాల బోరుబావుల్లో కూడా సమృద్ధిగా నీరు వస్తుండటంతో వచ్చే ఆర్నెల్ల పాటు తాగు, సాగునీటి కష్టాలకు చెక్ పడినట్లేనని, అయితే నీటిని పొదుపుగా వాడుకోకపోతే కష్టాలు తప్పవని కూడా రైతుసంఘాల నాయకులు జిల్లా యంత్రాంగాన్ని హెచ్చరిస్తున్నారు.



మహిళల హక్కుల సాధనకు కృషి

విశాలాంధ్ర - తిరుపతి (కార్పొరేషన్) : ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింపులోకి వస్తే మహిళలకు ప్రత్యేక అలవెన్స్‌ల కోసం పోరాడుతామని సంఘం నాయకులు హామీ ఇచ్చారు. తిరుపతి గంధమనేని శివయ్య భవన్‌లో ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డాక్టర్ గుణమాధురి పాల్గొన్నారు. న్యాయవాది శాంతి మాట్లాడుతూ మహిళల హక్కులు, మహిళల పట్ల పెరుగుతున్న వివక్షను, విధి విధానాలను తెలిపారు. ఏపీ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు జయలక్ష్మి మాట్లాడుతూ మహిళలకు ఎలాంటి కష్టాలు ఎదురైనా ఏఐటీయూసీ ముందుండి సమస్యలు పరిష్కరిస్తుందన్నారు. ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రకాష్ మాట్లాడుతూ గుర్తింపు ఉన్న సంఘం మహిళలకు అనేక హామీలిచ్చి అమలు చేయకపోగా మహిళా ద్రోహులుగా గుర్తింపు పొందాయన్నారు. ఎంప్లాయీస్ యూనియన్‌ను వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే అనేక అవకాశాలు కల్పిస్తామని, అనారోగ్యంతో ఉన్న మహిళలకు ఓటీలు, స్పెషల్ అలవెన్స్‌లు ప్రతి మహిళకు అందేలా చేస్తామని తెలిపారు. జిల్లాలోని అన్ని ఆర్‌టీసీ డిపోల నుంచి 300 మంది మహిళలు హాజరయ్యారు. ఈ సదస్సులో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎ.రామానాయుడు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మురళి, డి.జె.నాథం, మస్తాన్ పాల్గొన్నారు.

వాగ్దానాల ముఖ్యమంత్రి చంద్రబాబు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ

విశాలాంధ్ర - పామూరు : ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబులు ప్రజలకు చేసింది ఏమీ లేదని మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ విమర్శించారు. సీపీఐ ప్రకాశంజిల్లా కనిగిరి నియోజకవర్గ ద్వితీయ మహాసభలు బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద ఎస్‌డీ మౌలాలి అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు రాజధాని నిర్మాణం పేరుతో దేశదేశాలు తిరుగుతూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వచ్చి మూడున్నర సంవత్సరాలైనా వర్షం వస్తే కారిపోయే భవనాలు తప్ప శాశ్వత భవనాన్ని నిర్మించలేకపోయారన్నారు. మూడు పంటలు పండే పంట పొలాలను బీడు భూములుగా మార్చిన ఘనత చంద్రబాబుదని అన్నారు. పోలవరం, అమరావతి జపం చేస్తూ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారే తప్ప సామాన్య ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలు చేయలేదని రామకృష్ణ విమర్శించారు. 100 రోజుల్లో




విదేశీబ్యాంకుల్లో దాగివున్న 70 లక్షల కోట్ల రూపాయల నల్లడబ్బును తెచ్చి ప్రతి అకౌంట్‌కు రూ. 15లక్షలు వేస్తానన్న ప్రధాని నరేంద్రమోడీ అధికారంలోకి వచ్చి మూడేళ్లయినా నల్లడబ్బును ఎందుకు తీసుకురాలేకపోయారని రామకృష్ణ ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వంలో దళిత మైనార్టీలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. భజరంగదళ్, ఆర్ఎస్ఎస్ వంటి మతోన్మాదులు పేట్రేగిపోతున్నారని ఆయన అన్నారు. గోరక్షణ దళాల పేరుతో దళిత మైనార్టీలపై దాడులు పెరిగాయని అన్నారు. దాడులను ఖండిస్తూ నిర్భయంగా రాసిన జర్నలిస్టులు, రచయితలు సినిమా నటులపై కూడా దాడులు పెరిగాయన్నారు. రాబోయే కాలంలో ప్రజలను సమీకరించి కేంద్ర ప్రభుత్వాలు చేసే అన్యాయాలపై 2018ని పోరాటాల సంవత్సరంగా నిర్ణయించుకుంటామని అన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆర్ . వెంకయ్య మాట్లాడుతూ, ప్రకాశం జిల్లాకు నందికొండ జలాల కోసం పోరాటాలు చేసిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీదేనన్నారు. ప్రకాశం జిల్లాలో పశ్చిమ ప్రాంత సాగు, తాగునీటికి పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టే శరణ్యమన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలను సమీకరించి ప్రాజెక్టు సాధన కోసం ఉద్యమిస్తామన్నారు. ఈ సభలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె. అరుణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎంఎల్ నారాయణ ప్రసంగించారు. సభలో జిల్లా ప్రజానాట్యమండలి గాయకులు ఆలపించిన విప్లవగేయాలు అలరించాయి.

ఈ కార్యక్రమంలో సీపీఐ కనిగిరి నియోజకవర్గ కార్యదర్శి వై. రవీంద్రబాబు, సీపీఐ పామూరు, సీఎస్‌పురం, పీసీ పల్లి మండల కార్యదర్శులు నీరుకట్టు నాయబ్‌రసూల్, వై పెద్దమస్తాన్, మాలకొండయ్య, సీపీఐ కందుకూరు మండల కార్యదర్శి బాలకొండయ్య, సీపీఐ కనిగిరి మండల కార్యదర్శి యాసిన్, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

కియా మోటర్స్ ఇండియా

ఎమ్‌డీ, సీఈవోగా షిమ్



విశాలాంధ్ర- అనంతపురం అర్బన్ : కియా మోటర్స్ ఇండి యా మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జి క్యూటివ్ ఆఫీసర్‌గా కుక్ హుస్ షిమ్‌ను నియమించినట్లు కియా మోటర్స్ ఇండి యా బుధవారం ప్రకటించింది. ఈ నియామ కం తక్షణం అమల్లోకి వస్తుందని ఆ సంస్థ పేర్కొంది. భారత మార్కెట్‌లో కియా మోటార్స్ విస్తరణకు షిమ్ బాధ్యత వహించనున్నారు. భారత్‌లో కేఎంఐ నిర్మిస్తున్న తొలి తయారీ కేంద్రం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం జరిగేలా, అనుకున్న సమయంలో అవి పూర్తయ్యేలా చూడటంలో షిమ్ కీలక భూమి పోషిస్తారు. ప్రపంచ ఆటోమోటివ్ అయిదో స్థానంలో ఉన్న భారత్‌లో కియా మోటర్స్ బలోపేతానికి ఆయన కృషి చేయనున్నారు. భవిష్యత్‌లో భారత్ అభివృద్ధికి పెట్టుబడులు పెట్టేందుకు కియా మోటర్స్ అండగా నిలువనుంది. 58 ఏళ్ల షిమ్‌కు ఆటోమోటివ్ రంగంలో 30 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది.

డాక్టర్ నిర్లక్ష్యంతో పురిటిబిడ్డ మృతి



విశాలాంధ్ర - బుచ్చిరెడ్డి పాళెం : వైద్యుల నిర్లక్ష్యానికి పురిటిబిడ్డ బలైంది. అత్యవసర చికిత్స కోసం నెల్లూరుకి వెళ్తామన్నా సాధారణ కాన్పు చేస్తానంటూ భరోసా ఇచ్చిన డాక్టరే తన నిర్లక్ష్యంతో పురిటి బిడ్డను బలి గొన్న ఘటన నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంలోని మోహన్‌బాబు హాస్పిటల్‌లో జరిగింది. బిడ్డ తల్లిదండ్రుల వివరాల మేరకు దగదర్తి మండలంలోని లింగాల పాడుకు చెందిన ముద్దేల మల్లికార్జున్ తన భార్య పుష్పలతను కాన్పు కోసం బుచ్చిరెడ్డిపాళెంలోని మోహన్‌బాబు హాస్పిటల్‌కు మంగళవారం ఉదయం తీసుకు వచ్చారు. నొప్పులు ఎక్కువ రావడంతో డాక్టర్‌ను సంప్రదించగా ప్రసవ సమయం లో ఇచ్చే ఇంజక్షన్ ఇచ్చారని చెప్పారు. ఆ ఇంజక్షన్ వేసిన గంట లేక రెండు గంటల్లో కాన్పు చేయాల్సి ఉండగా అస్సలు పట్టించుకోలేదన్నారు. నొప్పులు అధికమై పుష్పలత పెద్ద పెద్దగా అరవటంతో భర్త, బంధువులు భయపడి డాక్టర్‌ను ఆపరేషన్ చేసేయండని లేకుంటే మెరుగైన చికిత్స కోసం నెల్లూరు తీసుకెళ్తామని మొరపెట్టుకున్నారు. ఏం భయంలేదు సాధారణ కాన్పు చేస్తాను అని డాక్టర్ హామీ ఇచ్చిందన్నారు. రాత్రికి కాన్పు చేయు సమయంలో డాక్టర్ అందుబాటులో లేదని ఇంట్లో ఉందని, అక్కడ పనిచేసే నర్సులు తన భార్యకు కాన్పు చేశారని మల్లికార్జున తెలిపారు. పుట్టిన మగ శిశువు ఏడ్వలేదని నర్సులు ఇంట్లో ఉన్న డాక్టర్‌కు చెప్పగా దాదాపు 15 నిమిషాల తర్వాత డాక్టర్ వచ్చిందన్నారు. అప్పటికే శిశువు ఉమ్మనీరు తాగడంతో చనిపోయాడని మల్లికార్జున తెలిపారు. కాన్పు జరిగిన గంటకు కూడా బిడ్డను చూపించకపోయేసరికి మల్లికార్జున అక్క కామాక్షమ్మ, అవ్వ కలిసి గది తలుపులు గట్టిగా కొట్టగా అప్పుడు నర్సులు శిశువును తలక్రిందులుగా పెట్టి తడుతూ ఏడ్వటం లేదని చెప్పారన్నారు. అప్పటికే శిశువు చనిపోయిందన్నారు. తమకు జరిగిన అన్యాయం ఇంకెవరికీ జరగకూడదని మంగళవారం అర్ధరాత్రి పోలీసు స్టేషన్‌కు వెళ్లిన మల్లికార్జున్ బంధువులకు అక్కడ పోలీసులు పెద్ద షాక్ ఇచ్చారు. కేసు నమోదు చేయకపోగా, డాక్టర్‌తో రాజీ కాకుంటే రమ్మని చెప్పారని ఆవేదన వ్యక్తం చేశాడు.

రూ. లక్షకు రాజీ చేసిన పెద్దలు : పురిటి బిడ్డను కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న తల్లిదండ్రులను ఊరి పెద్దలు, నాయకులు రూ.లక్షకు రాజీ చేసినట్లు సమాచారం. బుధవారం ఉదయం వరకు హాస్పిటల్‌ను సీజ్ చేయాలి అని చెప్పిన మల్లికార్జున్ పెద్దలు చేసిన రాజీకి తలొగ్గాడని స్థానికులు ఆరోపించారు. దీనిపై మల్లికార్జున్‌ను అడగగా ఊరి పెద్దలను కాదని ఏమీ చేయలేమని తెలిపాడు.

ఫిబ్రవరి 15 లోపు మత్స్యకారులకు బయోమెట్రిక్ కార్డులు

సముద్రతీర ప్రాంత రక్షణ కమిటీ సమావేశంలో సీఎస్

విశాలాంధ్ర - అమరావతి : సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులందరికీ ఫిబ్రవరి 15వ తేదీ లోపు బయోమెట్రిక్ కార్డులు ఇవ్వాలని మత్స్యశాఖ అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్ ఆదేశించారు. సచివాలయంలో బుధవారం జరిగిన సముద్రతీర ప్రాంత రాష్ట్రస్థాయి రక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నమోదు చేసిన మత్స్యకారుల వివరాలు, వారి సెల్ నెంబర్లను సముద్రతీర ప్రాంతరక్షణ పోలీసులకు అందజేయాలన్నారు. జిల్లాస్థాయిలో మత్స్యకారులతో సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. నోటిఫైడ్ ఫిష్ ల్యాండింగ్ పాయింట్స్, బోట్స్ కలర్ కోడింగ్, ఫైబర్ బోట్స్, బోట్స్ నిర్వహణ, వాటి మరమ్మతులు, మచిలీపట్నం పాత పోర్ట్ ప్రాంతంలో తీర ప్రాంత పోలీస్ శిక్షణ కేంద్రానికి భూమి కేటాయింపు, ప్రాంతీయ శిక్షణ కేంద్రాలు, తీరప్రాంత రక్షణ పోలీస్ ప్రధాన కార్యాలయ నిర్మాణం, రాష్ట్ర మేరీటైం బోర్డు, జిల్లా స్థాయి కమిటీల ఏర్పాటు, జెట్టీల నిర్మాణానికి కేంద్రం ప్రభుత్వం ఇచ్చిన నిధులు తదితర అంశాలను చర్చించారు. రాష్ట్రంలో 974 కి.మీ. తీర ప్రాంతంలో 9 జిల్లాలు, 64 మండలాలు, మొత్తం 21 తీర ప్రాంత రక్షణ పోలీస్ స్టేషన్లు ఉన్నట్లు, వాటిలో ఒక్క స్టేషన్‌కు మాత్రమే సొంత భవనం లేదని, 19 స్టేషన్లకు కాంపౌండ్ వాల్స్ నిర్మించవలసి ఉందని అధికారులు వివరించారు. పోలీస్ స్టేషన్ల పరిధిని నిర్ణయించవలసి ఉంటుందన్నారు. ఏపీ మెరైన్ బోర్డు బిల్-2017ని కేంద్రానికి పంపినట్లు తెలిపారు. హోం శాఖ గత నవంబర్‌లో రూపొందించిన జీఓ ప్రకారం జిల్లా స్థాయి తీరప్రాంత రక్షణ కమిటీలను జిల్లా కలెక్టర్లు ఏర్పాటు చేస్తారన్నారు. తీర ప్రాంత రక్షణ పథకం ఫేజ్ 2 కింద కేంద్ర ప్రభుత్వం 7 జెట్టీల నిర్మాణానికి రూ.3.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 350 నోటిఫైడ్ ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు ఉన్నట్లు తెలిపారు. బోట్‌లకు కలర్ కోట్ ఉంటే ఏరియల్ సర్వే తేలికవుతుందని చెప్పారు. మొత్తం 33,275 బోట్లలో 32,931 బోట్లకు సంబంధించి ఆన్ లైన్ రిజిస్ట్రేషన్ పూర్తి అయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో డీజీపీ ఎం.మాలకొండయ్య, హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఆర్ అనురాధ, విశాఖ పోర్ట్ ఛైర్మన్ ఎం.టి.కృష్ణబాబు, కోస్ట్ గార్డ్ కమాండెంట్ ఎస్.ఎస్.సింగ్, ఫిషరీస్ శాఖ డైరెక్టర్ కె.ప్రవీణ్, కెప్టెన్ కె.శ్రీధర్మ, ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు సుధ కోకా, డా. బాలకృష్ణన్, కె.గణేశన్, ఏబీవీ శాయి శ్రీనివాసరావు, ఏఎస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



పురుగుమందు తాగి యువరైతు ఆత్మహత్య

విశాలాంధ్ర - పెద్దదోర్నాల : పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రకాశంజిల్లా పెద్దదోర్నాల మండలంలోని రామచంద్రకోట పొలంలో బుధవారం జరిగింది. మృతుని తల్లి లక్ష్మీదేవి కథనం ప్రకారం రామచంద్రకోట గ్రామానికి చెందిన వెన్నా కాశిభీమిరెడ్డి (23) పంట పండక నష్టం రావడంతో చేసిన అప్పు తీర్చలేక మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రామస్తుల కథనం ప్రకారం పొలంలో నష్టం వస్తుందన్న ఆలోచనతో పురుగుమందు తాగి చనిపోతున్నట్లు ఒక వ్యక్తికి ఫోన్‌ద్వారా సమాచారం అందించడంతో ఆ వ్యక్తి ఘటనా స్థలికి వెళ్లగా అపస్మారక స్థితిలో పడివున్నాడు. ఇతన్ని మార్కాపురం ఏరియా వైద్యశాలకు తరలించగా అక్కడ మృతి చెందాడు. తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు దోర్నాల ఎస్ఐ రామకోటయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం సీజ్ చేశారని

పోలీసుస్టేషన్ ఎదుట వ్యక్తి ఆత్మహత్యాయత్నం




విశాలాంధ్ర - శింగనమల : పోలీసులు ద్విచక్ర వాహనం సీజ్ చేయడంతో మనస్తాపానికి గురైన యువకుడు పోలీసు స్టేషన్ ఎదుట క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన బుధవారం అనంతపురం జిల్లా శింగనమల మండల కేంద్రంలో చోటు చేసుకుంది. శివపురం గ్రామానికి చెందిన సుధాకర్ ఆ గ్రామ సమీపంలోనే కొందరు యువకులతో కలసి పేకాట ఆడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా సుధాకర్‌కు చెందిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్టేషన్‌లో పెట్టుకున్నారు. వాహనం ఇవ్వాలని బాధిత యువకుడు సుధాకర్ పోలీసులను కోరగా, వాహనంపై కేసు నమోదు చేసి కోర్టులో విచారణ అనంతరం ఇస్తామని చెప్పారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన సుధాకర్ బుధవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే సుధాకర్‌ను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురము ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

జన్మభూమి విధుల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులు

- చదువుకు దూరమవుతున్న విద్యార్థులు
- ఆందోళనలో తల్లిదండ్రులు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : మూలిగే నక్కమీద తాటిపండు పడ్డట్టుగా ఉంది ప్రభుత్వ ఉపాధ్యాయుల పరిస్థితి. రాష్ట్ర ప్రభుత్వం జన్మభూమి కార్యక్రమంలో ప్రతిజ్ఞ చదివేందుకు ప్రభుత్వ ఉపాధ్యాయులను నియమించింది. విజయనగరం జిల్లా పార్వతీపురం పట్టణంలో నిర్వహిస్తున్న జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ప్రతిజ్ఞ చేయించడానికి, అభివృద్ధి కార్యక్రమాల నివేదికలు చదవడానికి మున్సిపాల్టీలోని 16 ఎలిమెంటరీ పాఠశాలల నుంచి 30 మంది ఉపాధ్యాయులను, అలాగే ఉన్నత పాఠశాలల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులను నియమించింది. మున్సిపాల్టీలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువు అంతంతమాత్రంగా ఉండటంతో ఒకవైపు విద్యార్థులకు చదువు చెప్పే సమయంలో కూడా ప్రభుత్వం ఇటువంటి కార్యక్రమాలకు ఉపాధ్యాయులను ఉపయోగించుకోవడం ఎంతవరకు సమంజసమని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వాస్తవానికి బోధనేతర కార్యక్రమాల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులను ఉపయోగించకూడదని ఇటీవల ప్రభుత్వం సర్క్యులర్‌ను జారీ చేసిన విషయం అందరికీ తెలిసిందే. మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో ఇద్దరు నుంచి అయిదుగురు వరకు ఉపాధ్యాయులు ఉంటారు. ఇందులో ఒకటి నుంచి ముగ్గురు ఉపాధ్యాయుల వరకు జన్మభూమి కార్యక్రమానికి వెళ్లిపోవడంతో ఆ పాఠశాలలో చదువు చెప్పేవారే కరవయ్యారు. వాస్తవానికి మున్సిపాల్టీలో రోజుకు మూడు నుంచి నాలుగు వార్డుల్లో జన్మభూమి కార్యక్రమం జరుగుతుంది. అయితే వార్డుకు ఒకరు చొప్పున ఉపాధ్యాయుడ్ని నియమిస్తే బాగుండేదని మరికొందరు అంటున్నారు.



ఇటీవల స్వచ్ఛసర్వేక్షణ్ పేరుతో వారానికి మూడురోజులు చొప్పున ర్యాలీలు నిర్వహించడంతో కొంతకాలం వృథా అయిందని, ఇంతలో జన్మభూమి పేరుతో వీరిని ఈ విధులకు ఉపయోగించుకోవడం, రానున్న రోజుల్లో సంక్రాంతి సెలవులు కావడంతో మరికొంతమేర విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి కన్పిస్తోందని, కావున తక్షణమే ఉపాధ్యాయులను ఈ జన్మభూమి విధులు నుంచి తప్పించాలని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విధుల నుంచి తప్పించాలి : భాస్కరరావు, యూటీఎఫ్ పట్టణ నాయకులు

జన్మభూమి-మాఊరు కార్యక్రమం విధుల నుంచి మున్సిపల్ ఉపాధ్యాయులను తప్పించాలని యూటీఎఫ్ పట్టణ జనరల్ సెక్రటరీ కె.భాస్కరరావు అన్నారు. ఇటీవల స్వచ్ఛసర్వేక్షణ్ పేరుతో కొన్ని రోజులు విద్యార్థులు చదువుకు దూరమయ్యారని, వాస్తవానికి బోధనేతర కార్యక్రమాలకు ఉపాధ్యాయులను ఉపయోగించొద్దని ప్రభుత్వ నిబంధనలు ఉన్నప్పటికీ ఈ విధంగా తమను ఉపయోగించడం తగదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెస్ సుబ్బులక్ష్మి కూతురు రాధా మృతి



బెంగళూరు : కర్ణాటక సంగీత విద్వాంసురాలు, గాయని రాధా విశ్వనాథన్ ఇక్కడి ఒక ప్రైవేటు ఆస్పత్రిలో మరణించినట్లు ఆమె కుటుంబ సభ్యులు బుధవారం తెలిపారు. ప్రముఖ సంప్రదాయ గాయకురాలు ఎం.ఎస్.సుబ్బులక్ష్మి రాధా విశ్వనాథన్ కుమార్తె. 83 ఏళ్ల రాధావిశ్వనాథన్ శ్వాస సంబంధ సమస్యతో మంగళవారం ఉదయం ఇక్కడి ఫోర్టిస్ ఆస్పత్రిలో చేరారు. అయితే గత రాత్రి ఆమె కన్ను మూశారు. దశాబ్దాలుగా తన తల్లి, భారతరత్న పురస్కార గ్రహీత సుబ్బులక్ష్మితో కలిసి విదేశీ కార్యక్రమాలతో సహా అనేక సంగీత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 'అమనీ మనా దో మేనాయో లోకస్వామి త్రిలోకధ్రుత్' అంటూ ఆలపించిన ఆ స్వరం ఇపుడు తన తల్లి(ఎం.ఎస్.సుబ్బులక్ష్మి)తో కలిసిపోయింది అని పేర్కొంటూ ఆమె కుమారుడు వి.శ్రీనివాసన్ తన 'ఫేస్‌బుక్ పేజీలో పోస్టు చేశారు. కాగా రాధా విశ్వనాథన్‌కు కుమారులు వి.చంద్రశేఖర్, శ్రీనివాసన్, కుమార్తె శుభలక్ష్మి, అలాగే మనుమరాళ్లు ఎస్.ఐశ్వర్య, ఎస్.సౌందర్య ఉన్నారు. శ్రీనివాసన్ సహిణి గత మాట్లాడుతూ తన అత్తగారు చలి కాలంలో శ్వాసపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. ఈసారి ఆమె ఆరోగ్య పరిస్థితి గత సాయంత్రం నుంచి క్షీణించడంతో రాత్రి 11.50 గంటల సమయంలో మరణించినారన్నారు. 36 ఏళ్లగా రాధా విశ్వనాథన్ ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ చిరునవ్వుతో ఉండేవారు. ఆమె నుంచి చాలా నేర్చుకోవాలి. కానీ ఆమెను కోల్పోయామని శ్రీనివాసన్ చెప్పారు. 'వెంకటేశ సుప్రభాతం', 'విష్ణు సహస్రనామం' 'భజగోవిందం'ను ప్రపంచవ్యాప్తంగా లక్షల ఆలయాలు, గృహాల్లో వినిపిస్తున్నాయి. అందులో రాధా స్వరం వినిపిస్తుంది. విడదీయరానిది అని తెలిపారు. కాగా ఎం.ఎస్.సుబ్బులక్ష్మి 2004, డిసెంబరులో 88వ ఏట మరణించారు.



7 నుంచి కాంగ్రెస్ పోలవరం పాదయాత్ర

పోస్టరు విడుదల చేసిన నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం కోసం ఈ నెల 7 నుంచి 9వరకూ కాంగ్రెస్ పాదయాత్రకు సిద్ధమైందని ఆ పార్టీ నేతలు వెల్లడించారు. విజయవాడ ఆంధ్రరత్నభవన్‌లోని బుధవారం పీసీసీ ప్రధాన ప్రధాన కార్యదర్శి మీసాల రాజేశ్వరరావు, అధికార ప్రతినిధులు కొలనుకొండ శివాజీ, వి.గుర్నాథం, విజయవాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ కుమార్ తదితరులు పాదయాత్ర పోస్టరును విడుదల చేశారు. ధవళేశ్వరం-పోలవరం వరకూ పీసీసీ చీఫ్ డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి అధ్వర్యాన కాంగ్రెస్ చేపట్టబోయే పాదయాత్రకు ఏర్పాట్లు పూర్తయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధికార ప్రతినిధి నిమ్మల జ్యోతిక, వెన్నా రమేష్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ హెల్త్‌వర్సిటీ సెనెట్ సభ్యుల నియామకం


విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్‌యూనివర్సిటీ అకాడమిక్ సెనెట్ సభ్యులుగా ఐదుగుర్ని నియమించారు. ఈ మేరకు మెడికల్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ పూనం మాలకొండయ్య బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. యునాని విభాగం నుంచి కర్నూలు యునాని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సయ్యద్ మహబూబ్ బాషా, మోడ్రన్ మెడిసిన్ విభాగం అల్లో పతి నుంచి విశాఖపట్నం ఆంధ్రా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్- టి.దేవి మాధవి, గుంటూరు మెడికల్ కళాశాల ప్రొఫెసర్- ఎన్‌వి సుందరా చార్య, విజయ నగరం మహరాజ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రొఫెసర్- డాక్టర్ చాపర్ల లక్ష్మణరావు, కర్నూలు మెడికల్ కళాశాల ప్రొఫెసర్-ఏ.సురేఖలను నియ మించారు. ఈ ఐదుగురు మూడేళ్లపాటు అకడమిక్ సభ్యులుగా కొనసాగుతారు.

పార్లమెంట్‌లో 'మహా దళిత' మంట...!

విశాలాంధ్ర - న్యూఢిల్లీ : భీమా కోరేగావ్ అల్లర్లపై లోక్‌సభలో ప్రతిపక్షం ఆగ్రహం వ్యక్తం చేసింది. సభను అడ్డుకుంది. దేశవాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వాన్ని నిలదీసింది. తూర్పారబట్టింది. జీరో అవర్‌లో ఈ అంశాన్ని కాంగ్రెస్ లేవనెత్తింది. దేశంలో దళితులను టార్గెట్ చేస్తున్నారని కాంగ్రెస్ నేత మల్లిఖార్జున్ ఖర్గే ఆరోపించారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిదాలయం స్కాలర్ వేముల రోహిత్ ఆత్మహత్యను ఆయన గుర్తు చేశారు. ఆత్మగౌరవంతో దళితులు బతకాలని భావిస్తున్నప్పుడు, కొందరు దాడి చేస్తున్నారని ఆరోపించారు. భీమా కోరేగావ్‌లోనూ ఇదే జరిగిందన్నారు. ప్రతి ఏడాది దళితులు భీమా కోరేగావ్ స్మారకం వద్ద నివాళి అర్పిస్తారని, గతంలో ఎప్పుడూ ఇలాంటి హింస చోటు చేసుకోలేదని ఖర్గే అన్నారు. హింసను ఎవరు ప్రేరేపించారని ఆయన ప్రశ్నించారు. దళితులు అప్పటి యుద్ధంలో ఆయుధాలు వాడలేదని, ఆ స్మారకం కేవలం చరిత్ర ఆధారంగా నిర్మించారని ఖర్గే తెలిపారు. హింసకు ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలే కారణమని ఆయన నిందించారు. సుప్రీంకోర్టు జడ్జి చేత భీమా కోరేగావ్ అల్లర్లపై విచారణ చేపట్టాలని డిమాండు చేశారు. ఈ ఘటనపై ప్రధాని మోడీ సభలో ప్రకటన చేయాలన్నారు. దళితులపై దాడులు జరుగుతుంటే ఆయన ఎలా మౌనంగా ఉంటారని ప్రశ్నించారు. ప్రధాని ఓ మౌన బాబాగా మారారని ఖర్గే ఆరోపించారు. ఈ సమయంలో పార్లమెంట్ వ్యవహారాలశాఖ మంత్రి అనంత్‌కుమార్ జోక్యం చేసుకున్నారు. మహారాష్ట్ర ఘటనను ఖర్గే రాజకీయం చేస్తు న్నారని ఎదురుదాడి చేశారు. కాంగ్రెస్ ప్రతి రాష్ట్రంలోనూ విఫలమవుతున్నదని, అందుకే ఈ అంశాన్ని ప్రజ్వలింప చేస్తున్నదని విమర్శించారు. విభజించి, పాలించు అన్న విధంగా కాంగ్రెస్ వ్యవహరిస్తున్నదని మంత్రి అనంత్ కుమార్ ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ ఎంపీలు సభలో నినాదాలు చేశారు. అరుపులు, కేకలతో సభ దద్దరిల్లింది. తృణామూల్ పార్టీ ఎంపీ సౌగత్ రాయ్ కూడా భీమా కోరేగావ్ సమస్యను సభలో లేవనెత్తారు. హింసను ఖండిస్తున్నామన్నారు. అల్లర్లను, హింసను అదుపు చేయడంలో మహారాష్ట్ర ప్రభుత్వం విఫల మైందన్నారు. శివసేనకు చెందిన శివాజీ పాటిల్ కూడా మాట్లాడారు. ఈ ఘటనను మరాఠా వర్సెస్ దళిత్ యుద్ధంగా చిత్రీకరిస్తున్నారని, కానీ అది తప్పు అని ఎంపీ శివాజీ అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కప్పిపుచ్చేందుకే అల్లర్లను హైలైట్ చేస్తున్నారని బీజేపీ ఎంపీ ధాన్వే తెలిపారు. భీమా కోరేగావ్ అంశాన్ని విపక్షాలు రాజ్యసభలో ప్రశ్నించాయి. రాజ్యసభ ప్రారంభం కాగానే చైర్మన్ వెంకయ్య నాయుడు కాంగ్రెస్ నేత గులాంనబీ ఆజాద్‌ను మాట్లాడాలని కోరారు. ఇంతలో బీఎస్పీ ఎంపీ సతీష్ చంద్ర మిశ్ర భీమా కోరేగావ్ హింసాకాండకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ విషయంపై చర్చించాలని డిమాండు చేశారు. మిగిలిన ఎంపీలు కూడా బీఎస్పీ ఎంపీకి తోడయ్యారు. ఎన్డీయే ప్రభుత్వం దళిత వ్యతిరేకిగా వ్యవహరిస్తోందని నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళ పరిస్థితి నెలకొంది. ఈ స్థితిలో సభను 11 గంటల వరకూ వాయిదా వేశారు. ఆ తరువాత సభ సాగలేదు. దీంతో 2 గంటల వరకూ వాయిదా వేశారు. సభ ప్రారంభం కాగానే గులాంనబీ అజాద్ మాట్లాడుతూ గడచిన మూడున్నర ఏళ్లల్లో దళితులపై దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. మళ్లీ గందరగోళ పరిస్థితి నెలకొనటంతో ట్రిపుల్ తలాక్ అంశంపై చర్చ జరగకుండానే రాజ్యసభను వాయిదా వేశారు.

9న ఉద్యోగుల ధర్నా

ప్రధాన కార్యదర్శికి నోటీసు ఇచ్చిన పెన్షన్ సాధన సమితి



విశాలాంధ్ర- అమరావతి : ప్రభుత్వ ఉద్యోగులు ఈనెల 9న ధర్నా చేయనున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ ఉద్యో గులు ధర్నా చేయనున్నట్లు పెన్షన్ సాధన సమితి జెఏసీ కన్వీనర్, ఏపీ ఎన్‌జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు ఇతర సంఘాల నాయకులు స్పష్టం చేశారు. ఈమేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్‌కుమార్‌ను కలిసి నోటీసు అందజేశారు. రాష్ట్రంలో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం జరుగుతున్నందున ధర్నాకు దిగవద్దని ఉద్యోగ సంఘాల నాయకులను కోరగా, దీనిపై సంఘాలు గతంలోనే నిర్ణయం తీసుకున్నాయని, అందువల్ల వాయిదా వేయటం సాధ్యం కాదని అశోక్‌బాబు సీఎస్‌కు వివరించారు. ఆరోజు ఉదయం నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాష్ట్రంలోని తహశీల్దార్ కార్యాలయాలు, జిల్లా కలెక్టరేట్‌ల ఎదుట ఉద్యోగులు ధర్నా చేసేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని అశోక్‌బాబు వెల్లడించారు.

ఇకపై కోల్డ్‌స్టోరేజీల్లో క్రయవిక్రయాలు!

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : ఇకపై కోల్డ్‌స్టోరేజీల్లో పంటలను విక్రయించే అవకాశాలు కల్పిస్తూ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఉత్తర్వులు వెలువరించింది. కోల్డ్‌స్టోరేజీలలో ఈ-నామ్ విధానాన్ని ఏర్పాటుచేసుకుని పంటలను క్రయ విక్రయాలు చేసుకోవచ్చునని సూచించింది. కేంద్రప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఇప్పటికే ఈ-నామ్ విధానాన్ని 22 మార్కెటింగ్ కమిటీలలో అమలుచేయడంతో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతోంది. ఈనేపథ్యంలో కోల్డ్‌స్టోరేజీలలో కూడా దీన్ని ప్రవేశపెట్టాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ భావించింది. కోల్డ్‌స్టోరేజీలలో ఈ-నామ్ అమలుకు ఆసక్తిగల అభ్యర్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చింది. దీంతో రాష్ట్రంలో ఉన్న కోల్డ్‌స్టోరేజీల నిర్వాహకులు కొందరు ముందుకు వచ్చి, ప్రభుత్వానికి దరఖాస్తులు పంపారు. దరఖాస్తు చేసుకున్న కోల్డ్‌స్టోరేజీలను మార్కెటింగ్‌శాఖ అధికారులు పరిశీలించి వారికి ఈ-నామ్ అమలకు అనుమతులు మంజూరు చేస్తారు. ఒక్కొక్క కోల్డ్ స్టోరేజీ వద్ద ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులను కూడా మార్కెటింగ్‌శాఖ నియమిస్తుంది. దీనిలో ఒక వేమెన్, మరొక సహ ఉద్యోగి ఉంటారు. వీరు ఈ-నామ్ విధానం విజయవంతంగా అమలు జరగడానికి సహకరిస్తారు. సాధారణంగా రైతులు ఎక్కువ ధరల కోసం మిర్చి, పత్తి, ధాన్యం, అపరాలు వంటి పంటలను కోల్డ్‌స్టోరేజీలలో నిల్వచేస్తారు. అనంతరం ధరలు పెరిగిన తర్వాత వాటిని మార్కెట్ యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తారు. అయితే కొత్త విధానంలో నిల్వ చేసిన కోల్డ్‌స్టోరేజీ వద్దే పంటలను విక్రయించే సువర్ణ అవకాశం దక్కుతుంది. దీంతో పంటలకు కనీస మద్దతు ధర లభించడంతోపాటు రవాణా ఛార్జీలు మిగులుతాయి. ప్రభుత్వం తీసుకున్న కొత్త నిర్ణయంతో రైతులకు మేలు జరుగుతుందని మార్కెటింగ్ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఈ విధానం వలన రైతులు కమీషన్ ఏజెంట్లను సంప్రదించాల్సిన అవసరంలేదు. నూతన విధానం వలన నేరుగా రైతు ట్రేడర్‌కే విక్రయించి సొమ్ములు పొందవచ్చును. ఆన్‌లైన్ సమస్యల వలన తరచూ క్రయవిక్రయాలకు ఇబ్బందులు పడుతున్నారు. రైతులంతా రాష్ట్రంలో ఉన్న 22 మార్కెట్ యార్డులకు వెళ్లడం వలన గంటల తరబడి క్యూలైన్‌లో ఉండాల్సిన దుస్థితి నెలకొంది. కొత్త విధానంలో కోల్డ్‌స్టోరేజీల యాజమాన్యం ఈ-నామ్ అమలుకు అనుమతులు పొందటం వలన రద్దీను కూడా నియంత్రించవచ్చు. ఉదహరణకు గుంటూరు మిర్చి యార్డులో మిర్చిను విక్రయించాలంటే రద్దీ నేపథ్యంలో రెండు రోజులు సమయం పడుతుంది. అదే కోల్డ్ స్టోరేజీలలో అయితే ఒక్క గంటలోనే మొత్తం ప్రక్రియ పూర్తవుతుంది. దీన్ని సమర్థంగా అమలు చేయాలని రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ అధికారులు కృతనిశ్చయంతో ఉన్నారు.

కోడి పందేలకు అడ్డుకట్ట

(మొదటిపేజీ తరువాయి)

కమిషనరేట్ పరిధిలోని అధికారులతోపాటు అన్ని స్టేషన్ల అధికారులతో బుధవారం ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఎట్టి పరిస్థితిలోనూ పందేలను అడ్డుకోవాల్సిందేనని ఆదేశించారు. ఎక్కడైనా రహస్యంగా పందేలు నిర్వహించినా, పందేల కోసం కోడి పుంజులను పెంచుతున్నట్లు సమాచారం తెలిసినా దాడులు చేయాలని ఆదేశించారు. కృష్ణాజిల్లా కలెక్టర్ బీ లక్ష్మీకాంతం కూడా పందేలను అడ్డుకునేందుకు, దాడులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, గుంటూరు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల్లో ఎక్కడైనా పందేల నిర్వహణకు బరులను సిద్ధం చేసిన ప్రాంతాలను సంయుక్త కమిటీలు తనిఖీ చేయాలని సీఎస్ దినేష్‌కుమార్, డీజీపీ ఎం మాలకొండయ్య ఆదేశించినట్లు విశ్వసనీయ సమాచారం.

పందేల నిషేధంపై గ్రామస్థాయి సమావేశాలు : మండలస్థాయి జాయింట్ కమిటీలు మండలాల పరిధిలోని పలు గ్రామాలలో ప్రజలతో సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కోడి పందేలు, జూద క్రీడల నిర్వహణపై నిషేధం ఉందని, పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరికలు జారీ చేయాలని మండలస్థాయి అధికారులకు సూచించారు. పందేలు నిర్వహించినా, పందేలకు ఏర్పాట్లు చేస్తున్నా, పందేల కోసమే కోడి పుంజుల ఫారాలు నిర్వహించినా దాడులు చేసేందుకు ప్రభుత్వం అనుమతించింది. మండలస్థాయి ఉమ్మడి కమిటీలలో తహసిల్దార్, ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, సంబంధిత పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) లేదా సబ్ ఇన్‌స్పెక్టర్లు, పశు సంవర్థకశాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతోపాటు ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించారు. ఈసారి సంక్రాంతి కోడి పందేల నిర్వహణ నిర్వాహకులకు కత్తిమీద సాములాంటిదే అని చెప్పవచ్చు. కోడి పందేల నిర్వహణపై పలువురు ప్రజా ప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ప్రధానంగా పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణాజిల్లాల్లో చట్ట సభలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రజా ప్రతినిధులే స్వయంగా పందేల నిర్వహణకు శ్రీకారం చుట్టటం గమనార్హం. కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా విజయవాడ చెంతనే ఉన్న ఒక అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యే పందేలు నిర్వహించటం గమనార్హం. ఎప్పటి మాదిరిగానే సంక్రాంతి మూడు రోజులపాటు పందేలకు అనుమతి ఇప్పించాలని సీఎం చంద్రబాబును కోరుతున్నట్లు తెలిసింది. కోళ్లకు కత్తులు కట్టకుండా పందేలు వేసేలా చూస్తామని కూడా వారు చెబుతున్నట్లు తెలిసింది. అయితే ఈ విషయంపై కూడా హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయటంతో పందేల నిర్వహణపై ప్రజా ప్రతినిధులు మల్లగుల్లాలు పడుతున్నారు.

దళితుల మహాందోళన...!

(మొదటిపేజీ తరువాయి)

మధ్య రగిలిన ఘర్షణ హింసాత్మక రూపం దాల్చింది. పుణే, ముంబై, షోలాపూర్, థాణే, ఔరంగాబాద్ నగరాలతోపాటు మహారాష్ట్రలోని పలు ప్రాంతాల్లో ఇరువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడ్డాయి. ముంబైలో సబర్బన్ లోకల్ రైళ్లను ఆందోళనకారులు అడ్డుకొని, పలుచోట్ల రోడ్లపై బైఠాయించారు. పలుచోట్ల దుకాణాలను మూయించి బస్సులను ధ్వంసం చేశారు, సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఈ హింసాకాండపై న్యాయవిచారణకు ఆదేశించారు. ఈ ఘర్షణపై సిట్టింగ్ జడ్జీ విచారణ జరుపుతారని, మితవాద శక్తుల దాడిలో మృతి చెందిన రాహుల్ ఫతంగాడే కుటుంబానికి రూ.10లక్షల పరిహారం చెల్లిస్తామని ప్రకటించారు. అయితే హింసను నివారించడంలో ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ భారీపా బహుజన్ మహాసంఘ్ నాయకుడు, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ బుధవారం మహారాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చారు. బంద్‌కు 250 దళితసంఘాలు మద్దతు తెలిపాయి. దీంతో మహారాష్ట్ర పోలీసులు భారీ సంఖ్యలో మోహరించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంటర్నెట్ సర్వీసులను రద్దు చేశారు. డీజీపీ సతీష్ మాథూర్ స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. అదనపు బలగాలను రప్పించారు. బుధవారం ఉదయమే దళితులు పెద్ద సంఖ్యలో రోడ్లపైకి చేరుకున్నారు. దుకాణాలను మూయించారు. స్కూలు బస్సులను నిలిపివేశారు. దాదాపు 40వేల స్కూలు బస్సులు కదలలేదు. డబ్బావాలాలూ విధుల్లో పాల్గొనలేదు. థానే స్టేషన్‌లో లోకల్ రైలును ఆందోళనకారులు అడ్డుకున్నారు. దాదాపు గంట పాటు ఈ రైలును కదలనీయలేదు. బస్సులు, ఆటో రిక్షాలపై రాళ్ల దాడికి దిగారు. సతారా, బారమతి ప్రాంతాలకు వెళ్లే బస్సులను పునెలో నిలిపివేశారు. విరార్, గోరేగావ్‌లో రైళ్లను అడ్డుకున్నారు. కండివలి ప్రాంతంలోని ఆర్కులి బ్రిడ్జి, సంతోష్‌నగర్‌లో దిండోషి, కామరాజ్, విజయనగర్‌లోని ఎంఐడీసీ, అరుణ్‌కుమార్ వైద్య మార్గ్, ఆందోళనకారులు ధర్నా చేశారు. ఇక్కడ వందలాది మంది దళితులను పోలీసులు అరెస్టు చేశారు. వార్లీ నాక, ఖేర్వాడీ జంక్షన్, కళానగర్, ఎంఎంఆర్డీఏ ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించిపోయింది. నల్లసోపోరా రైల్వే స్టేషన్‌లో పెద్ద సంఖ్యలో ఆందోళనకారులు పట్టాలపై కూర్చుని రైళ్ల రాకపోకలను అడ్డుకున్నారు. అనేక రైళ్లు నిలిచిపోయాయి. దీంతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ బలగాలు భారీ సంఖ్యలో చేరుకుని ఆందోళనకారులను అరెస్టు చేశాయి. ముంబై రైల్వే డివిజన్‌లోని దివ, టిట్వాల, వసింద్‌లో రైళ్ల రాకపోకలను ఆందోళనకారులు అడ్డుకున్నారు. భంద్రా కళానగర్, దరవి కుంభర్వాడా, కామరాజ్‌నగర్, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో 48 బస్సులను ధ్వంసం చేశారు. నలుగురు డ్రైవర్లు గాయపడ్డారు. 150 మందిని పోలీసులు అరెస్టు చేశారు. పునెలో దళితులు భారీ ర్యాలీ చేపట్టారు. పునె-ముంబై జాతీయ రహదారిలో ములా రోడ్డులో ఈ ర్యాలీ సాగింది. సమస్త హిందూ అగాదీ నాయకుడు మిలింద్ ఏక్‌బోటే ఇంటిని చుట్టుముట్టేందుకు దళితులు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలా మహారాష్ట్ర దళితుల ఆగ్రహంతో రగిలిపోతోంది.

విశాలాంధ్ర

క్రీడలు



తొలి సెషనే కీలకం

▸ పాండ్య ఒక ఆయుధం ▸ డివిలియర్స్, ఆమ్లా వికెట్లకే ప్రాధాన్యం ▸ మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్

ముంబై: మరో రెండు రోజుల్లో అభిమానులు ఆశగా ఎదురుచూస్తోన్న భారత్-దక్షిణాఫ్రికా మధ్య టెస్టు సిరీస్ ప్రారంభంకాబోతుంది. ఈ నేపథ్యంలో మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ టీమిండియాకు పలు విలువైన సలహాలు, సూచనలు ఇచ్చాడు. 'సఫారీ గడ్డపై టీమిండియా జగ్రత్తగా ఆడాలి. జట్టు బాగా రాణిస్తే కోహ్లిసేనకు విజయం సొంతం అవుతోంది. ఈ పర్యటనలో ఏ ఒక్కరిపై ఆధార పడకుండా జట్టు సభ్యులంతా రాణించాలి. కోహ్లి తన ఆట తాను ఆడుకుంటే చాలు. భారీ స్కోర్లు నమోదు చేయడం చాలా ముఖ్యం. ఏ టెస్టులో అయినా తొలి రోజు ఆటే కీలకం. తొలిరోజు మొదటి స్పెల్‌లో అటు బ్యాట్‌తో.. లేదంటే బంతితోనైనా ఎవరు రాణిస్తారో వారికే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయి' అని సచిన్ తెలిపాడు. 'నా 24 ఏళ్ల టెస్టు క్రికెట్ కెరీర్‌లో భారత జట్టు ప్రస్తుతం ఉన్నంత బలంగా ఎప్పుడూ లేదు. అటు బౌలింగ్‌లో.. ఇటు బ్యాటింగ్‌లో రెండు విభాగాల్లో అద్భుతంగా రాణించే ఆటగాళ్లు ఉన్నారు. అలాగే ఆల్‌రౌం డర్‌గా హార్దిక్ పాండ్య ఈ పర్యనటలో మనకు దొరికిన అదనపు బలం. కోహ్లికి దొరికిన ఆయుధం కూడా. పాండ్య 17 నుంచి 18 ఓవర్లు సునాయాసంగా వేయగలడు. 7 లేదా 8వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చి పరుగులు చేయగలడు. దక్షిణాఫ్రికా పర్యటన పాండ్యకు అసలైన పెద్ద సిరీస్. సీమర్‌గా..మిడిలార్డర్ బ్యాట్స్‌మెన్‌గా, ఫీల్డర్‌గా పాండ్య గొప్పగా రాణిస్తున్నాడు. ముగ్గురు పేసర్లతో బరిలోకి దిగడం గురించి ఎప్పుడూ ఆలోచన కూడా జరగలేదు. కపిల్‌దేవ్ హయాంలోనూ ఇది లేదు. అక్కడి పిచ్‌లపై బంతులు మంచి లైన్ అండ్ లెంగ్త్‌తో దూసుకొ స్తాయి. కాబట్టి స్లిప్ ఫీల్డింగ్ చాలా బలంగా ఉండాలి. దక్షిణాఫ్రికా జట్టులో ఏబీ డివిలియర్స్, హాషీమ్ ఆమ్లా కీలకం. వీరిద్దరి వికెట్లు ఎంత త్వరగా దక్కించుకుంటే భారత్ తాను అనుకున్న పని త్వరగా చేయగలదు. కలిస్, గ్రేమ్ స్మిత్, మార్క్ బౌచర్ లాంటి ఆటగాళ్లు లేరని ప్రస్తుతం దక్షిణాఫ్రికా నిరాశగా ఉంది' అని సచిన్ వివరిం చాడు. మూడు టెస్టు మ్యాచుల సిరీస్‌లో భాగంగా భారత్-దక్షిణాఫ్రికా మధ్య 5న కేప్ టౌన్‌లో తొలి టెస్టు ప్రారంభంకానున్నది.



గబ్బర్ ఫిట్

కేప్‌టౌన్: భారత క్రికెటర్ శిఖర్ ధావన్ గాయం నుంచి కోలుకున్నాడా? అంటే అవుననే అంటున్నాయి క్రీడా వర్గాలు. ఎందుకంటే కేప్‌టౌన్‌లో ధావన్ ప్రాక్టీస్ చేస్తున్న ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. దీంతో ధావన్ గాయం నుంచి కోలుకున్నాడని.. తొలి టెస్టుకు అందుబాటులో ఉంటాడని అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దక్షిణాఫ్రికాతో మూడు టెస్టు మ్యాచుల సిరీస్ కోసం కోహ్లిసేన డిసెంబరు 27న దక్షిణాఫ్రికా బయల్దేరిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ధావన్ చీలమండల గాయంతో బాధపడుతూ కనిపించాడు. దీంతో కేప్‌టౌన్‌లో భారత్-దక్షిణాఫ్రికా మధ్య జరిగే తొలి టస్టుకు ధావన్ అందుబాటులో ఉండడని, మురళీ విజయ్-కేఎల్ రాహుల్ ఓపెనర్లుగా బరిలోకి దిగే అవకాశం ఉందని వార్తలు వెలువడ్డాయి. కానీ, ఇప్పుడు ధావన్ కేప్‌టౌన్‌లో బ్యాటింగ్, ఫీల్డింగ్ ప్రాక్టీస్‌లో పాల్గొన్న ఫొటోలు ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. గబ్బర్ కోలుకోవడంపై టీమ్ మేనేజ్‌మెంట్‌ను వివరణ అడగ్గా..'ధావన్ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఈ రోజు నెట్స్‌లో ప్రాక్టీస్‌లోనూ పాల్గొన్నాడు. ఏమాత్రం ఇబ్బంది పడలేదు. తుది పదకొండులో చోటుపై నిర్ణయం మాత్రం కోహ్లి, రవిశాస్త్రిదే కదా' అని తెలిపింది. మరోపక్క బీసీసీఐ కూడా ధావన్ కోలుకున్నాడని, మొదటి టెస్టు సెలక్షన్‌కు అందుబాటులో ఉన్నాడని ప్రకటించింది. కాగా స్పిన్ బౌలర్ రవీంద్ర జడేజా అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిపింది. ధావన్‌తో పాటు మిగతా ఆటగాళ్లు బుధవారం నిర్వహించిన ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొన్నారు. కెప్టెన్ కోహ్లి బుధవారం ఫీల్డింగ్‌కే తొలి ప్రాధాన్యం ఇచ్చాడు. జనవరి 5న భారత్-దక్షిణాఫ్రికా మధ్య తొలి టెస్టు ప్రారంభంకానుంది. ఇప్పటి వరకు సఫారీ గడ్డపై భారత్ ఒక్క టెస్టు సిరీస్ కూడా గెలవలేదు. దీంతో ప్రస్తుత సిరీస్ కోసం అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



టీటీలో మేటి 'సత్యన్'

అంతర్జాతీయ ర్యాంకింగ్స్ నంబర్‌వన్

న్యూఢిల్లీ: కొన్నేళ్లుగా భారత నంబర్‌వన్ టేబుల్ టెన్నిస్ (టీటీ) ప్లేయర్‌గా కొనసాగుతున్న ఆచంట శరత్ కమల్‌ను వెనక్కి నెట్టి ఆ స్థానాన్ని జి.సత్యన్ భర్తీ చేశాడు. కొంతకాలంగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా రాణిస్తున్న సత్యన్... మంగళవారం విడుదల చేసిన అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య (ఐటీటీఎఫ్) పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో 49వ స్థానానికి చేరుకున్నాడు. శరత్ కమల్ 51వ స్థానంలో నిలిచాడు. గతేడాది సత్యన్ బెల్జియం ఓపెన్, స్పానిష్ ఓపెన్ టైటిల్స్‌ను సాధించాడు. అండర్-18 బాలుర సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో మానవ్ ఠక్కర్ 18వ, మానుష్ షా 47వ, హైదరాబాద్ ప్లేయర్ స్నేహిత్ 64వ ర్యాంక్‌ల్లో ఉన్నారు.



పీబీఎల్‌లో రైనా సందడి

లక్నో: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్(పీబీఎల్)లో భారత క్రికెటర్ సురేశ్ రైనా సందడి చేశాడు. డిసెంబరులో ప్రారంభమైన పీబీఎల్ పోటీలు ప్రస్తుతం లక్నోలో జరుగుతున్నాయి. టోర్నీలో భాగంగా మంగళవారం అవధె వారియర్స్-అహ్మదాబాద్ స్మాష్ మాస్టర్స్ మధ్య మ్యాచులు నిర్వహించారు. ఈ పోటీలకు భారత క్రికెటర్ సురేశ్ రైనా హాజరయ్యాడు. దీంతో స్టేడియం రైనా నామస్మరణతో మారుమోగింది. ఈ పోటీల్లో అవధె వారియర్స్ 4-3తో విజయం సాధించింది. మ్యాచుల అనంతరం వారియర్స్ ఆటగాళ్లు రైనాతో కలిసి ఫొటోలు దిగారు. భారత స్టార్ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ తన తల్లితో కలిసి రైనాతో ఫొటోకు ఫోజులిచ్చింది. 'మ్యాచులు తిలకించేందుకు వచ్చి.. ఆటగాళ్లను ప్రోత్సహించిన రైనాకు ధన్యవాదాలు' అని సైనా పేర్కొంది. అలాగే 'పీబీఎల్ టోర్నీ సందర్భంగా బ్యాడ్మింటన్ చాంపియన్ సైనా నెహ్వాల్ జట్టు అవధె వారియర్స్‌కు మద్దతివ్వడం ఎంతో ఆనందంగా ఉంది. జట్టుకు నా శుభాకాంక్షలు' అని రైనా పేర్కొన్నాడు. సయ్యద్ ముస్తక్ అలీ ట్రోఫీలో పాల్గొనేందుకు రైనా లక్నో చేరుకున్నాడు. యో యో పరీక్ష పాసైన రైనా దేశవాళీ క్రికెట్‌లో అంతగా రాణించకపోవడంతోనే దక్షిణాఫ్రికా పర్యటనకు ఎంపిక చేయలేదని బీసీసీఐ సెలక్టర్లు తెలిపారు. ఇక ఈ ఏడాది ఐపీఎల్‌లో రైనా చెన్నై సూపర్ కింగ్స్‌కే ప్రాతినిథ్యం వహిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి.

టీమిండియాతో అంత వీజీ కాదు

సఫారీ కోచ్ గిబ్సన్ హెచ్చరిక!



కేప్‌టౌన్: విరాట్ కోహ్లి, టీం ఇండియాతో జాగ్రత్తగా ఉండాలని దక్షిణాఫ్రికా కోచ్ ఒట్టిస్ గిబ్సన్ సఫారీలను హెచ్చరించారు. ఈనెల 5 నుంచి ఇరు జట్ల మధ్య తొలి టెస్ట్ మ్యాచ్ ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీం ఇండియాను ఉద్దేశించి పలు వ్యాఖ్యలు చేశారు. "టీం ఇండియా ఇప్పుడు నెం.1 ర్యాంకులో ఉంది. ఆ జట్టులో ప్రపంచస్థాయి ఆటగాళ్లు ఉన్నారు. వాళ్లు తమ సొంతగడ్డ మీద మాత్రమే కాకుండా విదేశాల్లోనూ గొప్పగా ఆడుతారు. ఈ పర్యటనలో కూడా భారత ఆటగాళ్లు మంచి ఆట కనబరుస్తారని భావిస్తున్నా. గతంలో జరిగిన విధంగా కాకుండా ఈసారి వాళ్లు మాకు గట్టిపోటీ ఇస్తారు." అని పేర్కొన్నాడు. ఇక పేస్‌కి అనుకూలంగా లేని న్యూలాండ్స్ పిచ్ గురించి గిబ్సన్ మాట్లాడుతూ.. "నేటికి.. శుక్రవారానికి పెద్ద తేడా ఉంటుందని అని అనుకోవడం లేదు." అని పేర్కొన్నాడు. దక్షిణాఫ్రికా పర్యటలో భాగంగా భారత్ దక్షిణాఫ్రికాతో మూడు టెస్టులు, ఆరు వన్డేలు, మూడు టీ-20లు ఆడనుంది. తొలి టెస్ట్ మ్యాచ్ న్యూలాండ్స్‌లో, రెండోది సెంచురియాన్‌లో, మూడోది జోహన్స్‌బెర్గ్‌లో జరుగనుంది.

కోహ్లి.. కాస్త సహనంగా ఉండు : గంగూలీ



కోల్‌కతా: భారత్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత విరాట్ కోహ్లి ఎన్నో ప్రతిష్టాత్మక సిరీస్‌లలో జట్టును గెలుపుబాటలో నడి పించి తన సత్తా నిరూపిం చుకున్నాడు. అయితే ఇప్పుడు విరాట్ ముందున్న అసలైన సవాల్ దక్షిణాఫ్రికా గడ్డపై టెస్ట్ సిరీస్‌లో విజయం సాధించ డమే. ఇప్పటి వరకూ సఫారీ గడ్డపై భారత్ టెస్ట్ సిరీస్‌లో విజయం సాధించ లేదు. అయితే సిరీస్‌ని కైవసం చేసు కొని చరిత్ర సృష్టించేందుకు కోహ్లిసేన సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ విరాట్‌కు కొన్ని సలహాలు ఇచ్చాడు. ఓ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. విరాట్ కోహ్లి బౌలర్ల విషయంలో కాస్త సహనంగా ఉండాలని సూచించాడు. భారత్‌లో ఆడిన విధంగా దక్షిణా ఫ్రికాలో కుదరదని స్పష్టం చేశాడు. 'భారత్‌లో సిరీస్‌లు గెలవడం, విదేశాల్లో గెలవడం పూర్తిగా వేర్వేరు విషయాలు, అంతేకాని భారత్‌పై ప్రత్యర్థులు అవలీలగా గెలుస్తారు అని నేను అనడం లేదు. మన సామర్థ్యాన్ని మనం నిరూపించుకొనేందుకు ఇదే సరైన సమయం' అని గంగూలీ తెలిపాడు. ఇక కెప్టెన్ విరాట్ కోహ్లి గురించి మాట్లాడుతూ.. 'విరా ట్‌కు ఈ సిరీస్ ఓ ఆటగాడిగా కంటే ఓ కెప్టెన్‌గా పెద్ద సవాల్. అయితే విరాట్ కూడా మనిషే.. అతను సర్దుబాటు అయ్యేందుకు మనం కాస్త సమ యం ఇవ్వాలి. ఈ పరిస్థితి గతంలో మేము ఎదుర్కొ న్నాం. విరాట్ కూడా కాస్త ఎక్కువ సహనంతో ఉండాలి. ముఖ్యంగా బౌలర్ల విషయంలో తగిన శ్రద్ధ వహిస్తే వాళ్లు మంచి ఫలితాలు ఇస్తారు. రవిశాస్త్రి కూడా కెప్టెన్సీలో విరాట్‌కు సహకరించాలి.. ఇలా జరిగితే విజయం సాధ్యమవుతుంది.' అని అన్నారు.



కాంబ్లీకి సచిన్ సలహా

ముంబై: భారత మాజీ ఆటగాళ్లు సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లీల మధ్య ఉన్న ప్రాణ స్నేహం గురించి క్రికెట్ అభిమానులకు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. వీరిద్దరూ బాల్యం నుంచి ప్రముఖ క్రికెట్ గురువు రమాకాంత్ ఆఛ్రేకర్ వద్ద శిక్షణ తీసుకున్నారు. టీమిండియా తరపున తమ క్రికెట్ కెరీర్‌ను దాదాపు ఒకే సమయంలో ఆరంభించారు. సచిన్ తన అసాధారణ ప్రతిభతో సుదీర్ఘకాలం క్రికెట్ ఆడగా కాంబ్లీ మాత్రం మధ్యలోనే వెనుదిరగాల్సి వచ్చింది. అయితే క్రికెట్‌కు వీడ్కోలు పలికిన తర్వాత మళ్లీ మైదానంలో అడుగుపెట్టడానికి మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ ఇచ్చిన సలహా కారణమని తాజాగా కాంబ్లీ వెల్లడించారు. 'నేను అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత తదుపరి భవిష్యత్ కార్యచరణపై ఆలోచించాను. వ్యాఖ్యానం చేయాలా?లేదా టెలివిజన్ ఎక్స్‌పర్ట్ అవ్వాలా? అనే సందిగ్ధంలో ఉన్నాను. కానీ నాకు క్రికెట్ అంటే ఎంతో ఇష్టం కనుక మళ్లీ మైదానంలో అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నా' అని బాంద్రా కుర్లాలో క్రికెట్ కోచింగ్ అకాడమీని ప్రారంభించిన అనంతరం విలేకరుల సమావేశంలో కాంబ్లీ ఈ విషయం చెప్పారు. సచిన్ టెండూల్కర్‌కు బాగా తెలుసు నేను క్రికెట్‌ను ఎంతగా ఆరాధిస్తానో. అందుకే, నీవు క్రికెట్ కోచింగ్ అకాడమీని ఎందుకు ప్రారంభించ కూడదని సచిన్ నాకు సూచించారని వినోద్ అన్నాడు. ఆ కారణంగానే ప్రస్తుతం సచిన్ చూపిన మార్గంలో తాను పయనిస్తూ అకాడమీ ప్రారంభించానని.. భారత క్రికెట్ చరిత్రలో తొలిసారి వరుసగా రెండు డబుల్ సెంచరీలు బాదిన కాంబ్లీ ఈ సందర్భంగా వెల్లడించాడు.

ప్రపంచ కప్‌లో భారత అంపైర్లు



దుబాయ్: భారత అంపైర్లు అనిల్ చౌదరి, సీకే నందన్‌కు అరుదైన అవకాశం దక్కింది. జనవరి 13 నుంచి న్యూజిలాండ్‌లో జరగనున్న అండర్-19 ప్రపంచకప్ పోటీలకు అంపైర్లగా విధులు నిర్వహించే సువర్ణ అవకాశం దక్కింది. తాజాగా ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌కు అంపైర్లు, మ్యాచ్ రిఫరీల వివరాలను ప్రకటించింది. అనిల్ చౌదరి ఇటీవల భారత్-శ్రీలంక మధ్య జరిగిన సిరీస్‌కు మ్యాచ్ రిఫరీగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఐసీసీ ఎంపిక చేసిన అంపైర్లు ఎవరెవరో చూద్దాం: రాబర్ట్ బైలీ, బ్రాత్ వైట్, అనిల్ చౌదరి, నిగెల్ దుగుడ్, షాన్ జార్జ్, షాన్ హైగ్, మార్క్ హాత్రోన్, డేవిడ్, మార్టినిస్, సీకే నందన్, ఇయాన్ రమేజ్, ఆసన్ రాజా, షోజబ్ రాజా, టిబ్ రాబిన్‌సన్, లాంగ్‌టన్ రుసెరే, పాల్ విల్సన్.

మ్యాచ్ రిఫరీస్..

జెఫ్ క్రోవి, దేవ్‌దాస్ గోవింద్ జీ, ల బ్రూయే. టోర్నీలో మొదటి మ్యాచ్ న్యూజిలాండ్-వెస్టిండీస్ మధ్య జరగనుంది. ఈ మ్యాచ్‌కి ఫీల్డ్ అంపైర్లగా షాన్ జార్జ్, ఆసన్ రాజా వ్యవహరించనున్నారు. ఇప్పటి వరకు భారత్, ఆసీస్ మాత్రమే అండర్-19 ప్రపంచకప్ టోర్నీలో మూడు సార్లు విజేతగా నిలిచాయి. ముంబై ఆటగాడు పృథ్వీ షా నాయకత్వంలోని భారత జట్టు డిసెంబరు 27న న్యూజిలాండ్ బయల్దేరిన సంగతి తెలిసిందే. ఈ జట్టుకు కోచ్ బాధ్యతలను రాహుల్ ద్రవిడ్ నిర్వహిస్తున్నాడు. టోర్నీలో భాగంగా భారత్ తన తొలి మ్యాచ్‌ను జనవరి 14న ఆసీస్‌తో ఆడనుంది.

తెలుగు సాహిత్యాన్ని అన్ని భాషల్లో ముద్రించాలి

- డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
- విశాలాంధ్ర ప్రచురణల ఆవిష్కరణ

విశాలాంధ్ర కల్చరల్-విజయవాడ: తెలుగు సాహిత్యాన్ని దేశంలోని అన్ని భాషల్లో ముద్రించాలని, అప్పుడే మన సాహితీ ప్రాశస్త్యం అందరికీ తెలుస్తుందని పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పేర్కొన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన నాలుగు పుస్తకాలను విజయవాడ పీడబ్ల్యూడీ గ్రౌండ్‌లోని పుస్తక మహోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీవీ సాహిత్య వేదికపై ఆవిష్కరించారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ వెలమల సిమ్మన్న రచించిన 'తెలుగు భాషా చరిత్ర' పుస్తకాన్ని కూడా ఆయన ఆవిష్కరించారు. ఆచార్య సిమ్మన్న భాషా చరిత్ర, ధ్వానా శాస్త్రి పాఠాలు విద్యార్థులకు కరదీపి కలని చెప్పారు. దేశంలోని భాషలకు హిందీ ఓవర్ హెడ్ ట్యాంక్ వంటిదని అభిప్రాయపడ్డారు. పాఠకుడిగా తనకు విశాలాంధ్రతో అనుబంధం ఉందని తెలిపారు. అనంతరం 'మహాభారత చరిత్రము' పుస్తకాన్ని సిమ్మన్న ఆవిష్కరిం చారు. మూడో పుస్తకం 'శత వసంతాల తెలుగు కథ'ను విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ సంపాదకుడు గడ్డం కోటేశ్వర రావు ఆవిష్కరించారు. బహుళతత్వంతో కూడిన సంస్కృ తిని ముందుకు నడిపిస్తున్న పెద్ద పుస్తక పంపిణీ సంస్థ విశాలాంధ్ర అని గడ్డం కోటేశ్వరరావు చెప్పారు. అనంతరం 'విశ్వ కథా శతకం' పుస్తకాన్ని ఆంధ్రా లయోల కళాశాల రీడర్ డాక్టర్ గుమ్మా సాంబశివరావు ఆవిష్కరించారు. సాహిత్య వ్యవసాయ కర్షకుడు సిమ్మన్న అని ఆయన పేర్కొన్నారు.



మాట్లాడుతున్న వైఎల్పీ. వేదికపై సాంబశివరావు, ముప్పాళ్ల, గడ్డం కోటేశ్వరరావు, వెలమల సిమ్మన్న, మనోహర్ నాయుడు

రచయితలకు తోడ్పాటు : ముప్పాళ్ల

విశాలాంధ్ర విజ్ఞాన సమితి అధ్య క్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లా డుతూ రచయితలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా ఆర్థిక తోడ్పాటు అందించడానికి ముందుకొస్తామని చెప్పారు. సాహిత్యంలో వస్తున్న మార్పులన్నింటినీ గమనిస్తూ పాఠకుల అభిరుచికి తగిన విధంగా గతానికంటే భిన్నంగా కొన్ని మార్పులతో పుస్తకాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. ఆచార్య సిమ్మన్న మాట్లాడుతూ తనకు అక్షరమే దేవుడని, విద్యార్థే దైవమని చెప్పారు. తొలుత ఈ కార్యక్రమానికి విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి.మనోహర్ నాయుడు స్వాగతం పలికారు. ప్రజానాట్య మండలి ఏపీ ప్రధాన కార్యదర్శి పి.చంద్రానాయక్, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.

పాతబస్తీకి సీఎం ఎవరో..!

- మెట్రో పనుల్లో జాప్యాన్ని సహించం
- వెంటనే ప్రారంభించకపోతే ఉద్యమం ఉధృతం
- ఓల్డ్‌సిటీ అభివృద్ధిపై నిర్లక్ష్యమెందుకు?
- కేసీఆర్‌కు కె.నారాయణ ప్రశ్న

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: రాష్ట్రానికి కేసీఆర్ ముఖ్యమంత్రైతే పాతబస్తీకి అసదుద్దీన్ ఒవైసీనా? హోంమంత్రి అక్బరుద్దీన్ ఒవైసీనా? పాతబస్తీకి మెట్రో రైలు ఎందుకు తీసుకురావడం లేదంటూ సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ రాష్ట్ర ప్రభు త్వాన్ని ప్రశ్నించారు. తెలంగాణ రాజధాని హైదరాబాద్‌లో సగభాగమైన పాతబస్తీ అభివృద్ధిపై ప్రభుత్వం వివక్ష చూపితే ఊరుకోమన్నారు. నారాయణతో పాటు సీపీఐ నాయకులు పల్లా వెంకటరెడ్డి, టీటీ నరసింహ, పార్టీ నగర కార్యవర్గ సభ్యులు బుధవారం తార్నాక నుంచి అమీర్‌పేట వరకు మెట్రోలో ప్రయాణిం చారు. నారాయణ అమీర్ పేటలో మాట్లాడుతూ, నగరం చుట్టూ మెట్రో ప్రయాణిస్తుంటే పాతబస్తీలో ఇంకా నిర్మాణ పనులు ప్రారంభించక పోవడం వెనుక ఆంతర్యమేమిటన్నారు. పాతబస్తీలో ఉన్నది ప్రజలు కాదా? ఇదేమన్నా పరాయి దేశమా? రాష్ట్రంలో పాతబస్తీ అంత ర్భాగం కాదా? ఎందుకింత నిర్లక్ష్యం? అని ఆయన కేసీఆర్‌ను నిలదీశారు. ఒక్క రాజకీయ పార్టీ ఒత్తిడి వల్లే ప్రభుత్వం పాతబస్తీలో మెట్రో నిర్మాణ పనులను చేపట్టడం లేద న్నారు. పాతబస్తీలో మెట్రో నిర్మాణ పనులు ప్రారంభించకపోతే ఉద్య మాన్ని ఉధృతం చేస్తామని నారాయణ హెచ్చరించారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు ఎం.న ర్సింహ్మా, మహమ్మద్ సలీంఖాన్, రాకేశ్ సింగ్, వీరేశం, చంద్ర మోహన్, ఏఐవైఎఫ్ నగర ఉపాధ్య క్షుడు జి.హరినాథ్ గౌడ్ పాల్గొన్నారు.



Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. R.No.32299/79, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.